www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 260
సోమవారం 12-03-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

జనం సొమ్ము

విగ్రహాల పాలు

- ప్రజా ధనాన్ని గుమ్మరిస్తున్న ప్రభుత్వాలు
- ప్రజా సంక్షేమం కన్నా.. ప్రతిమల స్థాపనే మిన్నగా..
- బీజేపీ పాలిత రాష్ట్రాల తీరిది

4 విగ్రహాలు.. 6,939 కోట్లు





ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు.. వారి బాగోగులు గురించి పట్టించుకోవాలి. అమలు చేసే సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించాలి. కానీ, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని పాలకులు ఇప్పుడు విగ్రహాల ఎత్తుల్లో పోటీపడుతున్నారు. ఎంత ఎత్తులో విగ్రహాన్ని స్థాపిస్తే.. అంత పేరు వస్తుందనేలా ఉంది వారి వ్యవహారశైలి. రాజుల సొమ్ము రాళ్ల పాలు మాదిరిగా ఇప్పుడు ప్రజల డబ్బంతా విగ్రహాల పాలన్న చందంగా మారింది. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు ఈ విగ్రహాల కోసం వేల కోట్ల రుపాయల ప్రజా ధనాన్ని గుమ్మరిస్తున్నాయి. మరోవైపు ఈ విగ్రహాలకు ఇచ్చే విరాళాలకు పన్ను మినహాయింపు ఉండటంతో కోట్లు ఇవ్వడానికి బడా సంస్థలు రెడీ అయిపోతున్నాయి. కేవలం నాలుగు అతిపెద్ద విగ్రహాలను ఈ ఏడాదిలోపు పూర్తిచేసేలా అక్కడి ప్రభుత్వాలు తలమునకలయ్యాయి. బీజేపీ పాలితరాష్ట్రాల్లో నిర్మిస్తున్న ఈ విగ్రహాలతో మూఢ నమ్మకాలు పెరగటానికి ప్రతీక అని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, తాగు నీరు వంటి కనీస అవసరాలను గాలికొదిలేసి, ఇలాంటి కట్టడాల వల్ల జరిగే మేలు ఏమిటో తెలియడంలేదని మేధావులు వాపోతున్నారు.

11లో

- విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి

రాజ్యసభకు టీడీపీ అభ్యర్థులు ఖరారు

రమేష్, రవీంద్రలకు ఛాన్స్





విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
రాజ్యసభకు టీడీపీ నుంచి వెళ్లే అభ్యర్థుల పేర్లను పార్టీ అధిష్టానం ఎట్టకేలకు ఖరారు చేసింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని తన నివాసంలో అభ్యర్థులను ప్రకటించారు. ప్రస్తుత రాజ్యసభ సభ్యునిగా ఉన్న సీఎం రమేష్‌తోపాటు టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు కనకమేడల రవీంద్రకుమార్‌ను ఎంపిక చేశారు. తొలుత సీఎం రమేష్‌తోపాటు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ అనూహ్యంగా రవీంద్రకుమార్ పేరు తెరపైకి వచ్చింది. చివరకు రమేష్, రవీంద్రకుమార్‌లను ఎంపిక చేస్తూ అధినేత ఆమోద ముద్ర వేసారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన సీఎం రమేష్ ముఖ్యమంత్రితో అత్యంత సన్నిహితంగా ఉండడంతోపాటు కడపజిల్లాలో కీలకంగా వ్యవహరిస్తున్నందున మరోసారి ఈ పదవి ఆయనను వరించింది. వివిధ సామాజిక వర్గాల సమీకరణలను పరిగణనలోకి తీసుకొని ఈ కూర్పు చేసినట్లు చంద్రబాబు పార్టీ వర్గాల వద్ద స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇక రెండవ సీటు కేటాయించిన రవీంద్రకుమార్ విజయవాడకు చెందినవారైనప్పటికీ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఈయన హైకోర్టులో ప్రముఖ న్యాయవాది. ఆర్టీసీతో పాటు అనేక సంస్థలు, సంఘాలకు సలహాదారునిగా పని చేశారు. ఈయనను కోస్తా ఆంధ్ర కోటాలో ఎంపిక చేయగా, రాయలసీమ ప్రాంతం నుంచి సీఎం రమేష్‌కు అవకాశం కల్పించినట్లయింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో కర్నూలు జిల్లా నుంచి టీజీ వెంక టేష్ రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. ప్రతిపక్షనేత జగన్ సొంతజిల్లా కడపజిల్లాను ప్రతిష్టాత్మకంగా భావించడం వల్లే రమేష్‌కు మరోసారి అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి భావించినట్లు టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. కడపజిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి కూడా సీటు కోసం చివరి వరకూ ప్రయత్నించారు.



వర్ల రామయ్యకు షాక్

చివరి నిమిషంలో ఊహించని నిర్ణయం
నివ్వెరపోయిన ఆశావహులు, పార్టీ శ్రేణులు
నిరాశతో వెనుదిరిగిన సీనియర్ నేత

3లో

తగ్గిపోతున్న బాలికలు

- భవిష్యత్‌ను భయపెడుతున్న లింగ నిష్పత్తి
- మహిళలకు స్వయంప్రతిపత్తి ఉండాలి
- సానుభూతితో ప్రవర్తించడం సామాజిక బాధ్యత



న్యూఢిల్లీ :
లింగనిష్పత్తిలో భారీ వ్యత్యాసాలు ఉండటం భారత్ భవిష్యత్‌ను భయపెడుతోంది. ఉత్తరభారతంలోనే కాకుండా దక్షిణాదిలో కూడా పితృస్వామ్య ఆలోచనా విధానం పెరగడంతో 2021 లింగనిష్పత్తిలో హెచ్చుతగ్గులు మరింత దారుణంగా ఉంటాయంటున్నాయి. మొదట్లో ఉత్తరాది నగరాలైన పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ పరిమితమైన ఈ సంస్కృతి తూర్పు ఈశాన్య రాష్ట్రాలకు కూడా ఇది పాకడం ఆందోళనాకరంగా మారింది. రెండు దశాబ్దాల నుంచి లింగసమానత్వంపై పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు,రచయిత విజయలక్ష్మీ నందా మాట్లాడుతూ పుట్టబోయే శిశువులు ఆడ-మగా అనేది ముందే ఎంచుకొని వారికి ఇష్టంలేని బిడ్డయితే గర్భవిచ్ఛిత్తికి పాల్పడటం భవిష్యత్ భారత్‌కు పెనుసవాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు వెల్లడిచారు. రోజురోజుకు లింగవివక్ష ఎక్కువై బాలల లింగ నిష్పత్తి (సీఎస్ఆర్)లో భారీ అంతరాలు పెరిగాయని ఢిల్లీ వర్సిటీలోని పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ మిరందా వెల్లడించారు. కొన్ని దశాబ్దాలుగా సీఎస్ఆర్ గ్రాఫ్ పడిపోతూనే ఉందన్నారు. 1981లో 1000 మంది బాలురకు 971 మంది బాలికలు ఉండగా, 1991 నాటికి అది- 945కి, 2001 నాటికి -927కు 2011కు -919కు బాలికల నిష్పత్తి పడిపోయిందన్నారు. మహారాష్ట్ర పరిస్థితిలో కాస్త మార్పు వస్తుండగా, హర్యానాలోని కొన్ని జిల్లాల్లో నిష్పత్తి తేడా దారుణంగా ఉందన్నారు. తూర్పు రాష్ట్రం గుజరాత్‌లో పరిస్థితికూడా

- మిగతా 2 లో



మంటల్లో చిక్కుకున్న విద్యార్థులు


యువతి మృతి: పలువురికి గాయాలు

చెన్నై :
తమిళనాడులోని తేని జిల్లా బోడి సమీపంలోని కురంగణి అడవుల్లో ఆదివారం చెలరేగిన మంటల్లో దాదాపు 60 మంది విద్యార్థులు చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో ఒక యువతి చనిపోగా, పలువురికి గాయాలయ్యాయి. ఈరోడు, కోయంబత్తూరు నుంచి కళాశాల విజ్ఞాన యాత్ర కోసం విద్యార్థులు అడవుల్లోకి వెళ్లారు. ఆ సమయంలో ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో విద్యార్థులు మంటల్లో చిక్కుకున్నారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అధికారులు వారిని రక్షించేందుకు యత్నిస్తున్నారు. బలమైన గాలులు వీస్తుండటంతో

- మిగతా 2 లో

హోటళ్ల నిలువు దోపిడీ

- తిరుమలలో రెండు పొంగళ్లు, రెండు వడ రూ. 284
- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు



విశాలాంధ్ర - తిరుపతి :
భక్తిశ్రద్ధలతో తిరుమల యాత్రకు వెళుతున్న భక్తులను అక్కడి ప్రైవేటు హోటళ్లు దోచుకుంటున్నాయి. హైదరాబాద్ హైకోర్టు హోటళ్ల అక్రమాలను నియంత్రించడంలో విఫలం చెందినందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పై ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు నెలల క్రిందట హైకోర్టు జోక్యం చేసుకున్నప్పటికీ టీటీడీ మేల్కొనక పోవడంతో హోటళ్లలో అత్యధిక రేట్లకు ఆహార పదార్థాలను అమ్ముతున్నారు. రెండు పొంగళ్లు, రెండు వడలు తిన్నందుకు జీఎస్టీతో కలిపి రూ. 284 బిల్లు వేశారు. ఈ బిల్లు చూసిన భక్తులు షాక్‌కు గురవ్వాల్సి వచ్చింది. ఎందుకింత ఎక్కువగా బిల్లు వేశారని సదరు వినియోగ దారులు హోటల్ సిబ్బందిని అడగగా, ఈ రేట్లకు అమ్మటానికి మాకు అధికారిక అనుమతి ఉందని వారు సమాధానం చెప్పడంతో వారితోపాటు ఉన్న స్థానికులు కూడా బిత్తరపోయారు. ఇది ఒక చిన్న ఘటన మాత్రమే.. చాలా మంది భక్తులు ఏడుకొండలవాని దర్శనానికి వచ్చి వారు అడిగినంత చెల్లించి మౌనంగా వెళ్లిపోతున్నారు. ఎక్కువ ధరలకు టెండర్లు వేసినవారే అనుమతులు దక్కించుకొని భక్తులను దోచుకుంటున్నారు. టీటీడీ ఆదేశాలను తప్పించుకునేందుకు వారు రెండు రకాల బిల్లులను వాడుతున్నారు. ఒకటి అధిక రేట్లు ఉండగా, మరొకటి టీటీడీ రేట్ల ప్రకారం ఉంటోంది. దీన్నే ఫైలింగ్‌లో వాడుతూ, విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో చూపుతున్నారు. దీంతో వీరి దందాకు తెరపడటం లేదు. తిరుమలలోని చాలా హోటళ్లలో ఆహారపదార్థాల రేట్ల పట్టిక ఉండటం లేదు. ఇక్కడ ఆసక్తి గొలిపే విషయం ఏమంటే వారం క్రిందట టీటీడీ అధికారులు అన్నపూర్ణ, సన్నిధానం హోటళ్ల లీజుకు టెండర్లు పిలిచారు. వీటికి స్పందన బాగానే వచ్చింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇంతవరకు టెంటరు పెట్టెలను తెరువలేదు. మరో ఐదు జనతా హోటళ్ల టెండర్లను కూడా పెండింగ్‌లో ఉంచారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాల్సిన

- మిగతా 2 లో

నిరుపయోగంగా మైనారిటీ నిధులు

9లో

ఇదీ లోకం!





మృత్యువేగం

- కారు, బస్సు ఢీ
- నలుగురు కేరళవాసుల దుర్మరణం

విశాలాంధ్ర - బంగారుపాళ్యం :
చిత్తూరు జిల్లా మాధవనగర్‌లోని చెన్నై -బెంగుళూరు జాతీయరహదారిలో ఆదివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డుమాదంలో నలుగురు కేరళవాసులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. కేరళరాష్ట్రం కాసరిగాడ జిల్లా కుంబ్లీ, మధుర గ్రామాలకు చెందిన కుటుంబీకులు తిరుమల వెంకన్న దర్శనార్థం కారులో శనివారం మధ్యాహ్నం బయలుదేరారు. రాత్రంతా ప్రయాణించి వేకువజాము 3.30 గంటలకు

- మిగతా 2 లో

సిట్ నివేదికపై చర్యలేవి?

- భూఆక్రమణలపై 40 రోజులైనా స్ట్రాంగ్‌రూంలోనే నివేదిక
- పదివేల ఎకరాలకు పైగా భూకబ్జా

విశాలాంధ్ర - విశాఖపట్నం :
రాష్ట్రాన్ని కుదిపేసిన విశాఖ భూ కుంభకోణాల బాధ్యులపై చర్య తీసుకునేందుకు ప్రభుత్వం ఇంకా మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది. ఈ కుంభకోణాలతో ప్రమేయం ఉన్న వారిలో అధికార పార్టీ నేతలు అధిక సంఖ్యలో ఉండడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ప్రతిపక్షాల ఆందోళన నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ బృందం మూడు నెలలపాటు దర్యాప్తు చేసి భూ కబ్జాలపై ప్రత్యేక నివేదికను తయారుచేసి నివేదికను తయారుచేసింది. సీపీ యోగానందకు సిట్ సభ్యులు 40 రోజుల క్రితం నివేదికను సమర్పించారు. అప్పటి నుంచి ఆ నివేదిక స్ట్రాంగ్ రూంలోనే భద్రంగా ఉంది తప్ప చర్యలకు ప్రభుత్వం ముందుకు సాగడం లేదు. ఆరంభంలో నానా హడావుడి చేసిన సిట్ బృందం విచారణ ముగియగానే గుట్టు చప్పుడు కాకుండా సీపీ యోగానందకు నివేదిక సమర్పించింది. తరువాత ఎవరి విధుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. నివేదికలో ఏముందో, ఎన్ని ఎకరాల భూమి కబ్జా జరిగిందో వెలుగు చూడని పరిస్థితి నెలకొంది. కనీసం అసెంబ్లీ

- మిగతా 2 లో



కాపులుప్పాడలో గబ్జాకు గురైన 9ఎకరాల భూమి

రైతుల మహాముట్టడి నేడే

ముంబై చేరిన పాదయాత్ర
పెరుగుతున్న మద్దతు

9లో

ఇక ఏడాది పొడవునా ఓటర్ల నమోదు

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

9లో

వాతావరణ మార్పులపై పోరుకు వేదాలే శరణ్యం

ప్రధాని నరేంద్ర మోడీ

అర్జంటైనాలో జీ 20 సమ్మిట్

బ్యూనస్ ఎయిర్స్ : జీ-20 గ్రూప్ దేశాల మంత్రుల శిఖరాగ్ర సమావేశం (సమ్మిట్) ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు అర్జంటైనాలో జరుగుతుంది. ఈ సమావేశంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఫ్రెంచ్ క్రిస్టినా లగార్డే పాల్గొంటారు. ఈ సందర్భంగా లగార్డే అర్జంటైనా అధ్యక్షులు మౌరికియో మాక్రి తదితర మంత్రులతో మాట్లాడుతారని స్థానిక మీడియా తెలిపింది.

లగార్డేతో పాటు ఐఎంఎఫ్ ఉన్నత స్థాయి అధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. 19 దేశాల ఉన్నతస్థాయి అధికారులు, యూరోపియన్ యూనియన్ దేశాల నేతలు హాజరవుతున్నారు. చిలి, నెథర్లాండ్స్, స్విట్జర్లాండ్, సింగపూర్ దేశాల నేతలు ఆహ్వానితులుగా పాల్గొంటారు. ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ ఐఎల్ఓ ప్రతినిధులు కూడా ఇందులో పాల్గొంటారు. జీ-20 గ్రూప్ దేశాల అధ్యక్ష బాధ్యతలను ఈ ఏడాది అర్జంటైనా స్వీకరిస్తుంది.

దౌత్యవేత్తల భద్రత బ్రిటన్‌దే

టెహ్రాన్ : బ్రిటన్‌లో తమ రాయబార కార్యాలయంపై జరిగిన దాడిని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. అక్కడున్న దౌత్యవేత్తల భద్రత బాధ్యత బ్రిటిషు అధికారులదేనని ఇరాన్ పేర్కొన్నది.

ఇస్లామిక్ రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పదునైన ఆయుధాలను ధరించిన కొంతమంది తమ రాయబార కార్యాలయంపై దాడిచేసినట్టుగా లండన్‌లోని ఇరాన్ దౌత్యకార్యాలయ అధిపతి హమీద్ బైదినెయాద్ సోషల్ నెట్‌వర్క్ ద్వారా తెలిపారు. భవనం వెలుపల నుంచే దాడికి ప్రయత్నించారని, తమ సిబ్బంది అంతా సురక్షితంగానే ఉన్నారని ఆయన తెలిపారు. ఇరాన్‌లో ఉన్న బ్రిటన్ రాయబారి నికొలస్ హోప్‌టన్‌కి ఇరాన్ విదేశాంగ శాఖ డిప్యూటీ మంత్రి అబ్బాస్ అరాక్చి లండన్‌లో జరిగిన ఘటనను తెలిపారు. తమ దౌత్యవేత్తలకు, సిబ్బందికి పూర్తి రక్షణ కల్పించాలని ఆయన డిమాండు చేశారు.

వాణిజ్యంపై ఈయూ నీచంగా చూస్తోంది : ట్రంప్



వాషింగ్టన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాలు, చైనా నుంచి దిగుమతి చేసుకునే స్టీల్, అల్యూమినియం వస్తువులపై నూతనంగా సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే, ఈ విషయంలో ఈయూ తమను నీచంగా చూస్తోందని ట్రంప్ ఆవేదన చెందారు. ఈయూ అనుసరించే భయంకరమైన అడ్డంకులను తొలగించకపోతే తాము కూడా కార్లు ఇతర ఉత్పత్తులపైన పన్నులు వేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈయూలో అద్భుతమైన దేశాలున్నాయని, అయితే తమను వాణిజ్యం విషయంలో నీచంగా చూస్తున్నారని అన్నారు. స్టీల్‌పై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం దిగుమతి సుంకాలను విధిస్తూ రెండు రోజుల క్రితం ట్రంప్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిర్ణయం 15 రోజుల్లో అమలు అవుతుంది. అయితే, కెనడా, మెక్సికో దిగుమతులపై సుంకాలు విధించలేదు. ఈ రెండు దేశాలతో అమెరికాకు భద్రతా సంబంధం ఒప్పందం ఉండడమే వాటిని వదిలివేయడానికి కారణంగా భావిస్తున్నారు. అమెరికా ప్రకటనపైన ఈయూ, జపాన్ అధికారులు అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్టు లిథిజర్‌ను బ్రస్సెల్స్‌లో కలుసుకుని కెనడా, మెక్సికోలకు ఇచ్చిన మినహాయింపునే తమకు కూడా ఇవ్వాలని కోరారు. ట్రంప్ నిర్ణయం ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుంచి విమర్శలకు గురైంది. ట్రంప్ పార్టీ రిపబ్లికన్ పార్లమెంట్ సభ్యులు కూడా పలువురు విమర్శించారు. దాదాపు వంద మందికిపైగా ఎంపీలు ఈ నిర్ణయాన్ని విమర్శిస్తూ ట్రంప్‌కు లేఖరాశారు.

వాణిజ్య యుద్ధంతో విధ్వంసమే : చైనా



బీజింగ్ : అమెరికా ప్రకటించిన వాణిజ్యయుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విధ్వంసానికి దారితీస్తుందని చైనా వాణిజ్యశాఖ మంత్రి జాంగ్ షాంగ్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, సుంకాలను విధిస్తూ ట్రంప్ చేసిన ప్రకటన ప్రపంచ వృద్ధిని దెబ్బతీస్తుందని అన్నారు. స్నేహ దేశాల ఒత్తిళ్ల మేరకు అమెరికా సుంకాలలో కొంత మినహాయింపు ఇచ్చింది. లోహ వస్తువుల దిగుమతిపై సుంకాల విధింపు నుంచి మినహాయించాలని యూరోపియన్ యూనియన్, జపాన్‌లు ట్రంప్‌కు విజ్ఞప్తి చేశాయి. ట్రంప్ ప్రధానంగా చైనాను దృష్టిలో ఉంచుకుని స్టీల్, అల్యూమినియం ఉత్పత్తుల దిగుమతులపై టారీఫ్‌లను విధించారు. తమ న్యాయమైన హక్కులను, ప్రయోజనాలను తాము తప్పనిసరిగా కాపాడుకుంటామని చైనా ట్రంప్ ప్రకటనకు స్పందించింది. పార్లమెంట్ వార్షిక సమావేశాల సందర్భంగా జాంగ్ మాట్లాడుతూ, వాణిజ్యయుద్ధాన్ని తాము కోరుకోవడం లేదని, అదే సమయంలో తాము ప్రారంభించబోమని తెలిపారు. వాణిజ్య యుద్ధంలో విజేతలు వుండరని జాంగ్ తెలిపారు. అది చైనా అమెరికాలకే కాక, ప్రపంచానికి విధ్వంసాన్ని కలిగిస్తుందని జాంగ్ చెప్పారు. అయితే, తాము ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలమని తమ ప్రయోజనాలను రక్షించుకుని తీరుతామని ఈ విషయాలపై అమెరికాతో చర్చలు జరిపే అవకాశం ఉందని జాంగ్ చెప్పారు. అమెరికా స్వీయరక్షణవాదంతోనే సుంకాల విధింపు ప్రకటన చేసిందని మిత్ర దేశాలతో సహా అనేక దేశాలు విమర్శించాయి. ట్రంప్ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మార్కెట్లను కల్లోలపరిచాయి.

నవాజ్‌పై చెప్పువిసిరన విద్యార్థి

విదేశాంగ మంత్రి ముఖంపై సిరా



లాహోర్ : పాకిస్థాన్ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్‌పై ఒక విద్యార్థి చెప్పు విసరగా, విదేశాంగ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ముఖంపై మరో విద్యార్థి సిరా పూశాడు. లాహోర్‌లో ఆదివారం జరిగిన మత కార్యక్రమంలో పాల్గొన్న షరీఫ్‌పైన చెప్పు విసరగా, సొంత పట్టణం సియాల్‌కోట్‌లో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆసిఫ్ మాట్లాడుతుండగా ఆయన ముఖంపై సిరా పూశారు. షరీఫ్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడేందుకు సిద్ధపడుతుండగా విద్యార్థి నినాదం చేస్తూ చెప్పువిసరగా అది భుజం, చెవికి రాసుకుంటూ వెళ్లిపోయింది. షరీఫ్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ దగ్గరకు వెళ్లగలిగాడు. భద్రతా సిబ్బంది ఆ విద్యార్థిని, అతనికి సహకరించిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని చితక్కొట్టారు. అనంతరం వారిని పోలీసులకు అప్పగించారు. చెప్పు విసిరిన వ్యక్తిని అబ్దుల్ గఫార్‌గా గుర్తించారు. ఈ ఘటన జరిగిన అనంతరం ఆ ప్రాంతంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. షరీఫ్ చేసిన ప్రసంగంలో ఈ ఘటనను ఉదహరించలేదు. సియాల్‌కోట్‌లో ఆసిఫ్‌పై సిరా పోసిన వ్యక్తిని ఫియాద్ రసూల్‌గా గుర్తించారు. రాజ్యాంగంలో మతప్రవక్తకు సంబంధించిన అంశాన్ని సవరించినందుకుగానూ తనకు కోపం వచ్చిందని, అందువల్లనే సిరా పూశానని ఫియాద్ రసూల్ పోలీసులకు చెప్పాడు.

అక్కడ మహిళలకే అనుమతి



హెల్సింకి : ఫిన్లాండ్‌లో ఒక పారిశ్రామికవేత్త కొత్త ప్రయోగం చేశారు. సూపర్ షి ఐలాండ్ పేరుతో ఒక ద్వీపాన్ని ఏర్పాటు చేశారు. కోస్తా తీరంలో ఏర్పాటు చేసిన ఈ ఐలాండ్‌లోకి కేవలం మహిళలను మాత్రమే అనుమతిస్తారు. అక్కడ విందు, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది జూలైలో ఈ ఐలాండ్‌ను ప్రారంభిస్తారు. నిత్యజీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను, సమస్యలను అధిగమించి వినోదించేందుకుగానూ మహిళలకు ఈ ప్రాంతం ఎంతగానో ప్రయోజనం కల్పిస్తుందని ఐలాండ్‌ను నిర్మించిన క్రిస్టినా రాత్ తెలిపారు. ఈ ఐలాండ్‌లో నాలుగు విలాసవంతమైన క్యాబిన్‌లు ఉంటాయి. ఈ క్యాబిన్‌లో ఒక్కొక్కసారి పది మంది చేరి పరస్పరం పరిచయం చేసుకోవడం, స్నేహం పెంచుకోవడం లాంటి కార్యకలాపాలు నిర్వహిస్తారు. లైఫ్‌స్టయిల్ బ్లాగ్‌ని ఇందుకోసం ఏర్పాటు చేసి మహిళల మధ్య స్నేహసంబంధాలు, వారిలో ధైర్యసాహసాలను పెంపొందించేందుకు కార్యక్రమాలను రూపొందిస్తారని తెలిపారు. ఈ ఐలాండ్‌ను ఏర్పాటు చేసిన పారిశ్రామికవేత్త కూడా మహిళే. గత రెండేళ్లుగా తాను అనేక ప్రాంతాలలో పర్యటించి ఎంతో ఉత్తేజకరమైన మహిళలను కలుసుకున్నానని రాత్ అన్నారు. తీరప్రాంతం ఎంతో అందంగా ఉంటుందని అందువల్లే ఇక్కడ సూపర్ షి ఐలాండ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ప్రాంతాన్ని తమ స్నేహితుడు పరిచయం చేశాడని, ఆ తరువాత కాలంలో ఐలాండ్‌ను మరింత అందంగా తీర్చిదిద్దామని ఆమె అన్నారు.

చైనా అధ్యక్షుడి గడువు పరిమితి రద్దు



బీజింగ్ : చైనా అధ్యక్ష పదవికి గల గడువు పరిమితిని రద్దుచేస్తూ ఆదివారం పార్లమెంట్ తీర్మానించింది. దీనివల్ల ప్రస్తుత అధ్యక్షుడు జిన్‌పింగ్ జీవితకాలపు అధ్యక్షుడుగా కొనసాగేందుకు అవకాశం కలుగుతుంది. దేశాన్ని ఆర్థిక, సైనిక సూపర్ పవర్‌గా తీర్చిదిద్దేందుకు ఇది వీలుకలిగిస్తుందని భావిస్తున్నారు. చరిత్రాత్మకమైన ఈ నిర్ణయం అమలులోకి వచ్చేందుకు రాజ్యాంగ సవరణను పార్లమెంట్ ఆమోదించింది. 2958 మంది సభ్యులు సవరణకు అనుకూలత వ్యక్తం చేయగా, ఇరువురు వ్యతిరేకించారు. ముగ్గురు సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ సవరణకు సంబంధించిన తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో ముందుగా జిన్‌పింగ్ తన ఓటు వేశారు. గతంలో రెండుసార్లు మాత్రమే ఒక వ్యక్తి అధ్యక్ష పదవిలో ఉండేందుకు వీలుగా రాజ్యాంగంలో పొందుపరిచారు. పదవీకాలం ఐదేళ్లు, జిన్‌పింగ్ 2012లో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికై ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్న జిన్‌పింగ్ పదవీకాలం 2023తో ముగుస్తుంది. అయితే, పార్లమెంట్ కొత్తగా చేసిన నిర్ణయం ప్రకారం 2023 తరువాత కూడా జిన్‌పింగ్ అధ్యక్షుడుగా కొనసాగేందుకు వీలుకలుగుతుంది.

చర్యలేవి?

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాల్లో అయినా ఈ విషయం చర్చకు వచ్చేనా అని విశాఖ వాసులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో 2011-12 మధ్య వివిధ భూ రికార్డుల్లో రెండు, మూడు ఎంట్రీలు జరిగినట్లు గుర్తించారు. ఆ సమయంలో విచారణ జరిపిన సిట్ సభ్యుడు పార్థసారథి ఈ వ్యవహారంపై 2015లో భూ కుంభకోణాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించినా పట్టించుకోలేదు. ఈ కారణంగానే అధికారులు సుమారు 50కి పైగా ఎంట్రీలు చేసి కబ్జాలను ప్రోత్సహించారని సిట్ ప్రాథమికంగా తేల్చింది. విశాఖ శివారు ప్రాంతాల్లో భూముల ధరలు చుక్కలనంటిన నేపథ్యంలో అధికార పార్టీ నేతలు కొంతమంది అధికారుల అండతో 2014 తరువాత జాగా కనిపిస్తే పాగా వేసేందుకు సిద్ధమయ్యారు. ఆర్ఓఆర్ చట్టప్రకారం ప్రొవిజనల్ పట్టా ఇవ్వడానికి వీలు లేదు కానీ జిల్లాలో అన్ని మండలాల్లో పట్టాలు జారీ చేసి వందల ఎకరాలు ధారాదత్తం చేసినట్లు సిట్ విచారణలో తేల్చినట్లు తెలిసింది. ఎన్ఓసీల్లో దాదాపు 90 శాతం అవకతవకలు జరిగినట్టు నిర్ధార ణకు వచ్చామని ఆ మేరకు భూ కేటాయింపులు రద్దు చేయాలని సిట్ సిఫార్సు చేసింది. భూ ఆక్రమణలపై 300 కేసులు నమోదుకు సిఫార్సుతోపాటు తహశీల్దార్ నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఐఏఎస్ స్థాయి అధికారులకు సంబంధించి సుమారు 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదుకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. మరో 43 మంది ప్రైవేటు వ్యక్తులపై కూడా భూ కబ్జా కేసులు నమోదు చేయాలని సిట్ సిఫార్సు చేసింది. సిట్ బృందంలో పని చేసిన ఏ ఒక్కరూ నివేదికలో పొందుపరిచిన సిఫార్సులపై నోరు మెదపడానికి సాహసించడం లేదు. దీని వెనుక ప్రభుత్వ పెద్దల ఒత్తిడిలే అధిక స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిట్ విచారణలో భూ కుంభకోణాలపై విపక్షాలు ఆరోపిస్తున్న స్థాయిలోనే సిట్ నిగ్గు తేల్చినట్లు తెలిసింది. దాదాపు 10 వేల ఎకరాలకు పైగా భూములు కబ్జా అయినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చింది. నివేదిక బయటపడితే ప్రభుత్వం పరువు పోతుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు గగనమే అని భావించిన ప్రభుత్వ పెద్దలు సిట్ నివేదికను స్ట్రాంగ్ రూంలోనే భద్రపరిచారు. ఈ భూ కబ్జాల్లో అత్యధికులు అధికార పార్టీకి చెందిన కీలక ప్రజా ప్రతినిధులు, నేతలు ఉన్నట్లు తెలుస్తోంది.



సిట్ సభ్యులు జేసీ సృజన సారథ్యంలో నగర పోలీస్ కమిషనర్ యోగానంద్‌కు అందజేస్తున్న సిట్ నివేదిక

విశాఖ రూరల్ మండల పరిధిలో ఎక్కువ ఆక్రమణలు జరిగాయి. మధురవాడ, కొమ్మాది, పీఎంపాలెం, పరదేశి పాలెం, భీమిలి మండలాల్లోనే కబ్జాలు, రికార్డుల ట్యాంపరింగ్ జరిగినట్లు సిట్ గుర్తించింది. ముఖ్యంగా రిటైర్డ్ తహశీల్దార్ డీటీవీ రామారావు పని చేసిన కాలంలోనే ఈ రెండు మండలాల్లో భారీ భూ కుంభకోణాలు జరిగినట్లు సిట్ నిర్ధారించింది. ట్యాంపరింగ్ కేసులో అరెస్ట్ అయిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జీవిఎల్ గణేశ్వర రావు, రిటైర్డ్ తహశీల్దార్ డీటీవీ రామారావుతోపాటు తాజాగా విశాఖ ఆర్డీఓపై ఆరోపణలు అధిక సంఖ్యలో వినిపిస్తున్నాయి. మొత్తానికి సిట్‌ను వేసి చేతులు దులుపుకున్న చంద్రబాబు సర్కారు చర్యలకు మాత్రం సాహసించలేకపోతున్నదన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

నిలువు దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

కొత్త జనతా హోటళ్ల టెండర్ల ప్రక్రియపై అధికారులు ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు. ఈ మధ్యకాలంలో టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీవీఎస్‌డీ) రవికృష్ణ బృందం కొన్ని హోటళ్లపై దాడి చేసి ఆహారపదార్థాల రేటు పట్టిక ఉంచకపోవడంపై కేసులు నమోదు చేసి, అక్రమాలకు పాల్పడుతున్న యజమానులను హెచ్చరించారు. టీటీడీ ఒప్పంద పత్రంలో పేర్కొన్న రేట్లను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విజిలెన్స్ ఫిర్యాదుల పెట్టెను, సెల్ నెంబర్లను తిరుమలలోని అన్ని ప్రాంతాల్లో ఉంచి, భక్తులకు అందుబాటులో ఉండి హోటళ్ల అక్రమా లను అరికడతామని రవికృష్ణ వెల్లడించారు.

మంటల్లో చిక్కుకున్న విద్యార్థులు

(మొదటిపేజీ తరువాయి)

మంటలు చెలరేగుతున్నాయి. దీంతో విద్యా ర్థులను రక్షించే ప్రయత్నానికి అంతరాయం కలుగుతోంది. సుమారు కిలోమీటర్ మేర మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలానికి కలెక్టర్, ఎస్పీ, పోలీసులు చేరుకున్నారు. విద్యార్థులతో సమాచార సంబంధాలు తెగిపోవ డంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గిపోతున్న బాలికలు

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనా కరంగా ఉందని, అమెరికాలో చదువుతున్న కుమార్తె తల్లి ఒకరు తెలిపారు. ఆమె భర్త ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. లింగనిష్పత్తిని పెంచేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను కూడా నందా పుస్తకరూపంలో తెచ్చారు. చాలా ఏళ్లుగా సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్న ఆమె ప్రభుత్వ పాలసీలను, కార్యక్రమాలు, చట్టాలు, పథకాలను లోతుగా పరిశీలించారు. మగపిల్లలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ, ఆడపిల్లలు అని తెలియగానే అబార్షన్లు చేయించు కుంటున్నారన్నారు. చిన్న కుటుంబాల్లోకూడా పెద్ద పెద్ద ఆశలు ఉండటం, గ్రామీణుల ఆలోచనా ధృక్పదంలో కూడా మార్పురావడంతో పరిస్థితి దిగజారడానికి కారణమన్నారు. ఏది ఏమైనా లింగ నిర్ధారణ చేయించుకోకుండా చూడటంలో రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని, ఇప్పుడు మారు మూల ప్రాంతాల్లో కూడా లింగనిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ విషయంలో కొంతమంది డాక్టర్లకు రాజకీయ నాయకుల అండదండలున్నాయన్నారు. పునరుత్పత్తిలో వీర్యం (స్మెర్మ్) వేరు చేయడం, దయాగ్నసిస్ సౌకర్యాలు వంటి నూతన సాంకేతికత అందుబాటులోకి రాగానే తల్లిదండ్రుల కోరిక మేరకు చట్టవ్యతిరేకంగా అబార్షన్‌లు చేసే సంస్థలు కుప్పలు తెప్పలుగా పుట్టుకొచ్చాయన్నారు. చట్టంతో సమాజ ధోరణిని మార్చలేమని, అయితే ఆలోచనా విధానంలో మార్పు తీసుకు రావడం ఒక్కటే మార్గమన్నారు. చాలామందిలో ఆడపిల్ల అనగానే వారి భద్రతపై భయం పెంచుకుంటారని, లేదా వారి పెళ్లి కోసం చాలా ఖర్చు చేయాల్సి ఉంటుందన్న భావనలో ఉంటారని నందా వివరించారు. నాణ్యతలేని చదువులతో ఆడపిల్లల్లో కూడా నిరుద్యోగం పెరిగిపోవడం కూడా లింగనిష్పత్తి తేడాలకు కారణమవుతుందన్నారు. బాలికలు -బాలురను ఒకే విధంగా చూసే మనస్తత్వాన్ని మహిళలు అలవరచుకోవాలన్నారు. 'బాలికలను రక్షించండి' అనేది ఒక పాతపడిన నినాదంలా కాకుండా వారిపుట్టుక, పెరుగుదలకు రక్షణ కల్పించాలన్నారు. 'ఆడపిల్లలను రక్షించండి - వారిని చదివించండి' (బేటీపడావో-బేటీ బచావో) పథకం గురించి ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ బాలికలపట్ల అపోహలు తొలగించుకొని వారి అభ్యున్నతికి పథకాలు ప్రవేశపెట్టి శక్తివంతమైన నాయకత్వంలో వాటిని అమలు చేయాలన్నారు. బాలబాలికలు ఎవరైనా ఒకటే అనే ఏకీకరణ వాదంతో మహిళలకు ఆస్తులు, స్వయంప్రతిపత్తి, వృద్ధాప్యం (ఎస్సెట్స్, అటానమి, ఏజింగ్)లలో సమాన హక్కులు కలిగి ఉండేలా చూడాలన్నారు. మహిళలు తమ ఆస్తులను రక్షించుకోవడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలన్నారు. తననుతాను రక్షించుకునే సమర్థతతోపాటు నిర్ణయాధికారం, శారీరక ధారుడ్యం కలిగి ఉండాలన్నారు. వృద్ధాప్యంలో రక్షణకోసం కుమారుడే సరైన వాడని భావించడం తగదన్నారు. మగువల పట్ల అన్ని వర్గాలు సానుభూతితో ప్రవర్తించడం సామాజిక బాధ్యతగా భావించి, పాఠశాలల్లో బోధనాశంగా లింగసమానత్వాన్ని చేర్చాలన్నారు. సమాజం అంతా ఈ ప్రక్రియను అమలు చేసినప్పుడే పరిస్థితి మెరుగవుతుందన్నారు. ఆడపిల్లలను ఆ..డపిల్లగా చూడకుండా తండ్రులు కూతురు పుట్టుకను వేడుకగా నిర్వహించే రోజుకోసం ఎదురు చూస్తున్నానని నందా వెల్లడించారు.

రాజ్యసభ టీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు

సంతోష్, లింగయ్య, ప్రకాష్‌లకు అవకాశం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 3 రాజ్యసభ సీట్ల అభ్యర్థులను ఆదివారం టీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఊహించిన విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సమీప బంధువు జోగినపల్లి సంతోష్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు బీసీలకు ముఖ్యమంత్రి అవకాశం కల్పించారు. జోగిపల్లి సంతోష్‌కుమార్‌తో పాటు నల్లగొండ జిల్లాకు చెందిన బడుగుల లింగయ్యయాదవ్, వరంగల్ జిల్లాకు చెందిన బండ ప్రకాష్ ముదిరాజ్‌లను రాజ్యసభ అభ్యర్థులుగా టీఆర్ఎస్ఎల్పీ అమోదించడంతో కేసీఆర్ పార్టీ అధ్యక్షుని హోదాలో వీరి పేర్లను ప్రకటించారు. సోమవారం ఈ ముగ్గురు తమ నామినేషన్లను దాఖలు చేయనున్నారు. ముందుగా జైపాల్‌యాదవ్, నోములనర్సింహయ్యల పేర్లు బలంగా వినిపించినప్పటికీ అనూహ్యంగా ఇరువురు పేర్లు తెరవెనుకకు వెళ్ళిపోయ్యాయి.

సంతోష్‌కుమార్ రాజకీయ ప్రస్థానం

ప్రస్తుత రాజ్యసభ అభ్యర్థుల్లో జోగినిపల్లి సంతోష్‌కుమార్ కరీంనగర్ జిల్లాలోని బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందినవారు. ఆయన ఎంబీఏ వరకు చదువుకుని కేసీఆర్ ప్రారంభించిన టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు అన్ని రకాలుగా సహాయసహకారాలు అందించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సహాయ నిధి కేటాయింపుల్లో కీలక పాత్రపోషిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు. టీఆర్ఎస్‌కు సంబంధించిన టీన్యూస్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆయన కేసీఆర్‌కు సమీప బంధువు కూడా కావడం విశేషం.

బడుగులు లింగయ్య ప్రస్థానం

నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారామ్‌కు చెందిన బడుగులలింగయ్య బీఏ, బీఈడీ చదివారు. అనంతరం రాజకీయాలపై అసక్తితో 1982లో టీడీపీలో చేరి చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ 1985-87లో కేతేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షునిగా, 1987-97మధ్యలో కేతేపల్లి మండల టీడీపీ మండల పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. అనంతరం ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించి 1995లో భీమారాం నుంచి ఎంపీటీసీ సభ్యునిగా గెలుపొందారు. 1998-2012 మధ్యలో టీడీపీ నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా సుధీర్ఘకాలం పనిచేశారు. 2009లో మహాకూటమి తరుపున స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీగా పోటీ చేసి 26 ఓట్లతో నేతి విద్యాసాగర్ చేతిలో ఓడిపోయారు. 2012-2015 మార్చి వరకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పనిచేస్తూ పార్టీకి రాజీనామా చేసి, 2015 మార్చి 16న సీఎం కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరి పార్టీని బలోపేతం చేస్తున్నారు.

డా.బండాప్రకాష్ ప్రస్థానం

వరంగల్ జిల్లాలోని హన్మకొండకు చెందిన బండా ప్రకాష్ ఎంఏ, పీహెచ్‌డీ చేశారు. కార్మిక సంఘాల నాయకునిగా, విద్యా సంబంధిత పదవులతో పాటు క్రీడలు, సాంస్కృతిక సంస్థల అనుబంధం సంఘాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ప్రకాష్‌కు వుంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు. స్వచ్ఛంధ సంస్థల్లో ఆయన కీల పదవులు చేపట్టడంతో పాటు వాటికి అండగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఆయన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ ముదిరాజ్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. 1981-84లో వరంగల్ మున్సిపల్ కౌన్సిల్‌లో వైస్ చైర్మన్‌గా 1982-83లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సభ్యులుగా పనిచేశారు. బీసీలకు పెద్దపీట వేయడంపై టీఆర్ఎస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజ్యసభ అభ్యర్థులుగా కేసీఆర్ సమర్థులను ఎంపిక చేశారని పార్టీ వర్గాలు అంటున్నాయి.

మృత్యువేగం

(మొదటిపేజీ తరువాయి)

బంగారుపాళ్యం మండలం మాధవనగర్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయినప్పుడు తిరుపతి నుండి బెంగుళూరుకు వెళుతున్న ప్రైవేటు ఓల్వో బస్సు ఢీకొన్నది. ఈఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు పకీరుగట్టి(75), గిరిజ(45) , సదాశివగట్టి(50), మంజప్పగట్టి (55) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవరు ఉమేష్, నాగవేణి, భోజగట్టి, హరీష్, లక్ష్మి, మాధవ అనే ఆరుగురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన బంగారుపాళ్యం ప్రభుత్వఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మృతిచెందిన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. బీడీకార్మికులుగా జీవనంసాగిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పలమనేరు డీఎస్పీ చౌడేశ్వరి, గంగవరం సీఐ మధుసూదనరావు, స్థానిక ఎస్ఐ నెట్టికంఠయ్య సందర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పోలీసులు ఎన్నోచర్యలు తీసుకుంటున్నా మరణాలు సంభవించడం విచారకరమన్నారు. ఇప్పటికే జాతీయరహదారి వెంబడి సూచికబోర్డులు పెట్టామని చెప్పారు. ఇతరరాష్ట్రాలకు చెందిన వాహనదారులే ఇలాప్రమాదాలకు గురౌతున్నట్లు తెలిపారు. రూటుమీదఅవగాహన లేకపోవడం, వేగమే ఈప్రమాదానికి కారణమైనట్లు తెలుస్తోందన్నారు. శవపంచనామా పూర్తైన తరువాత మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపేందుకు ఎంపీపీ సుచిత్రజయప్రకాష్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అంబులెన్సులను సమకూర్చనున్నట్లు తెలిపారు. పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

జయం మనదే...

- మళ్లీ అధికారంలోకి వస్తాం .. 106 స్థానాల్లో గెలుస్తాం
- 2019 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి..
- టీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో కేసీఆర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: 'ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జయం మనదే. గులాబీ విజయం సాధించి తీరుతుంది. తమకే మెజారిటీ స్థానాలు వస్తాయి...' అన్న ధీమాతో గులాబీ దళపతి ఉన్నారు. రెండోసారి తిరిగి అధికారం చేపట్టి తీరుతామన్నారు. విపక్షాలకు ఓటమి తప్పదని, ప్రజలు తమవెంటే ఉన్నారని...అధికారం కట్టబెడతారన్న పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికలపై ఆందోళన అక్కర్లేదని, అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా 106 స్థానాల్లో టీఆర్ఎస్ గెలుపు ఖాయమని కె.చంద్రశేఖరరావు ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న సిట్టింగ్‌ల్లో ముగ్గురు నలుగురికి తప్ప అందరికీ తిరిగి టిక్కెట్లు ఇస్తానని తెలిపారు. 2019 వరకు రాష్ట్ర రాజకీయాల్లో ఉంటానని, ఆ తర్వాత దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పుకోసం ప్రయత్నిస్తానని చెప్పారు. దేశ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రులకు, ఎమ్మెల్యేలకు చెప్పారు. కేసీఆర్ జాతీయ రాజకీయాలపై సంచలన ప్రకటనలు చేయడం తెలిసిందే. ఇప్పటి వరకు దేశ రాజకీయాలు మూస పద్ధతిలో నడుస్తున్నాయని, ప్రజాపయోగమైన పనులు జరుగటం లేదని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ఎల్పీ సమావేశం ముఖ్య మంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఆదివారం జరి గింది. సోమవారం ప్రారంభం కాబోయే బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు సి.విజయ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో మహిళలపై కొనసాగుతున్న అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు సి.విజయ పిలుపునిచ్చారు.విజయవాడ గిరిపురం తరిమెల నాగిరెడ్డి భవనంలో ఆదివారం స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యాన బహిరంగ సభను నిర్వహించారు.దీనికి స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఎస్.లక్ష్మి అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయ మాట్లాడుతూ, మహిళాభివృద్ధి, సాధికారిత అంటూ పాలకులు ఎన్ని వాగ్దానాలు చేస్తున్నప్పటికీ..దేశ వ్యాప్తంగా వారిపై దాడులు తీవ్రతరం అవుతున్నాయని వాపోయారు.ఈ సమావేశంలో స్త్రీ విముక్తి సంఘటన కృష్ణాజిల్లా అధ్యక్షులు పి.కామేశ్వరి, జిల్లా ఓపీడీఆర్ సంయుక్త కార్యదర్శి వి.ఎస్.వి.రాజ్యలక్ష్మి, టి.దుర్గాంబ, యు.విజయలక్ష్మి, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్ల రామయ్యకు షాక్



విశాలాంధ్ర - అమరావతి : ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు... విధి విధానమును తప్పించుటకై ఎవరు సాహసించెదరు... తెలుగుదేశం పార్టీ రాజ్యసభ టిక్కెట్లు దక్కిన వారి, తప్పిన వారి వైనం గమనిస్తే పై పాట సరిపోతుందనిపిస్తోంది. రాష్ట్రంలో ఈ నెల 23న జరగనున్న రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో తెలుగుదేశం పార్టీ 'సుప్రీం' ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎవ్వరూ ఊహించని నిర్ణయం తీసుకున్నారు. చంద్రబాబు ఎంపిక చేసిన అభ్యర్థుల జాబితా చూసిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆశ్చర్యపోయాయి. సీఎం ఎప్పటిలాగనే ఈసారి కూడా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో తీసుకున్న సామాజిక సమీకరణలు ఆ పార్టీ నేతలను, ఆశావహులను నివ్వెరపరిచాయి. రాజ్యసభ ఎన్నికలలో టీడీపీకి రెండు స్థానాలు దక్కుతాయి. తొలుత ముగ్గురు అభ్యర్థులను నిలబెట్టాలని యోచించిన సీఎం చంద్రబాబు మూడవ అభ్యర్థిని రంగంలోకి దించే విషయంపై వెనక్కు తగ్గారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై శనివారం నుండే కసరత్తు ప్రారంభించారు. టీడీపీ టిక్కెట్ల కోసం ఆర్థిక అండదండలు పుష్కలంగా ఉన్న ప్రముఖులతో పాటు దళితవర్గాలకు చెందిన నేతలు కూడా సీఎం వద్దకు క్యూ కట్టారు. శనివారం రాత్రి కసరత్తు ఓ కొలిక్కివచ్చింది. ఓసీ కోటాలో సిట్టింగ్ ఎంపీ సీఎం.రమేష్, ఎస్సీ కోటాలో వర్ల రామయ్యలకు టీడీపీ టిక్కెట్లు ఖరారైనట్టు భారీ ప్రచారం జరిగింది. తెలుగుదేశం పార్టీ నేతలు, మంత్రులు ఆ ఇద్దరికే టిక్కెట్లు ఖాయమయ్యాయని భావించారు. ఆదివారం ఉదయం తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లి నివాసంలో అభ్యర్థుల ఎంపికపై తుది కసరత్తు ప్రారంభించారు. మంత్రులు యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావులతో సమావేశమయ్యారు. రాజ్యసభ టిక్కెట్లు రమేష్, వర్లలకే ఖరారయ్యాయని వారిని రమ్మని ముఖ్యమంత్రి నివాసం నుండి ఫోన్లు వెళ్ళాయని బయటకు పొక్కింది. వర్ల రామయ్య ఏకంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పేందుకు బొకే తీసుకొని సీఎం ఇంటికి చేరుకున్నారు. వర్ల రామయ్య కుటుంబసభ్యులు కూడా వారి ఇంటి నుంచి సీఎం ఇంటికి ఆనందంగా బయలుదేరారు. నారా లోకేష్ కూడా తనను గ్రీట్ చేసినట్లు ఓ ఛానల్‌కు ఆయన చెప్పారు. చివరి నిమిషంలో లోపల ఏమి జరిగిందో ఎవరికీ తెలియదు. మంత్రులు కళా వెంకట్రావు, యనమల బయటకు వచ్చి వెళ్ళిపోయారు. వెళ్తూ, వెళ్తూ సాయంత్రం ఐదు గంటలకు సమావేశం ఉందని మీడియావారు అడిగితే చూచాయగా చెప్పారు. అప్పటికి దాదాపు మధ్యాహ్నం రెండు గంటల సమయం అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకూడా సమావేశ మందిరం నుంచి ఇంట్లోకి వెళ్ళిపోయారు. అది జరిగిన కొద్దిసేపటికి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కళా వెంకట్రావు పేరుతో రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదలైంది. ఒక్క సారిగా స్క్రిప్ట్ మారిపోయింది. రాజ్యసభ అభ్యర్థులుగా సిట్టింగ్ ఎంపీ సీఎం.రమేష్, సీనియర్ న్యాయవాది, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడుగా ఉన్న కనకమేడల రవీంద్ర కుమార్‌ను ఖరారు చేస్తూ పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. దీంతో వర్ల రామయ్య ఒక్కసారి షాక్‌కు గురై వెనుదిరిగారు. అప్పటికి ఆయన కుటుంబసభ్యులు ప్రకాశం బ్యారేజిపై ఉన్నట్లు తెలుస్తోంది. ఊహించని విధంగా వర్ల రామయ్య స్థానంలో రవీంద్రకుమార్‌కు రెండవ టిక్కెట్ దక్కటం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇదిలా ఉండగా వర్ల రామయ్యపేరు ఖరారైన దశలో కృష్ణాజిల్లాకు చెందిన కొందరు నేతలు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతి రేకించినట్లు తెలిసింది. దీంతో చంద్రబాబు చివరి నిమిషంలో వర్ల స్థానంలో కనకమేడలకు రాజ్యసభ టిక్కెట్ కట్టబెట్టినట్లు సమాచారం. ఎస్సీ కోటా క్రింద ఓ టిక్కెట్ కేటాయిస్తున్నట్లు భారీ ప్రచారం జరిగినా చంద్రబాబు ఊహించని విధంగా రెండు టిక్కెట్లు ఓసీ వర్గాలకే కేటాయించారు. ఇది ఎస్సీ వర్గాల్లో నిరాశకు గురిచేసింది. రాజ్యసభ టిక్కెట్ ఆశించి గత మూడు రోజులుగా మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే సిట్టింగ్ ఎంపీ సీఎం. రమేష్‌కు ఒకస్థానం, రెండవస్థానం ఎస్సీలకు కేటాయిస్తు న్నామని పార్టీ నేతలు ఆయనకు ఈ ఉదయం చెప్పి సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. అలాగే బీసీ వర్గానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బీదా మస్తాన్‌రావును 2019 ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉంటుందని ఆయనకు సీఎం నచ్చచెప్పారు. అలాగే కర్నూలు జిల్లాకు చెందిన మసాల పద్మజ, చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే హేమలతలు కూడా చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు. వారికి కూడా చంద్రబాబు చెప్పాల్సింది చెప్పి అనునయించారు. అందరూ సీఎం.రమేష్, వర్ల రామయ్యలే అనే నిర్ణయానికి వచ్చేశారు. అయితే వర్ల స్థానంలో రవీంద్రకుమార్ పేరు ఖరారు కావటం ఒక విధంగా ఆశావహులను షాక్‌కు గురిచేసిందని చెప్పవచ్చు. ప్రధానంగా కంభంపాటి పార్టీ ఆవిర్భావం నుండి పని చేస్తున్నారు. గతంలో రాజ్యసభ సభ్యుడుగా ఇటీవల వరకు ఢిల్లీలో ఏపీ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. తనకు కాదని తన సామాజికవర్గానికే చెందిన కనక మేడలకు టిక్కెట్ ఇవ్వటం ఆయనను ఒకింత ఆవేదనకు గురిచేసినట్లు తెలిసింది. అయితే చంద్రబాబుకు కూడా రవీంద్ర కుమార్ విషయంలో పార్టీ సీనియర్ నేతల నుంచి ఢిల్లీలో ఉన్న కొందరు సన్నిహితుల నుంచి తీవ్ర ఒత్తిళ్ళు వచ్చినట్లు, దీంతో చంద్రబాబు రవీంద్రకుమార్ అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపినట్లు టీడీపీ వర్గాల్లో ప్రచారం సాగు తోంది. ఇదిలా ఉండగా కనకమేడల రవీంద్రకుమార్ హైకోర్టులో సీనియర్ న్యాయవాది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ లీగల్ సెల్‌లో ముఖ్యభూమిక పోషించారు. కృష్ణా జిల్లాకు చెందిన ఈయనకు చివరి నిమిషంలో రాజ్యసభ టిక్కెట్ దక్కటం పట్ల టీడీపీ న్యాయవాద వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

నాడు పుష్పరాజ్... నేడు రామయ్య...



రాజ్యసభ ఎన్నికల ప్రకటన విడుదల కాగానే దళిత నేతలలో ఒకరికి టిక్కెట్ ఖాయమని పార్టీలో ప్రచారం ప్రారంభమవుతుంది. దీంతో దళిత నేతల్లో ఆశావహులంతా చంద్రబాబు వద్దకు, పార్టీ ఇతర ప్రముఖుల వద్దకు క్యూ కడతారు. ఎవరో ఒకరిపేరు ఖరారైంది.. ఇంకొద్ది సేపట్లో ఆయనకు బి.ఫారం ఇస్తున్నారు అని ప్రచారం జోరు ఊపందుకుంటుంది. అఖరి నిమిషంలో ఆ నేతలకు టిక్కెట్ చేజారుతుంది. వర్ల రామయ్యకు ఈ రోజు ఎదురైన అనుభవం గత రాజ్యసభ ఎన్నికల్లో జెఆర్.పుష్పరాజ్‌కు ఎదురైంది. రెండేళ్ళ క్రితం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో రెండు స్థానాలకు ఓసీ వర్గం క్రింద సుజన చౌదరి, ఎస్సీ కోటా క్రింద మాజీ మంత్రి పుష్పరాజ్‌కు టిక్కెట్లు ఖరారయ్యాయని, మరి కొద్ది సేపట్లో అధికార ప్రకటన వెలువడుతుందని ప్రచారం సాగింది. ఆ సమయంలో పుష్పరాజ్ ఆనందంగా ముఖ్యమంత్రి కార్యాలయంలో అందుబాటులో ఉన్నారు. ఏమి జరిగిందో తెలియదు గానీ సుజనా చౌదరికి, రాయలసీమకు చెందిన టీజీ.వెంకటేష్‌కు టిక్కెట్లు దక్కాయి. ఆరోజు పుష్పరాజ్ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఆ తర్వాత ఆయనకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కింది. నాడు పుష్పరాజ్‌కు జరిగిందే నేడు వర్ల రామయ్యకు జరిగిందని టీడీపీ నేతలే చెప్పుకొస్తున్నారు.

14న అంగన్‌వాడీ కార్యకర్తల సామూహిక దీక్ష

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న అంగన్‌వాడీ కార్యకర్తలు సామూహిక దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మంజుల, కార్యనిర్వాహక అధ్యక్షులు కె.చిన్నమ్మ, ప్రధాన కార్యదర్శి జె లలిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్దెనిమిది నెలలుగా ఇంటి అద్దెలు, ఇతర బిల్లులను చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఉద్యమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకపోవడంతో 14వ తేదీన విజయవాడ ధర్నాచౌక్‌లో సామూహిక నిరాహారదీక్ష చేపడుతున్నట్లు వారు వివరించారు. బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 18వేలు చెల్లించాలని, ఐసీడీఎస్ రంగంలో పనిచేసే వారికి పదోన్నతులు కల్పించాలని వారు డిమాండు చేశారు. రోజు రోజుకూ పెరిగిపోతున్న పనిభారాన్ని తగ్గించాలన్నారు. పౌష్టికాహారాన్ని చౌకధరల దుకాణాల ద్వారా కాకుండా నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమాలే శరణ్యమన్నారు.



మోడీకి టీడీపీ, వైసీపీ సరెండర్

- కాంగ్రెస్ నేతలు రఘువీరా, కేవీపీ, పల్లంరాజు
- కాంగ్రెస్‌లో చేరిన బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గంగాధర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని టీడీపీ, వైసీపీలు ప్రధాని మోడీకి సరెండర్ అయ్యాయని కాంగ్రెస్ నేతలు ఎన్.రఘువీరారెడ్డి, కేవీపీ రామచంద్రరావు, పల్లంరాజు విమర్శించారు. విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గంగాధర్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్‌కు పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి, రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజులు కాంగ్రెస్ కండవాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పల్లంరాజు మాట్లాడుతూ, హోదా కోసం పోరాడదామంటే ఈ రెండు పార్టీలూ కలసి రావడం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోడీకి పరిపాలన దక్షత లేదని, అన్ని వ్యవస్థలనూ తన ఆధీనంలోకి తీసుకుని రాజ్యమేలుతున్నారని విమర్శించారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా నలుగురు సుప్రీంకోర్టు జడ్జిలు మీడియా ముందుకు వచ్చారంటే దేశంలోని పాలన ఎలా వుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. అద్వానీకి మోడీ నమస్కారం పెట్టట్లేదంటే.. మోడీ ఎంత కుసంస్కారో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ, రాష్ట్ర పునర్విభజన చట్టం అమలు, ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ చేపట్టిన కోటి సంతకాల సేకరణ విజయవంతమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పరిణామాలు, కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణని చూసి గంగాధర్ కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. కాంగ్రెస్ సిద్ధాంతాలతో గంగాధర్ మమేకమై కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

రఘువీరారెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ ప్రధాని కావాలనే ఆశతో వున్నారని, ఆయన ప్రతిపాదించిన థర్డ్ ఫ్రంట్ నిలబడబోదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు నరహరిశెట్టి నరసింహారావు, మీసాల రాజేశ్వరరావు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి

చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీల అమలు కోసం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, కేంద్రంపై వత్తిడి పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా, బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసగా ఇద్దరు మంత్రులను కేంద్రం నుంచి ఉపసంహరిచుకోవడం ఆలస్యమైనా మంచి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అయినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో, రాష్ట్ర బీజేపీ నాయకులు చేసే ప్రకటనల్లో ఏవిధమైన మార్పు రాలేదన్నారు. పైగా బీజేపీ నాయకులు పదేపదే ఏపీకి ఎక్కువ ఇస్తున్నామని చెబుతున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రుల రాజీనామాల తర్వాత ఏవిధమైన మార్పు లేదన్నారు. ఈనేపథ్యంలో రానున్న రోజుల్లో కేంద్రం రాష్ట్రానికి అదనంగా ఏదైనా చేస్తుందనే నమ్మకం ప్రజలకు కలగడం లేదన్నారు. ఈ పార్లమెంటు సమావేశాలు ముగిసేలోగా మన రాష్ట్రానికి చెందవలసినవి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే చాలా కీలకమైన సమయం కనుక రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ప్రధానిని కలిసేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లి కేంద్రంపై వత్తిడి పెంచాలని రామకృష్ణ లేఖలో ముఖ్యమంత్రిని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా శాక్స్ సిబ్బంది

గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : శాక్స్ విభాగంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి(శాక్స్) ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ. రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమ ఉపాధి భద్రతలను కాపాడుకునేందుకు, సమాన పనికి సమాన వేతనం సాధించుకునేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. లక్షలాది మంది హెచ్ఐవి బాధితులకు సామాజిక స్పృహతో సేవలందిస్తున్న శాక్స్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణించాలని ఓబులేసు కోరారు.

రాష్ట్ర సచివాలయ గెజిటెడ్ అధికారుల సంఘం జేఏసీ అధ్యక్షులు కేవీ కృష్ణయ్య మాట్లాడుతూ ఏపీ శాక్స్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరముందన్నారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న కృషికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ శాక్స్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు తమకు అభ్యంతరం లేదని ఉత్తర్వులు ఇచ్చిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శాక్స్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఏఐటీయూసీ అనుబంధంగా ఏపీ శాక్స్ ఉద్యోగ సంఘం ఏర్పడటం అభినందనీయమని అన్నారు. సమాజంలో సంఘం లేకుండా ఏ రంగమూ తమ సమస్యల్ని పరిష్కరించుకునే దశలో లేదని పేర్కొన్నారు.

ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం అమలు చేయకుండా ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. శాక్స్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శాక్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేణు సుదర్శి మాట్లాడుతూ శాక్స్ ఉద్యోగులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం సమావేశంలో.శాక్స్ ఉద్యోగులందర్నీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని, సమాన పనికి సమాన వేతనం వర్తింప చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని, హెచ్ఆర్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానించారు. ఓబులేసు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాక్స్ ఉద్యోగ సంఘ రాష్ట్ర నాయకులు వీరాస్వామి, బద్రి, కోటిరత్నం, అపర్ణ, వెంకట సుబ్బయ్య, యడ్లపాడు ఎంపీపీ స్టీపెన్ పిల్లి కరుణాకర్, టీఎన్‌పీ ప్లస్ నాయకులు రమేష్, 13 జిల్లాల నాయకులు, అధ్యక్ష,కారదర్శులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిందే



- రాష్టానికి కేంద్రం ఎంతో చేసింది
- కరపత్రాలు, పుస్తకాలతో ప్రచారం
- బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో తీర్మానం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అన్నింటితోపాటు లేనివాటిని కూడా అమలు చేస్తుంటే, కేంద్రంలోని బీజేపీపై టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని, ఇకపై అటువంటి ప్రచారాన్ని తిప్పికొట్టాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర కోర్ కమిటీ నిర్ణయించింది. ఇందుకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను వేదికగా మలచుకోవాలని సమావేశంలో తీర్మానించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు అధ్యక్షతన పార్టీ కోర్ కమిటీ సమావేశం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సతీష్ జీతోపాటు ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్సీలు పీవీఎన్ మాధవ్, కంతేటి సత్యనారాయణ రాజు, సోము వీర్రాజు, మాజీ మంత్రులు పీ మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్, బీజేపీ శాసనసభాపక్ష నేత పీ విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, మహిళా మోర్చా జాతీయ ఇన్‌చార్జి డి పురందేశ్వరితోపాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జమ్ముల శ్యామ్ కిశోర్, ఎస్ సురేష్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. బీజేపీపై టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారం, పార్టీ భవిష్యత్ కార్యాచరణపైనే ప్రధానంగా చర్చించారు. ఎట్టి పరిస్థితిలోనూ విమర్శలను తిప్పి కొట్టకపోతే, రాష్ట్రంలో బీజేపీ బలోపేతం కావటం కష్టమని సమావేశం అభిప్రాయపడింది. ఇందుకు బడ్జెట్ సమావేశాలను ఉపయోగించుకోవటంతో పాటు పార్టీ సంస్థాగత దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల ఆరో తేదీన పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బైక్ ర్యాలీల ద్వారా రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందో వివరించాలని హరిబాబు సూచించారు. కేంద్ర పథకాలను పెద్ద ఎత్తున ప్రజలలోకి తీసుకువెళ్లాలని కోరారు. కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని సోము వీర్రాజు తీవ్రస్థాయిలో విమర్శలు చేసినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితిలోనూ టీడీపీ తప్పుడు ప్రచారాన్ని సహించకూడదని, వాస్తవాలను ప్రజలకు వివరించి, రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని ఆయన కోరినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికలలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపైనా చర్చ జరిగింది. అయితే ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా నాయకులు జాగ్రత్తలు తీసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే రంగంలోకి దిగేందుకు ప్రణాళికలను రూపొందించాలని కోర్ కమిటీ తీర్మానించినట్లు సమాచారం.

చట్టంలోని అన్నింటినీ అమలు చేస్తాం : హరిబాబు

పునర్విభజన చట్టంలోని అన్నింటినీ నూటికి నూరుశాతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని కంభంపాటి హరిబాబు చెప్పారు. పార్టీ కోర్ కమిటీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రంలోని ఇద్దరు టీడీపీ మంత్రులు, రాష్ట్రంలోని ఇద్దరు బీజేపీ మంత్రులు రాజీనామా చేసిన నేపథ్యంలో తాజా రాజకీయాలపై సమావేశంలో చర్చించామన్నారు. పదేళ్లలో చేయాల్సిన పనులను మూడున్నర సంవత్సరాల్లో పూర్తి చేశామని, మరో 15 శాతం హామీలు మిగిలి ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. అన్నీ చేసినా రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేసిందంటూ విమర్శలు చేయటం బాధాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న దుగరాజపట్నం ఓడరేవు, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వేజోన్‌పై త్వరలోనే స్పష్టమైన ప్రకటన వస్తుందన్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1,600 కోట్ల ఆర్థిక లోటును భర్తీ చేసేందుకు కేంద్రం సంసిద్ధంగానే ఉందన్నారు. వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తున్నా ఏపీ చేయటంలేదనటం శోచనీయమన్నారు. ప్రత్యేక హోదాకు సమానంగా ప్యాకేజీని అమలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రానికి బీజేపీ ఏమేమి చేసిందో కరపత్రాలు, పస్తకాలను ముద్రించి ప్రజలకు అందజేస్తామన్నారు. టీడీపీ సీనియర్ నాయకురాలు, సినీ నటి కవిత నేడు బీజేపీలో చేరారు. ఆమెకు హరిబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దక్షిణ భారతావనిలో సిద్ధమవుతున్న

అతి పెద్ద రైల్వే సొరంగం

- 7.5 కి.మీ. పొడవుతో నిర్మాణం
- సీమతో కోస్తా ప్రాంతాలు అనుసంధానం
- ఖనిజ రవాణాకు మరింత ఊతం
- వేగంగా కృష్ణపట్నం-ఓబులవారిపల్లె మార్గం పనులు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దక్షిణాదిలో అతి పొడవైన రైల్వే సొరంగం సిద్ధమవుతోంది. అన్ని పనులు సక్రమంగా జరిగితే 2019 చివరి నాటికి ఈ సొరంగం అందుబాటులోకి రానుంది. ఓడరేవుల అనుసంధానంలో భాగంగా రైల్వేశాఖ కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైలు మార్గాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కడప, నెల్లూరు జిల్లాల సరిహద్దులో పెనుశిల అభయారణ్యం మీదుగా వెళ్లే ఈమార్గంలో రాపూరు కొండలల్లో 7.5 కిలోమీటర్ల పొడవైన సొరంగ మార్గాన్ని నిర్మిస్తున్నారు. ఈ మార్గం పూర్తయితే దక్షిణాదిలోనే అతిపొడవైన రైలు సొరంగం గల మార్గం కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టించనుంది. ఇదే సమయంలో రాయలసీమ కోస్తా ప్రాంతాలకు మరింత చేరువకానుంది. ఈ మార్గంలో కడపజిల్లా చిట్వేల్ మండలం చెర్లోపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలోని కొడల మీదుగా నెల్లూరుజిల్లా డక్కిలి మండలం మాధవాయపాలెం వరకూ సొరంగం తవ్వే పనులు గత ఫిబ్రవరిలో పూర్తయ్యాయి. ప్రస్తుతం సొరంగంలో సిమెంటు కాంక్రీట్ ప్లాస్టరింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ మార్గం పూర్తయితే దక్షిణ భారతావనిలోనే అతి పొడవైన సొరంగంగా నిలుస్తుందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. అలాగే రాయలసీమ ప్రాంతాలు కోస్తా ఆంధ్రతో అనుసంధానమవుతాయంటున్నారు. కర్ణాటకలోని బళ్లారి నుంచి ఇనుప ఖనిజం, మంగంపేట నుంచి ముగ్గురాయిని కృష్ణపట్నం ఓడరేవు ద్వారా విదేశాలకు రవాణా చేయడం సులభతరం కాగలదని చెబుతున్నారు. దీంతో ఈ ఓడరేవుకు ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వీటిని చెన్నై ఓడరేవుకు తరలించి ఎగుమతి చేస్తున్నట్లు వివరించారు.

కాగా జమ్మూకాశ్మీర్‌లో 11 కి.మీ. పొడవుతో పీర్‌పంజల్ పర్వతశ్రేణుల్లో నిర్మించిన పీర్‌పంజల్ సొరంగమార్గం దేశంలోనే అత్యంత పొడవైన దిగా పేరొందినట్లు అధికారులు చెబుతున్నారు. తర్వాత అదే రాష్ట్రంలో 8 కి.మీ. పొడవు కలిగిన సంగల్‌దహన్ సొరంగం, మహారాష్ట్రలో 6.50 కి.మీ. పొడవుతో కర్‌బుదే సొరంగాలు పొడవైనవిగా పేర్కొన్నారు. ఇక మన రాష్ట్రంలో నల్లమలై కొండల్లో బొగద సొరంగ మార్గం 1.6 కి.మీ. పొడవును కలిగి ఉందన్నారు.

పుష్కరకాలంగా సాగుతున్న పనులు

కృష్ణపట్నం-ఓబులవారిపల్లె మార్గానికి 2005-06 బడ్జెట్‌లోనే రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 113 కి.మీ. పొడవైన మార్గాన్ని నిర్మించేందుకు రూ. 732.81 కోట్ల వ్యయం కానుందని అధికారులు అప్పట్లో అంచనాలు రూపొందించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ వ్యయం రూ. 1646 కోట్లకు చేరుకుంది. పుష్కరకాలంగా నత్త నడకన పనులు జరగడం వల్లే నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో కడప, నెల్లూరుజిల్లాల్లో 1900 ఎకరాల భూమిని సేకరించారు. అలాగే కేంద్ర అటవీశాఖ అనుమతులతో మరో 325 ఎకరాలను సమకూర్చారు. ఇప్పటికే కృష్ణపట్నం నుంచి విజయవాడ-గూడూరు ప్రధాన సెక్షన్‌లోని వెంకటాచలం వరకూ 21 కి.మీ. మార్గం పూర్తయింది. అటు ఓబులవారిపల్లె, ఇటు వెంకటాచలం నుంచి మట్టిమార్గం, ట్రాక్ నిర్మాణం, సిగ్నలింగ్ తదితర పనులు ప్రారంభమయ్యాయి. సొరంగం నిర్మాణ పనులను 2016 సంవత్సరంలో కేంద్రమంత్రులు వెంకయ్యనాయుడు, ప్రకాష్ జవదేకర్ పరిశీలించారు. అప్పట్లో 2017 డిసెంబరు నాటికి ఈ మార్గాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని రైల్వే అధికారులు మంత్రులకు వివరించారు. అయితే సొరంగం తవ్వకంలో అనేక అవరోధాలు ఎదురు కావడంతో పనుల్లో జాప్యం జరిగిందని, ఇక మిగిలిన పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయని నిర్మాణ బాధ్యతలు వహిస్తున్న రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రైల్వేశాఖ 2017 బడ్జెట్‌లో రూ. 100 కోట్లను, 2018 బడ్జెట్‌లో రూ. 200 కోట్లను కేటాయించింది. ఈ మార్గానికి అధిక ప్రాధాన్యతను కల్పిస్తూ 2018-19 సంవత్సరంలో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది.

సాహితి

నేడు సాహిత్యం కాలంతో కలసి నడుస్తుందా?



-కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
✆ : 9948774243

ఆధునిక సాహిత్యం ఆధునిక ప్రపంచపు ముఖచిత్రాన్ని, దాని నిజస్వరూపాన్ని, యథార్థ స్థితిగతులను ప్రపంచం ముందు నిలబెట్ట గలుగుతుందా? నవనాగరికత ముసుగులో నడుస్తున్న సామాజిక అంతర్గత సంఘర్షణను నేటి సాహిత్యం పట్టుకోగలుగుతుందా? నూతన సాంకేతిక నైపుణ్యాల్ని అవగాహనించుకుంటూ, వెర్రి తలలేస్తున్న ఆధునికతను హెచ్చరిస్తుందా? ఆధునిక ప్రపంచంలో ఎన్నో అవకాశాలు మానవాభివృద్ధికి తోడ్పాటిస్తున్నా, మనిషి ఎందుకు ఏకాకిగా మిగిలిపోతున్నాడు? మనిషిని కోల్పోయిన, మానవీయతను ముసుగ్గా పులుముకున్న, ఒక దైనీయ స్థితిలో మనిషి దేన్నో, లక్ష్యసిద్ధిని విడిచి దేవులాడుతున్నాడు. మంచికి చిరునామా మాయమైపోతుంది. మనిషిని ఒంటరితనం వేటాడుతుంది. స్వార్థం వెంటాడుతుంది. కాలం వడివడిగా మారుతూ సమాజానికి మూడడుగులు ముందు నడుస్తుంది. అయితే మన సాహిత్యం మాత్రం వివిధ ప్రక్రియల్లో పుంఖాను పుంఖాలుగా వెలువడుతుంది. కాలవడిని పట్టుకుంటున్న సాహిత్యం, ఈ తరాన్ని చైతన్యపరచడానికి, చేయిపట్టి నడిపించడానికి, వర్గ చైతన్యాన్ని ఉద్దీపింప చేయడానికి తోడ్పడాల్సి ఉంది. సాహిత్యంలో ఎన్నో వాదాలు పురుడోసు కున్నాయి. సమాజంలో "వర్గ సమస్య మాత్రమే కాదు, కుల సమస్య" కూడా సామాజిక అధోగతికి కారణము గ్రహించడం జరిగింది. జెండర్ సమస్య కూడా జెండాలెత్తుతున్నాయని పసిగట్టడం జరిగింది.

గతి తార్కిక భౌతికవాద భావజాలంతో అందున్న పటిష్టమైన సైద్ధాంతిక విలువలతో, సమాజంలో వర్గ చైతన్యాన్ని కలిగిస్తే దోపిడీ తనం అంతరించి, సమసమాజం ఏర్పాటుకు తోడ్పాటు జరుగుతుందని, ఆయుధానికి అక్షరశక్తినిచ్చి సామాజిక విప్లవానికి తోడ్పాటు నిచ్చింది మార్క్సిజం. తరువాత కాలంలో కుల సమస్య వర్గ పోరాటాల్లోను ప్రధానమైన భూమిక పోషిస్తుందని "కులం" కుళ్లు సమసిపోతేనే సమసమాజం ఆవిర్భవిస్తుందని కులపోరాటాలు దళితవాదంగా, మైనారిటీ వాదంగా సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. వర్గ పోరాటానికి ఊతమిస్తున్న సాహితీవేత్తలు కాస్త దారిమళ్లి కుల చైతన్యాన్ని రాజేసేందుకు కంకణం కట్టుకున్నారు. అట్లే లింగ వివక్షతను సహించని మహిళా వర్గాలు స్త్రీవాదంగా చలామణిలోకి వచ్చాయి. ఏది ఏమైనా సాహిత్యం ఆధునికతను అందిపుచ్చుకొని సామాజిక రుగ్మతలను ఎండగట్టడానికి మూలాలను వెతుక్కుంటూ కలాలను కదిపింది. వర్గ శత్రువు మీద ఫోకస్ కావాల్సిన మేధోశక్తి కుల వివక్ష మీద, లింగ విభేదాలకు మళ్లి అభ్యుదయవాదం అంటూనే సామాజిక విధ్వంసక భావాలను ఎత్తిచూపడం వరకు బాగానే ఉంది కాని, మూస ధోరణిలో సాహిత్యాన్ని సృష్టిస్తూ, లేనిపోని అపోహలు కలిగిస్తూ, వివాదస్పదమైన విద్వేషాలకు తావిస్తూ, కులాల కుమ్ములాటకు ఆజ్యంపోసే అక్షరమై పోవడం దురదృష్టకరమైన అంశంగా భావించాల్సి ఉంది. కులాలు మాసిపోబోతున్న తరుణంలో కులసంఘాలు బలపడడం, కులాల వారీగా సాహితీవేత్తలు విడిపోవడం, గతాన్ని కెళ్లగించుకొంటూ వర్తమాన సమాజంలో విషబీజాలు నాటుతూ కులాలు మధ్య అడ్డుగోడలు కట్టే పిడివాదాలు అభ్యుదయ వాదాలుగా మానవీయతా వేదాలుగా చలామణి అవడం శోచనీయం.

ఒక తాత్విక చింతనతో, మానవీయతా విలువలతో దార్శనికశక్తితో, సాహిత్యాన్ని సృష్టించిన, సామాజిక ఆస్తిగా ఎన్నదగిన, ఆధునిక భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న ఆధునిక కవులను కులాల వారీగా విడగొట్టి వారికి గుడులు కట్టి పూజచేయడం ఎంతవరకు సమంజసమో వోసారి సాహిత్యలోకం ఆలోచించాల్సి ఉంది. ఏమాత్రము ఎన్నడూ వారి భావాల్ని ఆచరించకుండా వారి భావజాలాన్ని తుంగలో తొక్కి, వ్యక్తి పూజకు హారతులెత్తడం కులాన్ని వ్యక్తి స్వార్థానికి వినియోగించుకోవడమే అవుతుంది. ఒక వాదాన్ని వినిపించడమూ అంటే ఆ వాదానికి సంబంధించిన మూలకారణమైన దుస్థితిని ఎత్తిచూపి చైతన్యపరిచి ఆ జనాన్ని విధ్వంసక తాకిడి నుండి విముక్తి గావించడమే కదా! మార్క్సిస్టు భావజాలానికి ముడివడి ఉన్న వర్గచైతన్యాన్ని కాదని, కులచైతన్యాన్ని కలి గించడం తొలినాళ్ళలో కొంతవరకు సమంజసం గానే కనిపించింది. రానురాను అది మూఢ విశ్వాసాలతో ముడిపడి ఉన్న సంప్రదాయ వాదాన్ని మించిపోయి సరికొత్త నవ సంప్రదాయవాదంగా రూపుదాల్చింది. ఇట్టి వాదాలను ఆశ్రయించుకొని బతికే సాహితీ వేత్తలు లేకపోలేదు. ఈరోజు యువతలో కూడా కుల, మత ద్వేషాలు విపరీత ధోరణులతో వెల్లివిరుస్తున్నాయి. వీరంతా రాజకీయ పావులుగా మారిపోతున్నారు. మరీ ముఖ్యంగా విశ్వవిద్యాలయాలు దుష్ట రాజకీయ కుతంత్రా లకు, అభియోగాలకు అడ్డాగా మారి పోతున్నాయి. బలవంతపు ఆత్మహత్యలు దేశభక్తి హోదాతో దేశమంతా హల్‌చల్ చేస్తున్నాయి. వికృత పోరాటాలకు తెర లేపుతున్నాయి.

ఈ రోజు సాహితీవేత్తలు ఎటువంటి కలలను కంటున్నారు? వ్యవస్థీకృత హింసను, క్రూరత్వాన్ని ఒక వర్గం మీదనుంచి మరోవర్గం మీదకు నెట్టడానికి సాహిత్యం సాక్షీభూతంగా నిలుస్తుందో లేదో గమనించాల్సిన అవసరం నేటి సాహితీవేత్తల మీద ఉంది. నేటి ఆధునిక సమాజాన్ని విశ్లేషించడానికి, వివేచించడానికి, తర్కించడానికి, విమర్శించడానికి ఉద్యమించడా నికి, దోపిడీని నిలువరించడానికి మార్క్సిస్టు సైద్ధాంతిక సాహిత్యం పనికి వస్తుందా? లేదా? దానిలోనూ మార్పు రావలసిన అవశ్యకత ఉందా? అనే అంశాలను అనుభవసారంలో ముంచి ఆమ్లపరీక్ష చేయాల్సిన అవసరం ఉందా? అనే విషయాన్ని అభ్యుదయవాదులు చర్చించాల్సి ఉంది.

ఈనాడు ప్రపంచంలో ఆధిపత్య వర్గాల భావజాలం, పెత్తందారీ వర్గాల బంధాల్లో చిక్కి దోపిడీని దొరతనంగా చలామణి చేస్తూ విషపూరితమైన విధ్వంసక భావజాలాన్ని సమాజానికి ఇంజెక్ట్ చేస్తూ 'ప్రపంచీకరణ' అనే ముద్దుపేరుతో బడుగు బలహీన వర్గ దేశాలను, కొన్ని సంస్కరణలతో ఆకట్టుకొంటోంది. పీడిత వర్గాలు సైతం నవనాగరికత ముసుగులో చిక్కి వస్తు వ్యామోహంతో దగ్ధమౌతున్నాయి. వర్గ దోపిడీ ఈనాడు నాగరికత ముసుగులో వస్తు వ్యామోహాన్ని పెంచి, కార్పోరేటెడ్ వ్యవస్థ న్యాయం మూడు పువ్వులు ఆరుకాయలుగా విస్తృతిస్తుంది. శ్రామిక, పీడిత వర్గం యొక్క స్థానం నానాటికి దిగబడిపోతూనే ఉంది. తీయని గాయాలతో శ్రమజీవి తనేమిటో తాను తెల్సుకోలేక తన స్థితిని తాను పసిగట్టలేక తనదికాని ఊహల ప్రపంచంలో పగటి కలలు కంటూ బతుకుతున్నాడు. కావాల్సినంత లాభాలతో పెట్టుబడిదారుడు లెక్కకు మిక్కిలిగా దోచుకుంటూనే ఉన్నాడు.

వర్తమాన ఆచరణాత్మక విధానాలు తెలియాలంటే సాహితీవేత్తలకు ముందుగా రాజకీయ భావజాల కారకాలపై లోతైన అవగాహన ఉండాలి. ఈనాటి రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషిస్తున్న రాజకీయ కారకాలను పరిగణలోకి తీసుకొని వాటి ఆంతర్యాన్ని శోధించినట్లయితే, వాటి సంక్లిష్టత తో కూడిన భావజాలాన్ని పరిశీలించినట్లయితే ఎటువంటి సాహిత్యాన్ని సమాజం మార్పు కోసం రాయాలో తెలుస్తుంది. కళ కళ కోసం కాదు ప్రజల చైతన్యం కోసం అనే భావజాలం ఏనాడో తెరపైకి వచ్చింది. సమకాలీన సమస్యలను సాహితీవేత్తలు నిస్వార్థంగా, నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా పట్టుకొని వారి సాహిత్యంలో పొందుపరచగలుగుతున్నారా? అనేది పెద్ద ప్రశ్న! ఆధిపత్య వర్గాల కార్యకలాపాలను సామాజిక సంబంధాలతో ముడిపెట్టి సామాజిక ప్రయోజన కారకాలుగా అభివర్ణిస్తూ, తత్ సంబంధమైన భావజాలాన్ని అనుకరించుటే నవ నాగరికతగా నమ్మిస్తున్న సాహిత్యాన్ని ఎంతమంది త్రోసిపుచ్చగలుగుతున్నారు? అంటే అందులోనూ అస్తిత్వసారాన్ని వెతుకుతుంటారు. ఆధిపత్య భావజాలాన్నే అస్తిత్వ భావజాలంగా నమ్ముతుంటారు. అందుకే మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతో కాలంగా మార్క్సిస్టు భావజాలంతో పనిచేస్తున్న పాలక పక్షాలు కుప్పకూలిపోతున్నాయి.

మనదేశంలో సోమరితనం లాంటి, మూర్ఖత్వంతో కూడిన చేతగానితనాన్ని భజన చేసే భక్తి ఎక్కువయింది. మనిషికి శాస్త్రీయ బద్ధమైన, భౌతికవాదంతో కూడిన తాత్వికత లోపిస్తుంది. "ఎవరో వస్తారని, ఏదో చేస్తారనే" గ్రుడ్డి నమ్మకాల్లోకి జారిపోతూ మనిషి తన లోంచి తాను ఊడిపోతున్నాడు. నిర్వీరుడుగా మారిపోతున్నాడు.

మన సాహితీవేత్తలు జీవన, తాత్విక, తార్కిక, కళాత్మక, శాస్త్రీయ, విశిష్టత గల అంశాలను విభిన్న రూపాల్లో దర్శించగలుగు తున్నప్పుడే కాలాన్ని దాని మార్పును పట్టుకోగలుగుతారు. మన సాహిత్యకారుల్లో ద్వేషం కన్నా దురభిమానం ఎక్కువగా కనిపిస్తుంటుంది. అందుకే, కులాన్ని విడిచి బయటకు రాలేకపోతున్నారు. కుల, ప్రాంతీయ, మత దురభిమానాన్ని ప్రోత్సహించడానికే కలాల్ని కదుపుతున్న కవులను చూస్తుంటే మన కవిత్వంలో ఊహాశాలిత, భావశబలిత అభివ్యక్తి ఎంత దురభిమానంగా వ్యక్తమౌతుందోనని పిస్తుంది. దీనికి గల కారణం సాహితీవేత్తల్లో లక్ష్యం, మార్గం నిర్దిష్టంగా లేకపోవడమేనేమోనని పిస్తుంటుంది. ఈనాడు పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించే, నిలువరించే, నాశనం చేసే ఆయుధాన్ని 'ఇది' అని చూపించే దశలో సాహితీవేత్తలు లేరనే చెప్పొచ్చు. ఇంకా లోతుగా మాట్లాడితే ఇవి సైద్ధాంతిక నిపుణతతో కూడిన రాజకీయ పార్టీలకు కూడా అర్థంకాని అయోమయ స్థితిలో ఉన్నాయనే చెప్పొచ్చు. ఈ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ చేసే కుట్రలు, కుతంత్రాలు, టాలాటోలీ తనాన్ని చూస్తూ మిన్నకుండడం అంటే మన సమాజాన్ని అనైతిక కూపంలోకి నెట్టివేయడమే అవుతుంది. మనిషి విలువలతో కూడిన జీవితాన్ని కలల కాసారాల్లో వెతుక్కోవాల్సి వస్తుంది.

మన దేశంలో ఈనాడు ప్రజాస్వామ్యం విలువలు నశించాయి. జనంలో అర్థికాపేక్షను గుప్పిస్తూ అనైతిక విలువలతో ఆర్థిక ఆర్జన చేస్తూ మేడిపండులా ప్రజాస్వామ్యం మెరిసిపోతున్న విషయం అందరికి తెలుసు. నేటి సాహిత్యం జనాన్ని కదిలించలేకపోతుంది. మేధావుల్లో మార్పు తీసుకురాలేకపోతుంది. సమాజంలో సాహిత్యం విలువలే పూర్తిగా పతనమైపోతున్నాయి. ఇటు ప్రభుత్వం గాని, అటు ప్రజలు గాని సాహిత్యాన్ని పట్టించుకునే దశలో లేవు. దీనికి గల కారణం సాహిత్య లోపమా? ప్రజల్లో వచ్చిన మార్పా? లేక సాహిత్యం కాలంతో కలసి నడవడంలేదా? లేక ఒక బలమైన శక్తి మన కళలన్నింటిని కాలరాస్తూ, తనదైన ఎలక్ట్రానిక్ మీడియాలో టీవీ సీరియల్స్ తదితర క్షణికానందాన్ని కలిగించే కళారూపాల్ని ఆసక్తిని పెంచే మసాలాతో జనం మీద విడుదల చేయడమే కారణమై ఉంటుందా? అంటే మనకు తెలియకుండానే మనం టీవీలకు, సెల్‌ఫోన్స్‌కు బానిసలమైపోతున్నాము. ఆలోచనాశక్తిని నశింపచేసుకుంటున్నాము.

దీన్ని అధిగమించాలంటే శాస్త్రవేత్తలులాగా సాహితీవేత్తలు కూడా కొత్త ఆలోచనలు చేయాలి. నూతన అన్వేషణ సామాజిక అవసరా లకు అనుగుణంగా చేస్తూ కార్యరూపందాల్చే మార్గం కనుక్కోవాలి. స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 'గ్లోబల్ మైండ్ సెట్' ను అవగాహనించుకోవాలి. వ్యూహాలను రూపొందిం చుకునే నైపుణ్యం సాహితీవేత్తలు సొంతం చేసుకోవాలి. సాహితీవేత్తలు "ఇండిపెండెంట్ థింకింగ్" తో కూడిన ఒక సామాజిక సైద్ధాంతిక నిర్ణయాన్ని శాస్త్రీయ దృక్పథంతో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

కవులు, కళాకారులు నిర్మాణాత్మక శక్తులు అనే విషయాన్ని విస్మరించకూడదు. సాహిత్య మెప్పుడూ జనరంజకంగా ప్రతిభాపాటవాలతో కూడి ఆలోచనాస్ఫోరకంగా ఉండాలి. అరిగి పోయిన వాదాలను కెళ్లకించుకుంటూ కుల మతాల చిచ్చును రాజేస్తూ, సమాజంలో విభేదాల విషం కక్కడం నిబద్ధతతో కూడిన సాహిత్యం కాదు. సాహిత్యమెప్పుడూ సమాజం హితాన్ని కాంక్షించేదిగా ఉండాలి. దిశా నిర్దేశం చేసేదిగా ఉండాలి. ✪

పఠాభి సాహిత్యవాటికలో విన్పించిన వాయులీనం

జీవన సారస్వతంలో- కన్నకలలు
కన్నడనాట-తెలుగుమాట, పఠాభిపన్నెండు రాగాలు!
రాగోదయ సరళికి-
భావ అభ్యుదయ కవనరీతులు!
విభిన్న ప్రక్రియల వైచిత్రికి నిర్భీతుల్నందించాయి.

తిక్కవరపు శేషకీర్తుల జాబితాలో శేషభూషణుడ్ని చేశాయి. పఠాభి పసిడి ఛాయలున్న పదారు వన్నెలు పాళీతో మెప్పించాయి. తనలో చూపులోతు- చూపకుండానే నిరాడంబరాహంభావకవిని దర్శించాయి. అధ్యయనానికి ఏ పట్టాల్లేవసుకోకుండానే పేరుకు పొట్టలో చుక్కని మొలిపించాయి. ప్రచారానికి సరస్వతీ స్వరూపమైన వీణ పట్టుకున్న పుస్తకమే కాదు- ప్రయోగవాదాల అటు భావం, వచనం, సాహిత్యస్పర్శల పంచాననపు పంచాంగాల్ని ప్రగతిశీలంగా విస్తరించిన- దృశ్య చయనికల సాహితీకంకణాధారుడు అర్ధాంగి స్నేహలతా ప్రవరుడైన ఆజానుబాహుడు తిక్కవరపు వనంలో కీర్తిసాంద్ర వంశోద్భవుడు- రాజకీయ సంస్కరణల సంస్కారం మాటున రాజీపడని అప్రతిహతంగా దృశ్యమానం చేసిన చండమారుత సంచాలనుడు. తన విశ్వాధ్యయనం ఇంగ్లీషు భాషా భాండాగారాన్ని నవ్యార్థాలకు సూత్రీకరుణుడు. తరాలను



తలలు పండించినా తలపులో మేధోజనితాన్ని- ప్రఖ్యాత ప్రతిభా అక్షరాల్ని నియంత్రణలతో తీరైన రీతిని ప్రకటించాడు.

జీవితంలోంచి- జీవితంలోకి అనుభూతించిన అవమానాల్ని భరిస్తూ ఎన్ని భయోత్పాతాలు- ఎన్ని విషాద సంకలనాలు సమాజగతశిక్షలకు ఎదురు నిలవడం- బలపడి గెలవటంలో ఉపజ్ఞ మీదుమిక్కిలి చిన్నపిల్లాడి జిజ్ఞాసే తన కలం బలం అన్నారు. పఠాభీ సాహితీ వైజయంతికల గీతాల సమరోత్సాహం. అది దివజత్వపు స్వేచ్ఛాగానమై- సహకార గమకాల స్వరాల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అమరంగా- అజ రామరంగా ధ్వనిస్తూనే ఉంటున్నాయి. రేపటి సాహితానుశీలకులకు నవ పంథాల్ని దారిదీపంలా మార్గదర్శనం చేస్తూనే ఉంటాయి. ఉండాలి కూడా.

-వి.ఎస్.ఆర్.సోమయాజులు,
✆ : 9441148158

పాఠకులకు స్ఫూర్తినిచ్చే 'సోమేపల్లి పురస్కార కథలు-2'

వెలుగునీడలు పడుగుపేకలుగా అల్లుకున్న ప్రాపంచిక రంగంలో మానవుని మనుగడే ఒక మహత్తరమైన గాథ. మామూలు మనిషి మనీషిగా, మనస్విగా, సామాజికజీవిగా అనేక అనుభవాలు సొంతం చేసుకుంటాడు. మరెన్నో అనుభూతులను మూటగట్టుకుంటాడు. సాఫల్యాలకు పొంగిపోతాడు. వైఫల్యాలకు క్రుంగిపోతాడు. తన ఎదలోతుల్లో దాచుకున్న అనుభూతులను సాటి వారితో పంచు కోవాలని ఉబలాటపడతాడు. అలాంటి అనుభూతులు, అనుభవాలు, సాఫల్య, వైఫల్యాలే కథకు నేపథ్యం. సామాజిక జీవనంలో, వ్యక్తుల అభిరుచులలో, అను భూతులలో గణనీయమైన మార్పులు ఇబ్బడిముబ్బడిగా వచ్చి చేరిన తరువాత సాహిత్యం పరిధి కూడా విస్తృత మయింది. కనుమరుగవుతున్న జనపదాలు, మృగ్యమవు తున్న మానవ సంబంధాలు, అర్థాలు మారిపోతున్న కుటుంబ బాంధవ్యాలు, పరసంస్కృతి వ్యామోహంలో కొట్టుమిట్టాడుతున్న యువత, అధికమవుతున్న వృద్ధాశ్రమాల ఆవశ్యకత- ఇలా ఒకటేమిటి, సమస్త అంశాలు నేటి కథకు ఇతివృత్తాలు.

సంక్షిప్తత, సమగ్రత, సామాజిక స్పృహ ప్రాణంగా కలిగిన కథలపై మక్కువ ఎక్కువయింది. ఈ నేపథ్యంలో ఉత్తమమైన విలువలను ప్రోత్సహించే మంచి కథలకు, కథారచయిత(త్రు)లకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో, ఉత్తమ కథాసాహిత్య వ్యాప్తికి ప్రేరణ కలిగించే మహదా శయంతో, కథా ప్రక్రియలో 'రమ్యభారతి' సాహిత్య త్రైమాసిక పత్రిక ఆధ్వర్యంలో 'సోమేపల్లి కథా పురస్కారాలు' పేరుతో గత 9సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో పురస్కార ప్రదానం చేయబడుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ సోమేపల్లి వేంకట సుబ్బయ్య ఈ పురస్కార వ్యవ స్థాపకులు. ఎన్నెన్నో వైవిధ్య భరితమైన ఇతివృత్తాలతో కూడిన కథలు ఈ పురస్కారాల కోసం వెలువడు తున్నాయి. పురస్కారాలకు ఎంపిక చేయబడిన కథలతో శ్రీ సోమేపల్లి వేంకటసుబ్బయ్య, చలపాక ప్రకాష్‌గార్ల సంపాదక త్వంలో వెలువడిన 2వ సంకలనం ఈ గ్రంథం.

2013 సం॥ నుండి 2017 సం॥ వరకు పురస్కారాలు పొందిన 30 కథలు ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి. టీవీ ఛానల్స్, ఫేస్‌బుక్, వాట్సప్ మొదలైన సామాజిక మాధ్యమాలపై యువకులు, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా వ్యామోహితులై ఉన్న నేపథ్యంలో సంక్షిప్తత ప్రాణంగా, సామాజిక చైతన్యమే ప్రేరణగా రచింపబడిన చిన్న కథలను పఠితలకు చేరువ చేయడానికి, పఠనాశక్తిని పెంపొందిం పజేయడానికి ఈ పోటీలు కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి.

సాహిత్య ప్రక్రియలలో పోటీలు నిర్వహించి అంతటితో తమ బాధ్యత పూర్తి అయినట్లు భావించే సంస్థలు అనేకం ఉన్నప్పటికీ, ఎంపిక చేయబడిన కథలను సంకలనంగా అందించటం వలన రచయితలకు ప్రోత్సాహమూ, సాహిత్యరంగంలో వారికి సముచితమైన స్థానమూ లభిస్తున్నాయి. ఈ సంకలనం చివరలో బహుమతుల వివరాలకు సంబంధించిన సమాచారం, పురస్కార ప్రదానోత్సవ సభల ఛాయాచిత్రాలు, ప్రముఖుల ప్రసంగ విశేషాలు సంవత్సరక్రమంలో అందించటం ఈ సంకలనం ప్రత్యేకతల్లో ఒకటి. పాఠకుడు నిజజీవితంలో దర్శించలేని అనేక జీవనపార్శ్వాలను ఈ కథలలో చూడవచ్చు. ఈ సంపుటిలోని కథలన్నీ ఆద్యంతమూ చదివించే రీతిలో సరళమైన శైలిలో పురస్కార ప్రదాతల లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాయి. మంచి కథలకు ఎప్పుడూ ఆదరణ తరగదనే సత్యాన్ని నిరూపిస్తున్నాయి.



డా॥వి. నాగరాజ్యలక్ష్మి, ✆ : 9394113848

సోమేపల్లి పురస్కార కథలు-2
సంకలనం: సోమేపల్లి వెంకట సుబ్బయ్య, చలపాక ప్రకాష్
పేజీలు: 184, వెల: రూ.100/-
ప్రతులకు: రమ్యభారతి, సాహిత్య త్రైమాస పత్రిక 1-4/3-36, సంజయ్ గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ-520 012.
సెల్ : 9247475975



ఆ లంబాడీ స్త్రీ పావడా అద్దం మసిబారుతుంది

ఆ నదిపై ఆ పడవ సొగసుగా సాగుతోంది
అలల్లో నుండి పాటలు వినిపిస్తున్నాయి
పాటల్లో రంగుల వలయాలు చూశాను
తెరచాప నుండి చిరుగాలి సవ్వడి
ఆ పాటలో గుంపు నృత్యం వుంది
అవును। అద్దాల పావడాలతో
గజ్జెల పట్టాలు మ్రోగుతున్నాయి
ఆ సహజ సౌందర్యం ఎక్కడిది?
తేయాకు ఆకులు తాకడంతో వచ్చిందా!
ఆ గంభీరత టేకు చెట్ల నిడివి నుండి వచ్చిందా!
ఆ నృత్యం నెమళ్ళసావాసం తెచ్చిందా?
ఆ లంబాడీ స్త్రీల కాళ్ళ చప్పుడు నుండే
పదనిసలు ఏర్పడ్డాయి కదా!
అవును। ఆ అరకులోయల్లో
చిరుగాలికి తుమ్మెదలు ధ్వనిస్తున్నాయి
ప్రకృతీ, మనిషి మమేకం అయ్యారు
చిక్కని చీకటిలో మిణుగురులవెలుగులు
అదృశ్యమైనవే మనల్ని ఉత్తేజ పరుస్తున్నాయి
దారంతా సజీవ చిత్రాలు
నేను ఓ పాలరాతి విగ్రహాన్ని చూశాను
శిల్పి కన్నుల్లో వెలుగులు నిండాయి
ఆత్మ గౌరవ పూర్ణమైన
ఆ శిల్పం దృశ్యకావ్యమే
చూపుల్లో పక్షుల ధ్వనులు
మాటల్లో వెన్నెల జల్లులు
నవ్వుల్లో నక్షత్రాల జడి
మూలవాసుల రూప చైతన్యం
ఆ శిల్పంలో చూశాను
అవును। కావ్యమంటే ఏమిటి?
ప్రకృతి మనో ప్రకృతి సమ్మేళనం కదా!
అయితే ఆ రూప చైతన్యమే ఇది
ఆ పక్షులు వెన్నెలతో సంభాషిస్తున్నాయి
చిరునవ్వులు శృతిబద్ధమైనవే
ఎన్నో మనస్సుల్లో శిల్పాలు శిథిలమౌతున్నాయి
పాలకుడు ప్రకృతి విధ్వంసకుడైతే
నేతలే నటులైతే సత్యం ఓడిపోదంటరా!
గర్భస్థ శిశువుకు ఊపిరందడం లేదు
ధనం అంతా సొంత బొక్కసాలకు చేరుతోంది
ఆ వజ్రాల డిజైనర్
తన వ్యాపార ప్రపంచంలో
స్టార్స్‌ను వజ్రాల్లో పొదిగాడు
అవును! నేర సామ్రాజ్యానికి
కిరీటధారులంతా గణ్యాగణ్యులే
వ్యక్తులైతే ఎవరికోసం జీవిస్తున్నారో
వారికి తెలియటం లేదు
ఆ రహదారికి ఇరువైపుల చెట్ల వరుస
ఆ పదతి కాళ్ళతో నడిచి ఎన్నాళ్ళయ్యిందో!
తల మీద ఆకులు రాలడం లేదు
జుట్టుకు ఎన్నో కత్తిరింపులు
ఒక ప్రక్క ఐస్ క్రీములు
మరొక ప్రక్క కొవ్వు తీసే యంత్రాలు
చూసిందే చూస్తున్నారు. విన్నదే వింటున్నారు
శరీరంలో ప్రతికణం
కదలికనే కోరుకొంటుందిసుమా!
ఎన్నో కణాలకు కదలిక లేదు
నాలుక ఆడినంతగా ఆత్మీయ స్పృహలేదు
అంతరంగం చిన్నదై పోతుంది కదా!
మెదడుకు అసలు మేతేలేదు
అక్షరం అంటే నిర్లక్ష్యం
సాన్నిహిత్యంలో అసహనం
అదనపు మత్తు కోసం ఆరాటం
కాగితం పూలల్లో సువాసన లేదనే నిర్వేదన
అవతారాల మీద కాంక్ష
తనేమిటో తెలియని అసందిగ్ధత
అతడు అసత్యాన్ని గట్టిగా చెబుతాడు
మంచు పూబిలో
కూరుకుపోతున్న వాడిలా అరుస్తాడు
అతని వాగ్దానాలు అన్ని కల్పితాలే
అతనికి నిజం చెప్పడంరాక వేదన చెందుతున్నాడు
చేతుల్లో మంచు ముద్దలు పంచుతున్నాడు
అవును। బుద్ధుడు మూడు మాటలతో
ప్రపంచాన్ని ఆక్రమించాడుగా
ఆ లంబాడీస్త్రీ పావడాఅద్దం మసిబారుతుంది సుమా!
సూర్యాస్తమయం తొందరలో వుంది
అబద్ధాలకు అనంతభాష ఎందుకు ఏలికా!
సత్యపథంలో గమించు! వెలుగు దారి కనిపిస్తుంది!

-డాక్టర్ కత్తి పద్మారావు, ✆: 9849741695

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
12 మార్చి 2018



పెళ్లి - పరీక్ష !

ఈ అమ్మాయిని చూస్తుంటే పెళ్లి నుంచి నేరుగా పరీక్ష రాయడానికి వచ్చినట్టు కనిపిస్తోంది కదా! అయితే ఆ పెళ్ళి ఎవరిదో కాదు తనదే. పెళ్లి అయిన వెంటనే బిఏ డిగ్రీ పరీక్షలు రాసేందుకు వచ్చేసింది. ఆ దృశ్యమే ఇది. రెండు రోజుల కిందట ఈ సంఘటన రాజస్థాన్‌లోని బికనీర్‌లో జరిగింది. ఆ అమ్మాయి పేరు అరుణా ప్రజాపత్. అన్ని రకాలుగా వెనుకబడిన రాజస్థాన్ రాష్ట్రంలో ముఖ్యంగా బాల్యవివాహాలు, ఆంక్షల నేపథ్యం ఉన్న ఈ రాష్ట్రంలో అమ్మాయిలూ ధైర్యంగా ముందడుగు వేస్తున్నారనడానికి ఈ చిత్రం మరో నిదర్శనం అనుకోవచ్చునేమో!







కలంకారీ దుప్పట్టాలు!

కలంకారీ చీర అయినా, డ్రస్ అయినా, దుప్పట్టా అయినా ఇట్టే తెలిసిపోతుంది. దాని ప్రత్యేకతే అది. సహజమైన రంగుల్లో, చిక్కనైన చేతి అల్లికతో, నిండైన డిజైన్లతో కొత్త అందాన్ని తెస్తుంది కలంకారీ. కాటన్ మేళవింపుతో కూడిన కలంకారీ వేసవికి సూటైన ఫ్యాషన్. ఈ దుప్పట్టాలను చూస్తే ఈ మాట అవుననుకుండా ఉండగలమా!







పూతలు రాత్రిపూటే!



చర్మం పొడిబారడం వల్ల చాలా ఇబ్బందులు వస్తాయి. అందుకని పొడి బారిన చర్మాన్ని నిర్లక్ష్యం చేయకుండా మరింత శ్రద్ధగా సంరక్షించుకోవాలి. లేదంటే వృద్ధాప్య సంకేతాలు త్వరగా కన్పిస్తాయి. చర్మం నిగారింపు తాత్కాలికంగా కాకుండా దీర్ఘకాలం కనిపించాలంటే రాత్రిపూట పూతలు వేయండి. ఉదయం వరకూ వాటిని అలాగే ఉంచండి. అలాగని అన్ని రకాల పూతలూ ఎక్కువసేపు ఉంచుకోవడం కుదరదు. మరి రాత్రిపూట వేసుకోదగ్గ పూతలేవో చూద్దాం.

బాదం నూనె

ఇది చాలా ప్రభావంతమైన పూత. ఈ పూత కోసం బాదం నూనెతో పాటు నువ్వుల నూనెను తీసుకోండి. 1 స్పూన్ బాదం నూనెకు 3-4 చుక్కల నువ్వుల నూనెను కలపండి. దీన్ని మీ వేళ్లతో ముఖంపై బాగా మర్ధనా చేయండి. దీనివల్ల రక్త ప్రసరణ కూడా జరుగుతుంది. మర్దనా చేశాక పడుకోండి. ఉదయానికి మీ ముఖంలో ప్రకాశవంతమైన మెరుపును గమనించవచ్చు. బాదం నూనెలోని విటమిన్-ఇ మీ చర్మానికి మంచి పోషకంగా పనిచేస్తుంది.

నిమ్మకాయ-పాలు మీగడ

ఈ పూతను తేలికగా ఇంటి దగ్గరే చేసుకోవచ్చు. నిమ్మరసం, పాలమీగడ తీసుకోండి. ఒక టేబుల్ స్పూన్ పాల మీగడకు పావు స్పూన్ నిమ్మరసాన్ని కలపండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించండి. రాత్రంతా ఉంచండి. ఉదయాన్నే కడగేయండి. పాల మీగడ వల్ల చర్మం తేమను పొందుతుంది. నిమ్మకాయ ముఖం మీద మచ్చల్ని నివారిస్తుంది.

టమాటా - తేనె

చర్మం నిగారింపునకు టమాటా అద్భుతంగా పనిచేస్తుంది. ఇది అన్ని రకాల చర్మాల వారికి సరిపోతుంది. కొన్ని టమాటాలను తీసుకొని గుజ్జుగా చేయండి. దానికి ఒక టేబుల్ స్పూన్ తేనెను చేర్చి బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించండి ఇది తలగడ దిండ్లు, బెడ్ షీట్‌లకి అంటుకుంటుంది అనుకుంటే దిండు దగ్గరే ఒక టవల్‌ని పెట్టుకోండి.

ఓట్స్- తేనె

రెండు టేబుల్ స్పూన్‌ల ఓట్స్, రెండు టేబుల్ స్పూన్‌ల తేనె తీసుకోండి. రెండింటిని కలిపి ఐదు నిముషాలు వుంచండి. ఓట్స్ మెత్తడిన తర్వాత గుజ్జులా చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించండి. దీని వల్ల పొడి బారిన చర్మం తిరిగి తేమను పొందుతుంది.

పిల్లలు పక్క తడుపుతున్నారా !



సాధారణంగా పిల్లలు రాత్రుళ్ళు పక్క తడుపుతుంటారు. ఈ విషయానికి తల్లులు కోప్పడటం సహజం. దుప్పట్లు, బెడ్‌షీట్స్ ఉతకాల్సి వస్తోందని, పని ఎక్కువయిందని, ఇల్లంతా వాసన వస్తోందని పిల్లల్ని విసుక్కుంటూ ఉంటారు. ఏడు సంవత్సరాల లోపు పిల్లల్లో పక్క తడపడం మామూలు విషయమే. ఏడేళ్ళు నిండిన పిల్లలు కూడా పక్క తడుపుతుంటే అదొక సమస్య గానే పరిగణించాలి. వెంటనే దీనికి తగు చికిత్స తీసుకోవాలి. వైద్యపరంగా పక్క తడపడాన్ని నాక్టర్నల్ ఎన్యూరెసిస్ అంటారు. ఇది గాఢ నిద్రలో వున్నపుడు వారికి తెలియకుండా జరుగుతుంది. ఇది చిన్న పిల్లల్లో మాత్రమే కాదు కొంత మంది పెద్దవారిలో కూడా ఉంటుంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడమనేది వారికి బహుకష్టంతో కూడుకున్న పని. ఎక్కడికీ వెళ్ళలేరు, ఎవ్వరి ఇంట్లోనూ ఉండలేరు. దీనివల్ల వారు మానసికంగా బాధపడుతుంటారు. మూత్రాశయ సంబంధిత సమస్యలు, మధుమేహం, ఎక్కువగా మూత్రం ఉత్పత్తి కావటం, శరీరంలో ఉష్ణోగ్రత నిర్దిష్టంగా లేకపోవడం, హార్మోన్స్ సరిగ్గా లేకపోవటం, మూత్రాన్ని ఆపుకోలేకపోవడం వల్ల పిల్లలు నిద్రలో పక్క తడుపుతారు. ఈ సమస్యను అరికట్టడానికి ఈ ఇంటి చిట్కాలను ప్రయత్నించండి.


1. వాల్‌నట్స్-ఎండు ద్రాక్ష : వాల్‌నట్స్, ఎండుద్రాక్ష మంచి అల్పాహారం. ఈ రెండింటినీ కలిపి ప్రతి రోజు రాత్రి పిల్లలు పడుకునేముందు తినిపించండి. వీటిని విడివిడిగా ఇస్తే ఫలితం వుండదు. కలిపే ఇవ్వాలి. ఇలా కొంతకాలం చేస్తే పక్క తడపరు. ఇవి తినడం వల్ల శరీరానికి పోషకాలు అందుతాయి.

2 తేనె : తేనె అంటే ఇష్టపడని వారుండరు. ఇది ప్రకృతి ప్రసాదించిన వరం అనే చెప్పుకోవాలి. దీని తీపి సహజ సిద్ధమైనది. దీనిని ప్రతి రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి ఎటువంటి హాని కలుగదు. తేనె హైగ్రోస్కోపిక్ గుణాలను కలిగి ఉంది. దీని వల్ల శరీరానికి తేమ పుష్కలంగా అందుతుంది. దీనిని రోజూ తీసుకోవడం వల్ల పక్క తడిపే సమస్య తేలికగా పరిష్కారమవుతుంది.

3 దాల్చిన చెక్క : ఇది వంటింట్లో వుండే ఆరోగ్యకరమైన పదార్థం. ప్రతి రోజూ మీ పిల్లలు దాల్చిన చెక్క నమిలేలా చూడండి. లేదంటే వారికి ఇష్టమైన పదార్థాల్లో ఈ పొడిని కలిపి ఇవ్వండి. దీని వల్ల పక్కతడిపేలా ప్రేరేపించే బ్యాక్టీరియాను, మధుమేహ కణాలను నియంత్రించవచ్చు. ఇది శరీరంలోని అనవసరపు కొవ్వును కరిగిస్తుంది కూడా.

4. ఉసిరి : భారతదేశ ఉన్నత జాతి పండుగా పిలువబడే ఉసిరి పక్క తడిపే సమస్యకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. చాలా మంది పిల్లలు ఉసిరి కాయల్ని అంతగా ఇష్టపడరు. అప్పుడు వాటిని జ్యూస్‌లా తయారు చేసి దానిలో కొద్దిగా తేనె, చిటికెడు పసుపు వేయండి లేదా మిరియాల పొడి వేస్తే తప్పకుండా అందరూ ఇష్టపడతారు.

జీమెయిల్ ల్యాబ్స్ ఫీచర్లు ప్రయత్నించండి



ఈ రోజుల్లో కంప్యూటర్లు వాడని వాళ్లు బహుశా అరుదు. ఇందులో జీ మెయిల్ గురించి తెలియని వాళ్లు ఉండరు. దీని గురించిన కొన్ని విశేషాలు...

మనం రోజూ వాడే జీమెయిల్ మాత్రమే కాదు... జీమెయిల్ ల్యాబ్స్ అనే ప్రత్యేక విభాగంలోకి కొన్ని ఎక్స్‌టెన్షన్లని ఎనేబుల్ చేయడం ద్వారా మనం అనునిత్యం వాడే జీమెయిల్ నుంచి మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు. వాటిలో కొన్నింటి గురించి తెలుసుకుందాం.

ఎక్కడ ఉంటాయి ?

మీ జీమెయిల్ అకౌంట్‌లోకి లాగిన్ అయిన తరువాత Settings> Labs లోకి వెళితే ఇందులో పలు రకాల సదుపాయాలు కనిపిస్తుంటాయి. వాటిలో మనకు కావలసిన దానిని ప్రయత్నించవచ్చు.

మెయిల్ గ్రూపింగ్‌కి..

మీ జీమెయిల్ ఇన్‌బాక్స్‌కి వేర్వేరుచోట్ల నుంచి వచ్చిన మెయిల్స్ అన్నింటినీ చిందరవందరగా చూపించకుండా మీకు నచ్చిన ఆర్డర్ ప్రకారం వాటిని గ్రూప్ చేసిపెట్టడానికి మల్టిపుల్ ఇన్‌బాక్సెస్ అనే జీమెయిల్ ల్యాబ్ సదుపాయం ఉపయోగపడుతుంది. ఈ క్రైటీరియా ఏంటన్నది మీరు మీకు నచ్చినట్లు సెట్ చేసుకోవచ్చు. ఆఫీస్ మెయిల్స్ అన్నీ ఒకచోట పొందవచ్చు.

నచ్చిన కీబోర్డ్ షార్ట్‌కట్‌లు

జీమెయిల్‌ని వాడడానికి డీఫాల్ట్‌గా కొన్ని కీబోర్డ్ షార్ట్‌కట్‌లు ఉన్నప్పటికీ మనకు మనం స్వంతంగా ఏవైనా షార్ట్‌కట్‌లను డిఫైన్ చేసుకోవడానికి కీబోర్డ్ మ్యాపింగ్ అనే ఓ సదుపాయం పనికొస్తుంది. కొత్త మెయిల్ కంపోజ్ చేసుకోవడం దగ్గరనుంచి అనేక పనులకి కీబోర్డ్ షార్ట్‌కట్‌లను మనం దీని ద్వారా కాన్ఫిగర్ చేసుకోవచ్చు.

ఆటోమేటిక్‌గా లేబుల్స్ కోసం..

మీ ఇన్‌బాక్స్‌కి వచ్చే మెయిల్ సబ్జెక్ట్‌ని బట్టి వాటిని ఆటోమేటిక్‌గా నిర్ధిష్టమైన లేబుళ్ళ కింద వర్గీకరించి అరేంజ్ చేయడానికి స్మార్ట్ లేబుల్స్ అనే జీమెయిల్ ల్యాబ్ సదుపాయం ఉపయోగపడుతుంది. ప్రయత్నించండి.





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఆరునెల్లైనా కాలేదే - అప్పుడే ఇంత లాభం గడించాడండీ!" అన్నాను నా ఆశ్చర్యాన్ని ఆపుకోలేక. "అసలు ఇది చిల్లర అనుకోండి - అసలుది పెద్దయెత్తు భారీ వ్యాపారం మరొకటి వుంది. పాపం, ఆ బర్మా కాందిశీకులని చూస్తే తిన్న తిండి సయించదనుకోండి. అందులోనూ స్త్రీలు పడే బాధ మరింత దారుణం. అప్పల నాయుడుగారు యీ అనాథ స్త్రీలకోసం ముత్తయిదువలు, పడుచువారు. పిల్లలు - అన్ని వూళ్ళోలోనూ సదనాలు, రక్షణ సమితులు, నికేతనాలు పెట్టించి పోషిస్తున్నారు. అంటే పెద్దపెద్ద మేడలు, భవనాలు కాదను కోండి, చిన్నచిన్న పూరిగుడిసెలే అనుకోండి - ఐతేనేం తలదాచు కుందుకు. అలాగు అన్ని చోట్ల ముఖ్యంగా మిలిటరీక్యాంపులు, బారకాసులువున్నచోట్ల యీ వసతులని కల్పించి యీ స్త్రీలకింత జీవనోపాధి కల్పిస్తున్నారు." "నాకు అర్థం కావడంలేదు. స్త్రీలకి జీవనోపాధి అంటే" అని అడిగే. "అబ్బే, మరేం లేదు. ఈ మిలిటరీ వాళ్ళందరూ ఉప్పు కారం తినే మనుష్యులుగదండీ!

(నిన్నటి సంచిక తరువాయి)

వాళ్ళకి యేదేనా వ్యాపర్తి కల్పించకపోతే యుద్ధ భూమిమీద వీరరసం ప్రదర్శించి శత్రువునుంచి మనని యెలా కాపాడగలరు? మిలిటరీ వాళ్ళకి కాస్త వేళంబన - యీ అనాథ స్త్రీలకి కాస్త సంపాదన రెండూ వుండేలాగా - మిలిటరీ అధికారుల అనుమతిమీద నాయుడుగారు వ్యాపారం జరిపిస్తున్నారు" అన్నాడు. నేను పట్టలేక "విలాస గృహాలా?" అన్నాను. "అలాగే అనుకోండి. ఇంగ్లీషులో క్యాంటీనులంటారు. సంస్కృతంలో మీరు సెలవిచ్చినట్లు విలాసగృహా లంటారు. విలాసానికి అట్టే తావుండదు కాబట్టి - అచ్చమైన దేశభాషలో మంచాలు నడిపించడం అంటారు. అన్నీ ఒకటే అనుకోండి! నాయుడిగారి అజమాయిషీతో అటువైపు గౌహతీ, రంగపూరు, ఇంఫాల్, కోహిమా, ఇటువైపు మణిపూర్, లఖింపూరు, రాణాఘాటు - అన్నిచోట్ల అమాంబాపతూ ఓ వెయ్యి మంచాల వ్యాపారం అనర్గళంగా నడిపిస్తున్నారు. లావాదేవీలు, భత్యాలు, పారితోషికాలు బహుమతులు, జీతాలు, కూలీలు, మందులు, మరామతులు, పెద్ద ఆఫీసర్లకి కాంపిమెంటరీలు, చిన్నహవల్దార్లకి ఫ్రీప్యాసులు పోను - నెలకి మంచానికి యెంత చచ్చురాబడి అయినా యాభయి రూపాయలకి తక్కువ వుండదు" అన్నాడు. ఆయన "శివ శివ, ఘోరం వినలేం" అని నేను చెవులు మూసుకున్నాను. "జనార్దనరావుగారూ! మీరు సత్యకాలపు వారు. ప్రపంచ ధర్మం - యెవరు మార్చగలరు? ఆ అనాథ స్త్రీలకి నాయుడుగారు ఆ మాత్రం దారి చూపించకపోతే - వాళ్ళ గతి యేం కాను? యే నుయ్యో గొయ్యో చూసుకోవలసిందేనా? అది తప్పించి వాళ్ళకి తలదాచుకుందుకు కొంప - కట్టుగుడ్డ, రెండుపూటలతిండి పడేస్తున్నాడు. ఇంతకీ వాళ్ళని రాళ్ళు కొట్టమన్నాడా. - బండలని మొయ్యమన్నాడా? వాళ్ళు వ్యాపారమా యేమిటి? జపానువాడు యెలాగా క్రిస్టమస్‌కి కలకత్తా, చెన్నపట్నం బాంబువేసి దేశాన్ని ఆక్రమించుకోబో తున్నాడని ఆరోజు మిలిటరీ ఇంజనీర్లు మీ యెదుటే చెప్పారు. దాంతో నాయుడుగారి వ్యాపారానికి చెల్లు. అంచేత యీ కొద్ది రోజుల్లోనే దీపం ఆరిపోయే లోపులో ఇల్లు చక్కబెట్టుకోవాలికదండీ మరి?" అన్నాడు. "మరి చెప్పకండి సేట్‌జీ! నేనిక వినలేను. ఇంత అధర్మం వుంటుందని కలలోనైనా అనుకోలేదండీ! అబ్బ! వారి వ్యాపార విషయాలన్నీ ఇన్ని తబిసీళ్ళతో మీకెలా తెలుసునండీ?" అని అడిగేను ఆశ్చర్యంతో. ఆయన నవ్వుతూ "దేశం నాల్గు మూలలా మావాళ్ళున్నారు కదండీ! తెలుస్తూంటాయి. అదిన్నీ గాక జపాను మిలిటరీ వాళ్ళకి మా తమ్ముడు నేతి సప్లయి కంట్రాక్టు చేశాడు. నాయుడుగారి వ్యాపారంలో మా తమ్ముడికి పావలా వాటా వుందిలెండి. అప్పుడప్పుడు నాకు నాల్గు లకారాలు, ఐదు లకారాలు చేబదులు కావలిస్తే వాడు సాయం చేస్తుంటాడు. ఏకోదరులం మంచి చెడ్డ ఒకరికొకరం సాయం చేసుకోకపోతే యెలా బతకగలం చెప్పండి!" అన్నాడు. "గులాబుచందు గారూ! నా కొక సందేహం వుంది. ఈ సంగతులన్నీ సీతారాంగారికి తెలియవనుకుంటాను" అన్నాను. "ఆ! తెలియకపోవడమేం అండీ? తండ్రి సంపాదన తెలియని కొడుకున్నూ కొడుకు పుట్టుక తెలియని తల్లీ వుంటుందా అని మాలో సామెత వుందిలెండి. అయితే,



ఆయనమాత్రం యేం చేస్తాడు? తండ్రి ఆస్తి వద్దు అంటే లోకం యేమంటుంది చెప్పండి? ముక్కుమీద వేలువేసుకుని విడ్డూరంగా చెప్పుకోరూ? అయితే మాత్రం సీతారాంగారు చాలా మంచివాడు. అందుచేతనే డికిన్సన్ లండనునుంచి చీఫ్ ఇంజనీరుని తెచ్చి ఇక్కడ పెడతాం అంటే, నేను వీల్లేదని పట్టుపట్టి ఈయన్ని వేయించాను. బారిష్టరు శాస్త్రిగారి అమ్మాయిగార్కి సీతారాంగారికి సీమలో పరిచయం అని ఊర్వశి మిత్రాగారు చెబుతూంటే విన్నాను." "అన్నట్టు ఊర్వశిగా రెవరండీ? చాలా అపూర్వ వ్యక్తిలా వుంది!" "అక్షరాల! ఆమెకి రాజకీయాల్లో మంచి ప్రవేశం వుందండీ! ఆమెలో చిత్రం యేమిటంటే యే రాజకీయ పక్షం అధికారంలో వుంటే - ఆ పక్షంలోనే మంచి పలుకుబడి సంపాదించే శక్తి వుంది ఆమెలో! మాకు చాలా సన్నిహితురాలు ఆమె. మేము ఎప్పుడేనా వ్యవహార రీత్యా పెద్ద పెద్దవాళ్ళ దగ్గరకి వెళ్ళవలసి వస్తే ఊర్వశిగారిని తీసుకువెళితే ఎంతటి పనేనా ఆమె చేసుకొస్తుంది. మంచి వ్యవహర్త. ఆ మాత్రం తెలివైనా వాళ్ళు కాంగ్రెసులో ఎవ్వరూ లేరనుకోండి. అప్పుడప్పుడు కమీషనుకిందా, ఖర్చుకిందా కొంత తీసుకున్నా పని సాధించుకొస్తుందండీ! ఇక విరాళాలు, చందాలు వసూలు చెయ్యడంలో ఆమె సిద్ధహస్తం. అన్నట్టు మీరు విశాఖపట్నం వారు అని తెలిసి ఆలమండనుంచి సువర్ణరేఖలు రెండువందలు తెప్పించాను. ఇవిగో, లోగిట్లో పెట్టించమని సెలవా?" అన్నాడు. "సేట్జీ! యిలాంటి పని యెన్నడూ చెయ్యకండి. పళ్ళు మీరే మళ్ళీ పట్టించుకు వెళ్ళండి! మునుస్వామీ! ఆ బుట్టలు సేట్జీగారి కారులో పెట్టు" అన్నా. "తమ కింకా నామీద ఆగ్రహం పోలేదన్నమాట! పోనీలెండి - నా దురదృష్టం. ఇంతకీ కాస్సేపు మీ సత్సాంగత్యం లభించింది - అంతేచాలు! సెలవు దయచేయించండి! చిత్తం" అని వెళ్ళిపోయాడు. గడియారం ఏడు కొట్టింది.

అయ్యరు సినీమాకి వెళతానన్నాడు. అంచేత ఏడున్నరకే భోజనం చేసేశాను. తమలపాకులు వేసుకున్నాను. టెలిఫోను గంట! యింత పొద్దుపోయి ఎవరు చెప్మా అనుకుని ఫోను తీశాను.

"జనార్దనరావుగారూ! నేను సుభని మాట్లాడుతూంట. చిన్న విషయం: మేం అందరం మరి నలుగురైదుగురి ఇళ్ళకి వెళ్ళి ఒక అరగంట కిందట ఊర్వశి ఇంటికి చేరుకున్నాం. అప్పటికే మాతోకూడా మీ ఇంటికి వచ్చాడే కాంగ్రెసు టోపీ పెట్టుకున్న సేట్జీ అక్కడ సిద్ధంగా వున్నాడండి. మేం కార్లోంచి దిగగానే అతను ఊర్వశి దగ్గరే కెళ్ళి 'జనార్దనరావుగారు ఇందాక విరాళాల పద్దులో వేసిన రెండువందల అంకెకీ ఒక సున్నచేర్చి రెండు వేలుగా మార్చేసి తక్కిన పైకం పద్దెనిమిది వందలూ నేను మీకు చెల్లించేస్తాను' అంటూ మీరు వేసిన అంకె మార్చేసి చెక్కు రాయబోయాడండీ! ఊర్వశి ఒకటే పొంగిపోయి, సేట్జీని అమాంతంగా కౌగలించేసుకుందంటే నమ్మండి. నేను మాత్రం వెంటనే విరాళాల జాబితా అతని చేతిలోనుంచి లాక్కుని ఆ మార్చిన అంకె కొట్టేసి మీరు వేసిన రెండు వందలే నా చేత్తో వేసేసరికి తాతలు దిగొచ్చారనుకోండి. ఊర్వశి నన్ను ఒకటే కోంబడింది.

"దీన్లో తప్పేంవుంది? ఆయనవేసిన మొత్తాన్ని హెచ్చు చేస్తున్నాంకాని తగ్గించలేదుకదా? సొమ్ము ఎవరు చెల్లిస్తే ఏమిటి? జనార్దన రావుగారికి తెలిసిన మనిషి, ఆయనకింద పనిచేసే కంట్రాక్టరుగారే కదా మిగతా మొత్తాన్ని భర్తీచేసింది. దీనికింత రాద్ధాంతమేమిటి?" అంది ఆవిడ. ఆ సేట్ జీని నేను మాత్రం మారాం పెట్టుక్కూచున్నాను. మీకు తెలిసి మీ అనుమతిమీద. మీ కాంట్రాక్టరు డబ్బు ఇవ్వడం అసలు తప్పు.మీకు తెలియకుండా మీరు వేసిన అంకెకి మరో సున్నా చేర్చి - మీవంతు అతను ఇవ్వడం క్షమించరాని తప్పు అని నేను అనుకుని చేశాను. నేను అలా చెయ్యకపోతే మీ పేరుకి తీరని కళంకం వస్తుందని నమ్మి చేశాను. మీ గురించి ఎవరు ఏమాత్రం అనుకున్నా నేను సహించలేను - సహించను. నేను సరిగ్గా చేశానా లేదా. చప్పున జవాబు చెప్పండి - ఆలోచించకుండా ఒకటి - రెండు - "అంది. "మీరు నాకు గొప్ప మేలు చేశారు. నేను మీకెంతో కృతజ్ఞుడిని. మీ రుణాన్ని నేను ఎలా తీర్చుకోగలను?" అన్నా. "ఆ విషయం ఆలోచించి చెప్తాలెండి!" అని పక్కున నవ్వింది. వెండిగజ్జెలు మ్రోగినట్టు అయింది. అమావాస్యరాత్రి ఒక్క పళంగా వెన్నెల క్రింద మారిపోయింది. "జనార్దనరావుగారు! ఏదో పరధ్యానంగా వున్నట్టున్నారు, చూడండి - ఒక్క విషయం. మీరు మాత్రం యీ విషయం తెలిసినట్టు సేట్జీతోగాని, మరెవ్వరితోగాని చెప్పకండి. ఖరారేనా?" "ముమ్మాటికీ సుభగారూ!" అన్నా. "సరే, మరి సెలవు" అని సంభాషణ పూర్తి చేసింది.

13 ఆమె

ఊర్వశి యెంత దగా చేసింది! నాతో చెప్పకుండా నా పేరు పెట్టుకుని జనార్దనరావుకి ఫోను చేయడమా? ఏం మాట్లాడిందో, అతను యేమనుకున్నాడో. తేలికగా ఇట్టే అనేసింది - అతని ముందూ మా అందరి ముందున్నూ. తరువాత గులాబుచెందు గారు - అంకెమార్చి జనార్దనరావు బదులు తను డబ్బిస్తానంటే తలవూపడమే? తల వూడపడమేమిటి - అతని మీదపడి కౌగలించుకుంటే! ఛ! అతనికీ ఊర్వశి సరసం అలవాటు లాగేవుంది. నేను అక్కడ లేకపోయివుంటే జనర్దనరావుకి ఎంత అపకారం జరిగివుండును! అతన్ని చూస్తే జాలే వేస్తుంది. నా అనేవాళ్ళు యెవ్వరూ లేరుకదా! సీతారాం చెప్పాడు - అతని తల్లి నీళ్ళ బిందెలు మోసి పైసలు కూడబెట్టి చదువు చెప్పించిందట. వాళ్ళమ్మ ఎంత మంచి ఆవిడో మరి! మా అమ్మా, నాన్నా నన్ను పోషించలేక ముక్కు మొహం తెలియని పరాయివాళ్ళకి డబ్బుకి అమ్మేశారు. సీతారాం జనార్దనరావుని బాగా ఈసడిస్తూనే విసిరాడు విసుర్లు. అంతటితో వూరుకున్నాడా? "కల్ల నిజము రెండు కరకంఠు దెరుగును, నీరు పల్ల మెరుగు నిజముగాను! తనయుని జన్మంబు తల్లి తానెరుగును విశ్వదాభిరామ వినురవేమ!" అని పద్యం చదివేడు. నాకే నచ్చలేదు. అతని వేళాకోళం. నీళ్ళ బిందెలు మోసిందని ఆమెకు అప్రతిష్ట అంట కడుతున్నాడు. జనార్దనరావుకి అప్రతిష్ట రాకుండా కాపాడాలని నాకుంది.

- ఇంకా వుంది.

తెలంగాణ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులకు నోటిఫికేషన్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు (232), గిరిజన సంక్షేమ గురుకులాలు (88), బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు (142), టీఆర్ఈఐఎస్ గురుకుల (జనరల్) పాఠశాలలు (35)... ఇలా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న 497 గురుకుల పాఠశాలల్లో 2018-19 విద్యాసంవత్సరానికి 5వ తరగతి (ఇంగ్లిష్ మీడియం-తెలంగాణ స్టేట్ సిలబస్)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదలైంది. ప్రవేశ పరీక్ష 2018, ఏప్రిల్ 8న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరగనుంది. ఈ నేపథ్యంలో గురుకులాల ప్రత్యేకతలు, విద్యార్థులకు ప్రయోజనాలు, ప్రవేశ ప్రక్రియ, అర్హతలు, దరఖాస్తు విధానం గురించి తెలుసుకుందాం...

గురుకులాల ప్రత్యేకతలు..

కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించాలంటే.. ఫీజు లక్షల్లోనే ఉంటుంది. గురుకుల పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువు, భోజనం, వసతి అన్నీ ఉచితమే.

సమర్థులైన, సుదీర్ఘ అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బోధనతో పాటు, 24 గంటల పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని.. పరిష్కరించేందుకు హౌస్ మాస్టర్/ హౌస్ పేరెంట్ వ్యవస్థ ఉంటుంది.

ఐఐటీ, ఎంసెట్, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా నిపుణులు శిక్షణ అందిస్తారు.

సెంట్రల్ యూనివర్సిటీలు, నల్సార్, టిస్, ఇఫ్లూ తదితర ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా విద్యార్థులకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తారు.

పాఠ్యాంశాలతోపాటు క్రీడలు, యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, మార్షల్ ఆర్ట్స్, లలిత కళలు తదితరాలపైనా అవగాహన కల్పిస్తారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేలా బహుమతులు అందిస్తారు. వీటన్నింటితోపాటు విద్యార్థులకు పోషకాహారం, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫామ్, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.

అర్హతలు : 2017-18 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో విద్యార్థి 4వ తరగతి చదువుతుండాలి.



వయసు : 2018, సెప్టెంబర్ 1 నాటికి జనరల్, బీసీ విద్యార్థులకు 9-11 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఆదాయ పరిమితి : 2017-18 ఆర్థిక సంవత్సరంలో విద్యార్థుల తల్లిదండ్రులు/ సంరక్షకుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000 మించరాదు. సైనికోద్యోగుల పిల్లలకు ఆదాయ పరిమితి నిబంధన వర్తించదు.

ఎంపిక ప్రక్రియ :

ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ విధానం, స్థానికత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆయా గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.

విద్యార్థుల ఎంపికకు ప్రతి పాత జిల్లాను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు.

కౌడిపల్లి పాఠశాలలో ప్రవేశం కోసం మత్స్యకార వృత్తికి చెందిన తెలంగాణ జిల్లాల్లోని అన్ని వర్గాల విద్యార్థులు అర్హులు.

సర్వేల్ (నల్గొండ జిల్లా) రీజనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ప్రవేశానికి, తెలంగాణలోని 31 జిల్లాల వారు అర్హులు. ఈ పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థి ప్రతిభ, రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రవేశం ఉంటుంది.

దరఖాస్తు విధానం:

అభ్యర్థులు ప్టిజూ:7/స్త్రషెవ్.ఎెస్త్ర.స్త్రశీజ.అఅ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు విద్యార్థి పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల మొబైల్ నంబరు ఇవ్వాలి.

సంబంధిత జిల్లా పేరు, ఆధార్ నెంబర్ నమోదు చేసి, ప్రవేశ పరీక్ష రుసుం రూ.50 చెల్లించిన (నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్ కార్డ్/ డెబిట్ కార్డ్ ద్వారా) తర్వాత ఒక రిఫరెన్స్ ఐడీ నెంబర్, దరఖాస్తు ఫారం కనిపిస్తుంది. ఆ ఫారంలో అన్ని వివరాలు నింపాలి.

పరీక్ష తేదీకి పదిరోజుల ముందు నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తిచేసిన దరఖాస్తు నమూనా కాపీ, హాల్‌టికెట్‌ను ప్రింట్ అవుట్ తీసుకొని భద్రపరచుకోవాలి.

ఒకసారి దరఖాస్తు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులకూ అవకాశం ఉండదు. కాబట్టి దరఖాస్తు అప్‌లోడ్ చేయడానికి ముందే సరిచూసుకోవాలి.

ప్రవేశ పరీక్ష :

మొత్తం 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. జవాబులు ఓఎంఆర్ షీట్‌లో మాత్రమే గుర్తించాలి.

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
తెలుగు	20	20
ఇంగ్లిష్	25	25
గణితం	25	25
మెంటల్ ఎబిలిటీ	5	5
పరిసరాల విజ్ఞానం	25	25
మొత్తం	100	100

దరఖాస్తుకు చివరి తేదీ : మార్చి 16, 2018.

పరీక్ష తేదీ: ఏప్రిల్ 8, 2018 (ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు).

వెబ్‌సైట్ : http://tgcet.cgg.gov.in

నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతి ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2018-19కి గాను 9వ తరగతిలో మిగిలిన ఖాళీలకు లేటరల్ ఎంట్రీ కింద దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యకు చిరునామాగా నిలిచే ఈ విద్యాలయాలు తమిళనాడు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి మొత్తం 626 ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లోని జేఎన్‌వీల్లో ఖాళీలు..

ఆంధ్రప్రదేశ్‌లో... అనంతపురం-0, చిత్తూరు-9, తూర్పు గోదావరి (1)-10, తూర్పుగోదావరి (2)-1, గుంటూరు-13, వైఎస్సార్ కడప-7, కృష్ణా-9, కర్నూలు-2, నెల్లూరు-6, ప్రకాశం (1)-4, ప్రకాశం (2)-8, శ్రీకాకుళం-3, విశాఖపట్నం-4, విజయనగరం-5, పశ్చిమ గోదావరి-8.

తెలంగాణలో...

ఆదిలాబాద్-2, కరీంనగర్-7, ఖమ్మం-7, మహబూబ్‌నగర్-7. మెదక్-6, నల్గొండ-6, నిజామాబాద్-9, రంగారెడ్డి-5, వరంగల్-2. తెలంగాణలో పాత ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జేఎన్‌వీలు ఉన్నాయి.

అర్హతలు : ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2017-18 విద్యాసం



వత్సరంలో 8వ తరగతి చదువుతూ తుది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు.

వయసు : 2002, మే 1-ఏప్రిల్ 30, 2006 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక : ప్రవేశ పరీక్ష ద్వారా.

ప్రవేశ పరీక్ష విధానం : దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ నుంచి 15, హిందీ-15, మ్యాథమెటిక్స్-35, సైన్స్ నుంచి 35 చొప్పున ప్రశ్నలు ఇస్తారు. ఎనిమిదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి 2 గంటల 30 నిమిషాలు. పరీక్ష ఇంగ్లిష్, హిందీ మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 5, 2018.

ప్రవేశ పరీక్ష తేదీ : మే 19, 2018.

వెబ్‌సైట్ : www.nvshq.org

ఐసీఏఆర్ - అగ్రికల్చర్ కోర్సులు

దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, అనుబంధ కోర్సుల కళాశాలల్లో డిగ్రీ, పీజీ, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి నిర్వహించే జాతీయస్థాయి పరీక్షల తేదీలను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ప్రకటించింది. దీనిద్వారా వ్యవసాయ యూనివర్సిటీల్లోని బ్యాచిలర్ కోర్సుల్లో 15 శాతం సీట్లను; పీజీలో 25 శాతం, డాక్టోరల్ కోర్సుల్లో 25 శాతం సీట్లను భర్తీచేస్తారు.

కోర్సు- అర్హతలు- పరీక్ష తేదీలు :

అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) :

అర్హత : ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/ అగ్రికల్చర్/ మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్/ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులూ అర్హులే.

యూజీ ప్రవేశ పరీక్ష తేదీ : 2018, మే 12న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు.

పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) :

అర్హత : అగ్రికల్చర్, అనుబంధ సైన్స్ కోర్సులు లేదా సంబంధిత విభాగంలో.. నాలుగేళ్ల కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఏఆర్ఐ, ఎన్‌డీఆర్ఐలలో కొన్ని కోర్సులకు మూడేళ్ల వ్యవధి ఉన్న డిగ్రీ కోర్సులు చేసిన వారూ అర్హులే. ఫైనల్ ఇయర్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రవేశ పరీక్ష తేదీ : 2018, మే 13న



ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు. పీజీ కోర్సులకు ఎంపికైన వారిలో 475 మందికి ఐసీఏఆర్ పీజీ ఉపకార వేతనం లభిస్తుంది. ఒకవేళ ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికవ్వకుండా, స్థానికేతర రాష్ట్రంలో సీటు పొందితే నేషనల్ టాలెంట్ స్కాలర్‌షిప్ (పీజీఎస్) పొందొచ్చు.

పీహెచ్‌డీ :

అర్హత : గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్, అనుబంధ కోర్సుల్లో పీజీ పూర్తిచేసిన/ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు అర్హులు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష తేదీ : 2018, మే 13న ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు.

వెబ్‌సైట్ : www.icar.org.in

ఏపీ గురుకుల పాఠశాల సెట్- 2018

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ (182), గిరిజన సంక్షేమ శాఖ (35), బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (41), ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (50) తదితర మొత్తం 308 గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలోకి ప్రవేశానికి ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, అమరావతి నోటిఫికేషన్ విడుదల చేసింది.

గురుకులాల ప్రత్యేకతలు..

గురుకులాల్లో ప్రవేశంపొందిన విద్యార్థులకు సమర్థులైన ఉపాధ్యాయుల బోధన, పర్యవేక్షణ లభిస్తుంది.

సమర్థులైన, సుదీర్ఘ అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బోధనతోపాటు, 24 గంటల పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థుల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని.. పరిష్కరించేందుకు హౌస్ మాస్టర్/ హౌస్ పేరెంట్ వ్యవస్థ ఉంటుంది.

ఐఐటీ, ఎంసెట్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా నిపుణుల శిక్షణ అందిస్తారు. సెంట్రల్ యూనివర్సిటీలు, నల్సార్, టిస్, ఇఫ్లూ తదితర ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా విద్యార్థులకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తారు.



పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, మార్షల్ ఆర్ట్స్, లలిత కళలు తదితరాలపైనా అవగాహన కల్పిస్తారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేలా బహుమతులు అందిస్తారు. వీటన్నింటితోపాటు విద్యార్థులకు పోషకాహారం, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.

అర్హతలు :

2017-18 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో విద్యార్థి 4వ తరగతి చదువుతుండాలి.

ఓసీ/ బీసీ/ ఈబీసీ/ ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్ (బీసీ-సీ) 1.09.2007 నుంచి 31.08.2009 మధ్య జన్మించి ఉండాలి.

ఎస్సీ/ ఎస్టీ విద్యార్థులు 01.09.2005 నుంచి 31.08.2009 మధ్య జన్మించి ఉండాలి.

విద్యార్థులు రెండేళ్లపాటు 3,4 తరగతులను (2016-17, 2017-18) చదివిన జిల్లాకు స్థానికులవుతారు.

తల్లిదండ్రులు/సంరక్షకుల సంవత్సరాదాయం రూ.1,00,000 మించకూడదు.

ఎంపిక ప్రక్రియ..

ప్రవేశ పరీక్ష ద్వారా జిల్లాల వారీగా బాలురు, బాలికలకు ప్రత్యేకంగా మెరిట్‌లిస్ట్ తయారుచేస్తారు. 50 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో అందుబాటులో ఉంటుంది.

విభాగం	సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
పార్ట్-ఏ	తెలుగు	10	10
పార్ట్-బీ	ఇంగ్లిష్	10	10
పార్ట్-సీ	మ్యాథమెటిక్స్	10	10
పార్ట్-డీ	ఎన్విరాన్‌మెంటల్ సైన్స్(సైన్స్+సోషల్)	20	20
మొత్తం		50	50

దరఖాస్తు విధానం :

https://apgpcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. ఎలాంటి దరఖాస్తు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

దరఖాస్తులకు చివరి తేదీ : మార్చి 20, 2018.

హాల్‌టికెట్ : ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తిచేశాక.. హాల్‌టికెట్‌ను ప్రింట్‌అవుట్ తీసుకొని పరీక్ష కేంద్రానికి వెళ్లొచ్చు.

పరీక్ష : ఏప్రిల్ 8న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

వెబ్‌సైట్ : https://apgpcet.apcfss.in

ఐజీఆర్‌యూఏలో సీపీఎల్ కోర్సులో ప్రవేశాలు

ఉత్తరప్రదేశ్‌లోని అమేథిలో ఉన్న ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ (ఐజీఆర్‌యూఏ).. కమర్షియల్ పైలెట్ లైసెన్స్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఐజీఆర్‌యూఏ.. కేంద్ర పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి వ్యవస్థ.

వ్యవధి : 18 నెలలు (అవసరమనుకుంటే పొడిగిస్తారు).

మొత్తం ఖాళీలు : 75 (జనరల్-38+ఓబీసీ-20+ఎస్సీ-11+ఎస్టీ-6).

అర్హతలు : ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులుగా ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. మ్యాథ్స్, ఫిజిక్స్‌లో ఒక్కో దాంట్లో కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీ/ ఓబీసీకి 50 శాతం) మార్కులు వచ్చి ఉండాలి.

వయసు : ప్రవేశం నాటికి కనీసం 17 ఏళ్లు ఉండాలి.

ఎంపిక : రాతపరీక్ష, వైవా/ ఇంటర్వ్యూ, పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్.

దరఖాస్తు రుసుం : రూ.10,000; ఎస్సీ/ఎస్టీ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో

దరఖాస్తు చివరి తేదీ : బ్యాంక్ చలాన్ ద్వారా ఫీజు చెల్లిస్తే.. ఏప్రిల్ 24, 2018బీ ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లిస్తే.. మే 1, 2018.

వెబ్‌సైట్ : www.igrua.gov.in

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో 2018-19కి గాను 1వ, 2వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

దరఖాస్తు స్వీకరణ తేదీలు : ఒకటో తరగతిలో ప్రవేశాలకు మార్చి 1, 2018 నుంచిబీ రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు(ఖాళీలను బట్టి మాత్రమే) ప్రవేశాలకు ఏప్రిల్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

దరఖాస్తు చివరి తేదీ : ఒకటో తరగతిలో



ప్రవేశాలకు చివరి తేదీ మార్చి 19, 2018. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఏప్రిల్ 9, 2018.

వెబ్‌సైట్ : http://kvsangathan.nic.in

ఇక రోటోమాక్ సంస్థల వేలమే..!



న్యూఢిల్లీ: రోటోమాక్ కంపెనీలు తీసుకున్న రుణలను తిరిగి చెల్లించేం దుకు బ్యాంకులిచ్చిన గడువు దాదాపు దగ్గరపడడంతో.. సదరు కంపెనీలను వేలం వేసేందుకు దివాలా కోర్టు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. రోటోమాక్ సంస్థలు బ్యాంకు నుంచి దాదాపు రూ.4000 కోట్ల మేర రుణాలను స్వీకరించాయి. సంస్థల యాజమాన్యం ఈ రుణాలను తమ స్వప్రయోజనాలకు వాడుకొని.. వాటిని తిరిగి చెల్లించడంలో ఘోరంగా విఫలమైంది. ప్రమోటర్లు డీఫాల్లర్లుగా మారారు. యాజమాన్యం కోరిక మేరకు బ్యాంకులు రుణ చెల్లింపునకు ఇచ్చిన చివరి డెడ్‌లైన్ ఈ నెల 19తో ముగియనుంది. ఈ నేపథ్యంలో కంపెనీలు రుణ చెల్లింపునకు మరో మూడు నెలల (90 రోజుల) అదనపు సమయాన్ని కోరాయి. తుది గడువు పొడిగింపుపై ఓటింగ్ కోసం శుక్రవారం సమావేశమైన రుణదాతల కమిటీ డెడ్‌లైన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడగించొద్దన్న ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చినట్టుగా బ్యాంకు అధికారి ఒకరు తెలిపారు. దీంతో రోటోమాక్ అధినేత విక్రమ్ కొఠారికి చెందిన రోటోమాక్ ఎక్స్‌పోర్ట్స్, రోటోమ్యాక్ గ్లోబల్ సంస్థలను దివాలా కోర్టు వేలం వేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. రుణ విముక్తికి సంస్థ ప్రత్యామ్నాయ ప్రణాళికలను ప్రతిపాదించకపోవడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకోన్నట్టుగా సమాచారం.

కాగా, ఇదే విషయాన్ని రోటోమాక్ కంపెనీల రెజుల్యూషన్ ప్రొఫెషనల్ పరోక్షంగా ధ్రువీకరించడం విశేషం. కొన్ని రోజుల క్రితమే రుణాల డిఫాల్ట్ కేసులో రొటొమ్యాక్ యజమాని విక్రమ్ కొఠారి, ఆయన కుమారుడు రాహుల్ కొఠారిలను సీబీఐ అరెస్ట్ చేసింది. వీరు విచారణకు సహకరించక పోవడంతోనే, అరెస్ట్ చేసినట్టు సీబీఐ అధికారులు తెలిపారు.

సంక్షోభంలో బ్యాంకింగ్ వ్యవస్థ

- లాభాలను హరించేస్తున్న మొండి బకాయిలు
- ప్రతిష్ఠను దిగజారుస్తున్న ఆర్థిక నేరాలు
- విశ్వసనీయతను దెబ్బతీస్తున్న విధివిధానాలు
- వేధిస్తున్న మూలధనం కొరత

న్యూఢిల్లీ : ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా బ్యాంకులే మూలాధారం. ద్రవ్యవిధానం సజావుగా సాగాలన్నా.. ప్రజలు పొదుపు బాట పట్టాలన్నా.. వారి కష్టార్జితం పదింతలవ్వాలన్నా.. అది భద్రంగా ఉండాలన్నా.. బ్యాంకులే ప్రధానం. వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఆర్థిక చేయూత లభించాలన్నా బ్యాంకులే కీలకం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థకు బలమైన బ్యాంకులే పునాదులు. అలాంటి బ్యాంకింగ్ వ్యవస్థ దేశంలో ఇప్పుడు సంక్షోభంలో చిక్కుకున్నది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికికే ముప్పు ఏర్పడింది. అవును.. బ్యాంకింగ్ రంగంలో ఇటీవలికాలంలో వెలుగు చూస్తున్న వరుస పరిణామాలు ఇదే చెబుతున్నాయి. ఓవైపు బ్యాంకుల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తూ లాభాలను హరిస్తున్న మొండి బకాయిలు, మరోవైపు మోసగాళ్లతో చేతులు కలిపి ప్రతిష్ఠను దిగజారుస్తున్న ఇంటిదొంగలు, ఇంకోవైపు ప్రభుత్వ విధానాలు, బ్యాంకర్ల నిర్ణయాలతో దెబ్బతింటున్న ఖాతాదారుల విశ్వాసం, ఇంకా వేధిస్తున్న మూలధనం కొరత.. వెరసి బ్యాంకింగ్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. ఇక బడా కార్పొరేట్ల మోసాలకు బ్యాంకుల్లోని ఉన్నతస్థాయి సిబ్బంది అండగా నిలబడుతుండటం.. బ్యాంకుల నష్టాల్ని మరింతగా పెంచుతున్నాయి. మొత్తం 21 సర్కారీ బ్యాంకుల్లో 16 సంస్థల నష్టాలు రూ.18,000 కోట్లకుపైగా నమోదయ్యాయి. మరో నాలుగు సంస్థల లాభాలు గతంతో పోల్చితే క్షీణించాయి. దీనంతటికీ కారణం నిరర్థక ఆస్తులే (ఎన్‌పీఏ లేదా మొండి బకాయిలు). రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గణాంకాల ప్రకారం భారతీయ బ్యాంకింగ్ రంగంలో రూ.10 లక్షల కోట్లకుపైగా మొండి బకాయిలుండగా, ప్రభుత్వ బ్యాంకులకు చెందినవే రూ.8.50 లక్షల కోట్లు. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. దేశీయ ప్రభుత్వ బ్యాంకుల్లో రెండో అతిపెద్ద బ్యాంకైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం ఇప్పుడు యావత్ బ్యాంకింగ్ రంగాన్నేగాక, మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థనే కుదిపేసింది. రొటోమాక్ విక్రమ్ కొఠారీ, సింభౌలీ షుగర్స్, ద్వారకా దాస్ సేఠ్, ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్ మోసాలు, రుణ ఎగవేతలూ ఇటీవలికాలంలో బయటపడినవే. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ), కెనరా తదితర బ్యాంకులు వీటివల్ల నష్టపోయాయి. ఇక రూ.9,000 కోట్లు ఎగ్గొట్టి లండన్‌కు పారిపోయిన కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యా సంగతి విదితమే. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఎస్‌ఎఫ్‌ఐవో వంటి దర్యాప్తు సంస్థలు వీటన్నిటిపై విచారణ చేస్తుండగా, మరెందరో బడా బాబులు బ్యాంకుల్ని ఎంచక్కా దోచేసుకుంటూపోతున్నారు. అయినా సామాన్యుల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించే బ్యాంకర్లు.. వీరి విషయంలో మాత్రం చేష్టలుడిగి చూస్తున్నారు. మొండి బకాయి ల్లో కార్పొరేట్లవే ఎక్కువగా ఉండగా, వీటిలో 25 శాతం 12 సంస్థలకు చెందినవే. అసలే మూలధనం కొరతను ఎదుర్కొంటున్న బ్యాంకులకు.. ఎన్‌పీఏలు, ఎగవేతలు, మోసాలతో బాసెల్-3 నిబంధనల్ని అందుకోవడం కష్టతరమవుతున్నది.

డిఫాల్టర్లకు అవకాశమివ్వొద్దు

దివాలా ప్రక్రియలో భాగంగా జరిపే ఆస్తుల వేలంలో డిఫాల్ట ర్లుగా ముద్రపడిన వారికి పాల్గొనే అవకాశం ఇవ్వొద్దని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ శిఖా శర్మ అన్నారు. ఈ దిశగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యు నల్స్ (ఎన్‌సీఎల్‌టీలు)ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారీ దేశీయ మూడో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అధినేత్రి. ఇటీవల పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో శిఖా శర్మ మాట్లాడుతూ.. దివాలా ఆస్తుల వేలానికి సంబంధించి బిడ్డింగ్‌లో డిఫాల్టర్లకు చోటు దక్కరాదని, ఆయా ఆస్తుల అసలు యజమానులే మళ్లీ వాటిని చేజిక్కించుకునే వీలుందన్నారు. రుణ సంస్కృతి మరింత ఉన్నతంగా ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతకీ వసూలుకాని మొండి బకాయిల్లో తనఖా పెట్టిన ఆస్తుల్ని వేలం ద్వారా అమ్మేయాలని బ్యాంకులకు ఆర్బీఐ సూచిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అయిన సంస్థలు.. తమ రుణాల ఎగవేతకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే తెలియజేసేలా మార్కెట్ రెగ్యులేటర్ సెబీ కసరత్తు చేస్తున్నది. తద్వారా బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక నేరాలు, మోసాలపై దర్యాప్తు సంస్థలు చేస్తున్న విచారణలో సెబీ కూడా భాగం కావాలనుకుంటున్నది.

ఎంసీటీ ఇంజినీరింగ్‌తో రాక్‌మ్యాన్ భాగస్వామ్యం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హీరో గ్రూప్‌కు చెందిన ఆరు బిలియన్ డాలర్ల విలువచేసే కంపెనీ 'రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్' తాజాగా మోల్డెక్స్ కాంపోసైట్స్ ద్వారా యూకేకి చెందిన కార్బన్-కాంపోసైట్స్ ఉత్పాదక సంస్థ 'ఎంసీటీ ఇంజినీరింగ్'తో భాగస్వామ్య వాటాను దక్కించుకున్నట్లు ప్రకటించింది. అలాగే సంస్థ ఆటోమోటివ్ విభాగానికి సంబంధించి నాణ్యత కలిగిన ఉత్పత్తులను రూపొందిస్తుంది. అలాగే లగ్జరీ కార్లు జాగౌర్ ల్యాండ్ రోవర్ తరహా బ్రిటీస్, యూరోపియన్ బ్రాండ్లకు రూపకల్పన చేస్తోందని రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ సుమన్ కాంత్ ముంజల్ తెలిపారు. భవిష్యత్ అంతా కర్బన మిశ్రమాలతోనే ముడిపడి వుందన్నారు. ఈ నేపథ్యంలో 2022 నాటికి రాక్‌మ్యాన్ టర్నోవర్‌లో 10 శాతం పెరుగుదలను అంచనా వేస్తున్నాయన్నారు.

31 వరకు హెరిటేజ్‌లో ఫ్రీ షాపింగ్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: 'హెరిటేజ్ ఫ్రెష్' సంస్థ ఈ నెల 31వ తేదీ వరకు 'ఫ్రీ షాపింగ్ మంత్'ను ప్రకటించింది. హెరిటేష్ ఫ్రెష్ సభ్యులకు 'ఫ్యూచర్ పే వ్యాలెట్' ద్వారా రూ.1000 మేరకు బెనిఫిట్లు, ప్రతి నెలకు రూ.100 చొప్పున క్యాష్‌బ్యాక్ పథకం అమలు చేస్తోంది. ఇప్పటికే ఈ క్లబ్‌లో సభ్యులుగా చేరిన తొలి 200 మంది ఆఫర్ సమయంలో ప్రతి నెలా రూ.1500 వరకు షాపింగ్ చేసుకోవచ్చు. నూతన సభ్యులకు అదనపు ఆఫర్లు అందుబాటులోకి వస్తాయి. రూ.500 విలువైన గుడ్డీ బ్యాగ్, రూ.500 విలువైన కూపన్లు 'హెరిటేజ్ ఫ్రెష్' తన ఖాతాదారులకు అందజేస్తోంది. హెరిటేజ్ ఫ్రెష్ సీఈఓ రమేశ్ మీనన్ మాట్లాడుతూ 'మా సభ్యులందరికీ విలువైన షాపింగ్ డీల్స్ ద్వారా కాష్‌బ్యాక్ ఆఫర్‌తోపాటు పలు బెనిఫిట్లు అందిస్తున్నాం' అని అన్నారు. ఖాతాదారులు 'హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెరిటేజ్ ఫ్రెష్. ఇన్/ క్లబ్ - లొకేటర్‌లో సంప్రదించవచ్చు. హెరిటేజ్ ఫ్రెష్‌లో చాలా సింపుల్‌గా లాగిన్ అయి వాట్సప్ ద్వారా ఎప్పుడైనా షాపింగ్ చేయొచ్చు. ఖాతాదారులు తమ సమీపంలోని హెరిటేజ్ ఫ్రెష్ స్టోర్‌ను సందర్శించి రూ.999తో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రూ.5000 విలువైన గుడ్డీ బ్యాగ్, రూ.1000 విలువైన కూపన్లు పొందవచ్చు

14న అంగన్‌వాడీ కార్యకర్తల సామూహిక దీక్ష

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న అంగన్‌వాడీ కార్యకర్తలు సామూహిక దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు ఎన్ మంజుల, కార్యనిర్వాహక అధ్యక్షులు కె చిన్నమ్మ, ప్రధాన కార్యదర్శి జె లలిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్దెనిమిది నెలలుగా ఇంటి అద్దెలు, ఇతర బిల్లులను చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఉద్యమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకపోవడంతో 14వ తేదీన విజయవాడ ధర్నాచౌక్‌లో సామూహిక నిరాహారదీక్ష చేపడుతున్నట్లు వారు వివరించారు. బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 18వేలు చెల్లించాలని, ఐసీడీఎస్ రంగంలో పనిచేసే వారికి పదోన్నతులు కల్పించాలని వారు డిమాండు చేశారు. రోజు రోజుకూ పెరిగిపోతున్న పనిభారాన్ని తగ్గించాలన్నారు. పౌష్టికాహారాన్ని చౌకధరల దుకాణాల ద్వారా కాకుండా నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమాలే శరణ్యమన్నారు.

అమెరికన్లను వణికిస్తున్న 'ఐపీఎఫ్' జబ్బు

ఇప్పటికే 9 మంది వైద్యులు మృతి



వాషింగ్టన్: ఓ వింత జబ్బుతో అమెరికా ప్రజలు హడలి పోతున్నారు. ముఖ్యంగా అక్కడి దంత వైద్యులనే ఎక్కువగా ఈ జబ్బు పీడిస్తోంది. ఈ జబ్బు పేరు ఐపీఎఫ్ (ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్). ఊపిరితిత్తులు చెడి పోయేలా చేసే ప్రాణాంతకమైన వ్యాధి ఇది. ఇప్పటికే అమెరికా మొత్తంలో 984 మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. అందులో తొమ్మిది మంది దంత వైద్యులు కావ డం గమనార్హం. ఆ తొమ్మిది మందిలో కేవలం ఇద్దరే బతి కారు. ఈ తొమ్మిది మంది వైద్యులు వర్జీనియా రాష్ట్రంలోని ఓ డెంటల్ క్లీనిక్‌కు చెందినవారే.

దాంతో సీడీసీ(సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్) బోర్డు ఈ వ్యాధిపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికాలోని ఇతర జనాభాతో పోలిస్తే 23 రెట్లు ఎక్కువగా దంత వైద్యులే ఈ వ్యాధి బారిన పడుతున్నారని సీడీసీ తెలిపింది. వైద్యులు పనిచేస్తున్న వాతావరణంలోనే ఉండే క్రిములే ఈ వ్యాధికి కారణమని పలువురు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి గురించి మరింత లోతుగా విచారిస్తే..వర్జీనియా రాష్ట్రంలో ఉన్న డెంటల్ క్లీనిక్‌లో గత 21 ఏళ్లలో 900 మంది వైద్యులు ఈ ఐపీఎఫ్ వ్యాధి బారిన పడ్డారని తేలింది. ఈ వ్యాధి సోకినప్పుడు ఊపిరి తీసుకోవడంలో సమస్యలు, పొడి దగ్గు, బరువు తగ్గడం, కీళ్ల నొప్పులు వస్తాయి. డెంటల్ క్లీనిక్‌లో సిలికా, పాలివిన్సిల్ సైలోక్సేన్, ఆల్జినేట్ వంటి విష పూరిత క్రిములు ఉంటాయి. అక్కడ పనిచేసే వైద్యులు దంత వైద్యానికి సంబంధించిన పరికరాలను శుభ్రం చేస్తున్నప్పుడు ఈ విష పూరిత క్రిముల బారిన పడుతున్నారు. అగ్రరాజ్యం మొత్తంలో దాదాపు 650,000 మంది దంత వైద్యులు ఉన్నారు. ముదురు తున్న ఐపీఎఫ్ కేసుల నేపథ్యంలో డెంటల్ క్లీనిక్‌లో పనిచేసేవారందరూ మాస్క్‌లు ధరించాలని సీడీసీ హెచ్చరించింది. అయితే పాతకాలం నాటి చికిత్సలు చేయడం వల్ల ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని మరికొందరు వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వ్యాపార సంస్థలకు రుణ సౌకర్యాలపై ప్రత్యేక ఆడిట్



న్యూఢిల్లీ: వ్యాపార సంస్థలతో లావాదేవీలు నడిపే ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రత్యేక ఆడిట్‌ను నిర్వహించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ముఖ్యంగా ట్రేడ్ ఫైనాన్సింగ్ కార్యకలాపాలను నిర్వహించే బ్యాంకులపై, లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్‌లపై దృష్టి సారించనుంది. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకులు జారీ చేసిన ఎల్‌వో యూల జాబితాను, ముందస్తుగా రుణ అంగీకార పరిమితులను, మార్జిన్ కోసం ఉంచిన నగదు నిల్వలను, గ్యారెంటీల వివరాలను పంపాల్సిందిగా సూచించింది.

ట్రేడ్‌ఫైనాన్స్ మీదే ఎందుకంటే...

ఆర్‌బీఐ ట్రేడ్ ఫైనాన్స్‌పైనే దృష్టిపెట్టడానికి కారణం ఉంది. ఇటీవల కాలంలో ఉద్దేశపూర్వక పన్ను ఎగవేతదారుల తాకిడి అత్యధికంగా ట్రేడ్‌ఫైనాన్స్ విభాగానికే ఉంది. నీరవ్‌మోదీ కూడా ట్రేడ్ ఫైనాన్స్ కిందే ఎల్‌వోయూలను పొందాడు. అందుకు భవిష్యత్తులో మరిన్ని మోసాలు జరగకుండా దీనిపై దృష్టిపెట్టింది. ఇప్పటికే రూ.50 కోట్లకు పైబడిన అన్ని మొండి బకాయిలను పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

- ♦ నీరవ్ మోదీ మెహుల్ చౌక్సీలు బ్యాంకుల నుంచి ఎల్‌వోయూలు పొంది రూ.12,700 కోట్ల మొత్తాన్ని ఎగవేశారు.
- ♦ నీరవ్ వ్యవహారం తర్వాత దిల్లీకి చెందిన వజ్రాల వ్యాపారి ద్వారకా దాస్ సేఠ్ కూడా ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ నుంచి వివిధ మార్గాల ద్వారా రూ.389.85 కోట్ల రుణం పొంది ఎగవేశాడు.
- ♦ ట్రేడ్ ఫైనాన్స్ వ్యవస్థను వాడుకొని బ్యాంక్ ఆఫ్ బరోడాను దిల్లీకి చెందిన కొందరు వ్యాపారులు రూ.6,000 కోట్లకు మోసం చేశారు.

ఏపీ బడ్జెట్ పెద్ద తప్పుల తడక

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ రాష్ట్ర చైర్మన్, వైసీపీ ఎమ్మెల్యే బుగ్గన



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ సాధారణ బడ్జెట్టు అంతా తప్పుల తడకగా వుందని, ఎన్నికల్ని దృష్టిలో వుంచుకుని ఎక్కువ అంకెలు చూపించాలనే తపనతో అన్నీ తప్పులతో ప్రవేశపెట్టారని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ రాష్ట్ర చైర్మన్, వైసీపీ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంట్రోల్ ఆడిటర్ జనరల్(కాగ్) ఇచ్చిన నివేదికను పోల్చి చూస్తే..రాష్ట్ర బడ్జెట్టులో పేర్కొన్న కేటాయింపులన్నీ పూర్తిగా తప్పుల తడకగా వున్నాయని దుయ్య బట్టారు.

ఈ బడ్జెట్టులో రెవెన్యూ ఖర్చు రూ.1,55,000 కోట్లకుగాను మూలధన వ్యయం(ప్రగతికి) రూ.28,500 కోట్లుగా చూపారని విమర్శించారు. దాని ఆధారంగా గత ఏడాది బడ్జెట్టుతో పోలిస్తే.. రూ.5వేల కోట్ల మిగులు అత్యధికంగా వుందని స్పష్టం చేశారు. కంట్రోల్ ఆడిటింగ్ లెక్కల ప్రకారం రివైజ్డ్ ఎస్టిమేట్స్ ప్రకారం..2017-18లో రెవెన్యూ రాబడి రూ.85,500 కోట్లు చూపిస్తున్నారని తెలిపారు.దీని ఆధారంగా చూస్తే రూ.62వేల కోట్లు వుందని, రూ.24వేల కోట్ల తేడా వుందని పేర్కొన్నారు. మొత్తంగా రాష్ట్ర బడ్జెట్టు ప్రజల్ని మభ్యపెట్టే తరహాగా, తప్పులతడకతో వుందని చెప్పారు.

సూర్యుడి ఉపరితలంపై రెండు భారీ పేలుళ్లు

వాషింగ్టన్: సూర్యుడి ఉపరితలంపై చోటుచేసుకున్న రెండు భారీ పేలుళ్లను అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) గుర్తించింది. సూర్యుడి ఉపరి తలమైన ఫోటో స్పియర్‌పై ఈ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ పేలుళ్ల పరిమా ణంలో భూఉపరితలం కంటే చాలా పెద్దవైనవిగా నాసా చెబుతోంది. 18 గంటల వ్యవధిలో జరిగిన ఈ పేలుళ్లు మార్చి 9న జరిగినట్లు నమోదైనట్లు స్పష్టం చేసింది. ప్రత్యేకమైన కాంతి వెదజల్లె పరికరాల సాయంతో పేలుళ్లను గుర్తించిన శాస్త్ర వేత్తలు.. భారీ స్థాయిలో అయస్కాంతక్షేత్రాలు అంతరిక్షంలోకి దూసుకెళ్లాయని గుర్తించారు. అత్యంత కాంతివంతమైన పుంజాలు ఈ అయస్కాంతక్షేత్ర వలయాన్ని ధ్వంసం చేసి దూసుకెళ్లాయని తెలిపారు. మార్చి 2న కూడా సూర్యుడి ఉపరి తలంపై ఇదే తరహా పేలుళ్లు జరిగినట్లు వివరించారు. సూర్యుడిలో ప్రతిరోజు ఉత్పన్నమయ్యే అయస్కాంత క్షేత్రాలు, సన్‌స్పాట్స్‌తోపాటు ఈ పేలుళ్లు జరగడం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా సూర్యుడిలో ఏర్పడే సౌర తుపాన్ల కారణంగా భారీగా ప్లాస్మా రేడియోషన్ వెలువడుతుంది.

నత్తనడకన ఎంపీలు, ఎమ్మెల్యేల కేసుల విచారణ

పెండింగ్ కేసుల్లో అగ్రస్థానంలో ఉత్తర్‌ప్రదేశ్

ఢిల్లీ: దేశవ్యాప్తంగా 1700 మంది చట్టసభ సభ్యులకు సంబంధించి 3,045 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ జాబితాలో 248 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఉత్తర్‌ప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. తర్వాతి స్థానాల్లో తమిళనాడు (178), బిహార్ (144), పశ్చిమ్‌బంగా (139)తో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో వందకు పైగా ఎంపీలు, ఎమ్మెల్యేలు క్రిమినల్ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నారని కేంద్రం సుప్రీంకు వెల్లడించింది. 2014 నుంచి 2017 మధ్య కాలంలో అనేకమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు వివిధ కేసుల్లో భాగంగా కటకటాల్లోకి వెళ్లారని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. మొత్తంగా ఉన్న 3,816 కేసుల్లో ఏడాది కాలంలో కేవలం 125 కేసుల్లో మాత్రమే తీర్పును వెలువరించారు. 2014లో సుప్రీం కోర్టు ఒక కేసు విషయంలో తీర్పు వెలువరిస్తూ ఎంపీలు, ఎమ్మెల్యేలకు సంబంధించిన క్రిమినల్ కేసుల విచారణను ఒక ఏడాదిలో పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు పూర్తిగా అమలైనట్లు కనిపించడం లేదు. గత మూడేళ్లలో కేవలం 771 కేసుల్లో విచారణ పూర్తి చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో 539, కేరళలో 373 కేసులు విచారించాల్సి ఉండగా, తమిళనాడు, బిహార్, పశ్చిమ్‌బంగా రాష్ట్రాల్లో కలిపి తొమ్మిది వందలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంపీలు, ఎమ్మెల్యేల క్రిమినల్ కేసులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాల్సిందిగా జస్టిస్ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించిన నేపథ్యంలో కేంద్ర న్యాయశాఖ ఈ మేరకు వివరాలను సుప్రీం కోర్టుకు సమర్పించింది. నేర చరిత్ర కలిగిన రాజకీయ నాయకులను జీవితకాలం రాజకీయాల నుంచి నిషేధించాలని అశ్వినీ ఉపాధ్యాయ అనే న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసిన నేపథ్యంలో సుప్రీం విచారణ చేపట్టింది.

ఎండలు భగభగ...

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. జాగ్రత్తలే శరణ్యం

రెంతచింతలలో 40 డిగ్రీలు నమోదు..



విశాలాంధ్ర అమరావతి: వేసవి వచ్చేసింది.. భానుడి భగభగలు మొదలు అయ్యాయి. మార్చి నెల అంటే మండే వేసవికి తలుపులు తెరచినట్లే. ఈ ఏడాది మార్చి తొలి వారమే గరిష్ట స్థాయిని తలపించే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సగటు ఉష్ణోగ్రతలను దాటుకుని గరిష్టస్థాయి ఎండ తాకిడిని అను భవించే స్థితి నెలకొంది. ముఖ్యంగా శని, ఆదివారాలలో నమోదైన ఉష్ణోగ్ర తలు సాధారణ స్థాయి కంటే అదనంగా ఉండటంతో రానున్న వేసవి ఏ స్థాయిలో విజృం భించనుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెంతచింతలలో గత 10 రోజులనుంచి 35 డిగ్రీలకు తగ్గ కుండా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం 40 డిగ్రీల నమోదైంది. మార్చిలోనే ఈ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవు తుంటే రానున్న రోజుల్లో మునుపెన్నడూ లేని ఉష్ణోగ్రతల చవిచూసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా మార్చి 15 తర్వాత కనీసం 37 నుంచి 40డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయి. గత పదేళ్లలో మార్చిలో గరిష్టంగా నమోదైన ఉష్ణోగ్రత గత ఏడాది 2017లో 37.2 డిగ్రీల సెల్సియస్‌లే అధికం. ఈ స్థాయిని ఈ ఏడాది దాటే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పటికే భానుడి ప్రతాపానికి సెగలు వస్తుండగా.. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింతగా పెరగనుంది. వడగాలుల తీవ్రతా ఎక్కువే ఉంటుందని, ప్రజలు ఇబ్బందులు పడ కుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేయా లని రాష్ట్ర ప్రభుత్వాలను వాతావరణశాఖ అధికారులు కోరారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. మార్చి నుంచి మే నెల వరకు సాధా రణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోద వుతాయని, మార్చి నుంచి జులై వరకు గతంలో కంటే అత్య ధిక రోజులు వడగాలులు వీస్తాయని హెచ్చరించారు. మార్చి 1 నుంచే వేసవికాలం మొదలు కాగా.. ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపింది. వాతావరణ వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు, అధికా రులకు తెలియజేస్తామని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సామాజిక అడవులు, వృక్ష సంపద గణనీ యంగా తగ్గిపోవడం, పరిశ్రమలు, వాహనాలు కూడా ఎక్కువగా పెరగటం, ప్లాస్టిక్ వినియో గంతో వాటి నుంచి వెలుబడే వ్యర్థాలు కారణంగా వేసవిలో ఉష్ణో గ్రతలపై ప్రభావం చూపిస్తున్నాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం భగభగలకు కారణమవుతోంది. పిల్లలు, పెద్దలకు ఎండ వేడిమి ముప్పు ఎక్కువగా ఉంటుంది. వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వడదెబ్బకు గురైతే కోలుకోవడం కష్టమవుతుంది. వేసవిలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతాయి. సాధారణ వ్యవసాయ పనుల సీజన్ ముగిసిన తర్వాతేల్లో ఉపాధి పనుల్లో ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులు, రోజువారీ కూలీలు పాల్గొంటారు. చల్లని నీడలో పనులు చేసుకునేలా ఏర్పాట్లు చేయడం.. వారికి మజ్జిగ అందిస్తే మంచిది. ఎండాకాలం గట్టెక్కే వరకు చల్లద నాన్ని అందించే మట్టి పాత్రలను వాడటం మేలు. వేసవిలో వడగాల్పులు.. వడదెబ్బ బారిన ప్రజలు పడకుండా ఉండేలా చేసేందుకు మండలానికి రెండు లక్షల చొప్పున నిధుల్ని ప్రభుత్వం కేటాయిస్తుంది. వాటితో చలువ పందిళ్లు, చలి వేంద్రాలు, మజ్జిగ పంపిణీ చర్యలు చేపట్టాలి. వైద్యఆరోగ్య శాఖ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పీహెచ్‌సీలకు ప్రత్యేకంగా పం పించడంతో పాటు అవగాహనా కార్యక్రమాలు.. వైద్య శిబి రాల నిర్వహణ చర్యలు తీసుకోవాలి. స్త్రీ, మహిళా శిశుసంక్షేమశాఖ, విద్యాశాఖలకు వేసవిలో ప్రత్యేక కార్యచరణ ఉండాలి. చిన్నారులు.. పాఠశాలస్థాయి విద్యార్థులు వడదెబ్బ బారినపడకుండా ఉండేలా చొరవ చూపాలి. ఎండలు మండి పిల్లలు ఇబ్బంది పడకముందే వారిని రక్షించే చర్యలు చేపట్టాలి. విద్యాలయాల వేళలను మార్చడం.. విద్యార్థులపై ఉపాధ్యాయుల శ్రద్ధను పెంచడం చేయాలి. వేసవి సహాయక కేంద్రాలను మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో ఏర్పాటు చేయాలి. వాటి ద్వారా బాధితులు ప్రయోజనం పొందేలా సేవలుండాలి.



రాజధానిలో ఊపందుకున్న నిర్మాణాలు

విశాలాంధ్ర-అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మాణాలు ఊపందుకున్నాయి. రాజధానిలోని సీడ్ యాక్సిస్ రోడ్డుతో పాటు ఎక్స్‌ప్రెస్ హైవే కలిపి 18 రోడ్ల నిర్మా ణం చకచకా సాగుతోంది. ఈ రోడ్ల నిర్మాణంలో అక్కడక్కడా భూసేకరణ సమస్య ఉన్నా పనులు మాత్రం ఆగటం లేదు. దాదాపు 4 వేల కోట్లతో రోడ్ల నిర్మాణం పనులు సాగుతున్నాయి. అలాగే రాయపూడిలో ఐఏఎస్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు, గెజిటెడ్ అధికారులకు 3,840 ఫ్లాట్లు 12 అంతస్తుల చొప్పున 61 టవర్ల నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. వీటిలో 288 ఎమ్మెల్యేలకు, 144 ఐఏఎస్‌లకు, 196 ఎన్‌జీవోలకు, గెజిటెడ్-1 అధికారులకు 388, గెజిటెడ్-2 అధికారులకు 366, నాల్గవ తరగతి ఉద్యోగుల 720 కోసం నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణం కూడా దాదాపు నాలుగువేల కోట్లు అవుతుంది. ఇక రాజధానిలోని పేదల కోసం రెండు దశల్లో 650 కోట్లతో 7,876 గృహాలు నిర్మిస్తున్నారు. ఈ గృహాలు తుళ్ళూరు, నిడమర్రు, మందడం, దొండపాడు, అనంతవరం, పెనుమాక, ఐనవోలు, నవులూరు గ్రామాల్లో నిర్మిస్తున్నారు. మొదటి దశలో 345 కోట్లతో 5,024 గృహాలను నిర్మిస్తున్నారు.

రెండవ దశలో ఉండవల్లి, మందడం, నవులూరు గ్రామాల్లో 2,852 గృహాల నిర్మాణం జరుపుతారు. దీనికి సంబంధించిన టెండర్లు త్వరలో పూర్తి కానున్నాయి. అలాగే రాయపూడిలో 188 బంగ్లాల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. మార్చి 15న టెండర్లు ఖరారు చేయనున్నారు. ఈ బంగ్లాలు మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులకు కేటాయించనున్నారు. రాజధానిలో రోడ్లు, అధికారులు, ఉద్యోగుల నివాసాలు తొలి ప్రాధాన్యంగా తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలన్న నిర్ణయంతో ప్రభుత్వం ఉంది. వివిధ ప్యాకేజీల క్రింద ప్రముఖ కాంట్రాక్టు కంపెనీలు రేయింబగళ్ళు పనులు చేస్తున్నాయి. ఈ ఏడాది ఆఖరు నాటికి రాజధాని రోడ్లు, ఐఏఎస్, ఎమ్మెల్యేల టవర్లు, తొలిదశ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం పనులు పూర్తి కానున్నాయి. ఇదిలా ఉండగా రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు రిటనబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా ఊపందుకుంది. రాజధాని మొత్తంలో భూములిచ్చిన రైతులకు మెట్ట, జరీబు భూముల క్రింద 59,014 ప్లాట్లు రైతులకు కేటాయించారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు నెలరోజులుగా ఊపందుకున్నాయి. దాదాపు 9,200 ప్లాట్లు స్లాట్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు జరిగాయి.

థైరాయిడ్ మందగిస్తే

ఎన్నో ఇబ్బందులు ..



కొద్దిపాటి పనికే అలసిపోవటం.. ఏకాగ్రత సరిగా కుదరకపోవటం.. చురుకుదనం తగ్గటం.. బరువు పెరగటం.. వయసు మీద పడుతున్నకొద్దీ ఇలాంటివి సహజమేనని చాలా మంది భావిస్తుంటారు. కానీ థైరాయిడ్ గ్రంథి పనితీరు మందగిం చటమూ (హైపోథైరాయిడిజమ్) ఇలాంటి సమస్యలకు దారితీ స్తుంది. సీతాకోకచిలుక ఆకారంలో.. మన మెడ ముందుభాగానికి కరచు కొని ఉంటుంది థైరాయిడ్ గ్రంథి. ఇది 'జీవక్రియల'ను (మెటబాలిజమ్) నియంత్రించే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. అందు వల్ల థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోతే రకరకాల సమస్యలు బయలుదేరతాయి. ఈ సమస్య పురుషుల్లో కన్నా స్త్రీలలోనే ఎక్కువ. ముఖ్యంగా వయసు పెరుగుతున్నకొద్దీ ఇవి ఆరంభమవుతుం టాయి. వీటిపై అవగాహన కలిగుండటం అవసరం.

నిస్సత్తువ : ఇంతకుముందు తేలికగా చేసిన పనులే అయినా త్వరగా అలసట ముంచుకొస్తుంది. ఒంట్లో శక్తంతా హరించుకు పోయినట్టు అనిపిస్తుంటుంది.

చలి తట్టుకోలేకపోవటం : వాతావరణం కొద్దిగా చల్లగా ఉన్నా తట్టుకోలేకపోవటం మరో లక్షణం. చుట్టుపక్కల వాళ్లు మామూలుగానే ఉన్నా చలి చలిగా అనిపిస్తుంటుంది.

ఆకలి తగ్గటం, బరువు పెరగటం : జీవక్రియల వేగం తగ్గినపుడు కేలరీల అవసరమూ తగ్గుతుంది. దీంతో ఆకలి కూడా మందగిస్తుంది. మరోవైపు కేలరీల వినియోగం తగ్గటం వల్ల ఖర్చు కాకుండా మిగిలిన కేలరీలు కొవ్వు రూపంలో స్థిరపడతాయి. ఇది బరువు పెరగటానికి దారితీస్తుంది.

అధిక రక్తపోటు : థైరాయిడ్ హార్మోన్ స్థాయిలు పడిపోతే అధిక రక్తపోటుకు దారితీయొచ్చు. కొలెస్ట్రాల్ స్థాయిలూ పెరుగుతాయి. కొంతకాలానికి గుండె రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యమూ తగ్గొచ్చు.

ఏకాగ్రత లోపించటం : జ్ఞాపకశక్తి సమస్యలు, ఏకాగ్రత లోపించటం వంటివీ మొదలవ్వచ్చు. ముఖ్యంగా ఇంతకుముందు ఇష్టమైన వ్యాపకాలు, అభిరుచుల వంటి వాటిపై ఆసక్తి సన్నగిల్లితే నిర్లక్ష్యం తగదు.

మలబద్ధకం : థైరాయిడ్ హార్మోన్ల స్థాయిలు తగ్గితే మలబద్ధకం, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, చర్మం పొడిబారటం, గోళ్లు పలుచగాఅవటం.. ఇలా రకరకాల సమస్యలూ బయలుదేరతాయి.

నిద్రమత్తును తొలగించే సహజ ఉపాయాలు



మనకుండే పనులు ఒకే రోజులో తీరేవి కావు, ఫలితంగా మగత లేదా నిద్రమబ్బు ఉంటుంది. నిద్రమత్తు వలన మనం పనులపై సరైన విధంగా ఆసక్తి కనబరచలేము. కానీ ఇక్కడ తెలిపిన పద్ధతుల ద్వారా నిద్రమత్తును తొలగించుకొని, రోజంతా చురుకుగా ఉండవచ్చు.

నిద్ర సమయాలను అనుసరించండి

సమయ పాలనతో కూడిన నిద్ర వలన రోజంతా ఉండే నిద్రమత్తు నుండి ఉపశమనం పొందవచ్చు. ప్రతి రోజు ఒకే సమయంలో నిద్రపోవటానికి ప్రయత్నించండి. రోజు ఒకే సమయానికి మేల్కొండి. ఇలా చేయటం వలన మీ శరీరానికి నిద్ర సమయం అలవాటు పడుతుంది.

సరైన సమయం పాటూ పడుకోండి

మీరు ఎంచుకున్న నిద్ర సమయం సరిపోయేంతలా ఉండాలి. నిద్ర సమయం అనేది ఒకరి నుండి మరొకరికి వేరు వేరుగా ఉంటుంది. కొంతమంది 10 గంటల పాటూ పడుకుంటే రోజంతా హుషారుగా ఉంటే, మరొకరికి 5 గంటల నిద్రతో హుషారుగా ఉంటారు. అందువల్ల మీకు ఎంత సమయం పాటూ నిద్ర సరిపోతుందో తెలుసుకోండి. దానికి తగిన విధంగా నిద్ర సమయాన్ని తయారు చేసుకోండి.

ఆల్కహాల్, కెఫీన్‌కు దూరంగా ఉండండి

శక్తి కావాల్సినపుడు కెఫీన్ చాలా అద్భుతాలను చేస్తుంది, అలాగని రోజంతా కెఫీన్ తీసుకుంటూ ఉండలేము కదా! మితిమీరిన స్థాయిలో ఆల్కహాల్ లేదా కెఫీన్ ద్రావణాలను తాగట వలన నిద్ర సమస్యలు కలుగుతాయి. అందువల్ల రోజు ఉదయాన లేవగానే కాఫీ లేదా టీ తాగటం వలన నిద్రమత్తు నుండి ఉపశమనం పొందుతారు.

ఉదయాన వ్యాయామాలు చేయండి

ఉదయాన వ్యాయామాలు చేయటం వలన రోజు మొత్తం చురుకుగా ఉంటారు. కనీసం అరగంట పాటూ చేసే వ్యాయామాల వలన నిద్రమత్తు నుండి ఉపశమనం పొంది, రోజులో ఉండే పనులను చురుకుగా నిర్వహిస్తారు.



ఆరోగ్యకరమైన స్నాక్స్ ఎక్కువగా తినండి

జంక్ ఫుడ్‌కు బదులుగా ఆరోగ్యక రమైనవి తినటం వలన నిద్రమత్తు ఉండదు. కూరగాయలు, పండ్లు, ప్యాక్ చేసిన ప్రోటీన్‌ల నుండి మన శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి. పోషకాలు ఎక్కువగా అందటం వలన శక్తి ఉత్పత్తి త్వరగా జరుగి, నిద్రమత్తు నుండి కూడా ఉపశమనం పొందుతారు.

ప్రయాణ సాధనాలు అన్నింటిలోకి అద్భుతమైనది సైకిల్. ఖర్చు తక్కువ, మంచి ఎక్సర్‌సైజ్‌గా ఉపయోగపడుతుంది. బ్లడ్ ప్రెజర్ వంటి అనేక శారీరక రుగ్మతలను కూడా తగ్గిస్తుంది. ప్రతీరోజూ సైకిల్ తొక్కడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. అందులో కొన్ని....

సైకిల్ తొక్కితే కలిగే ప్రయోజనాలివే..

- బి.పిని తగ్గించడంలో జాగింగ్ కన్నా ఇది మరింత మంచిది. జనరల్ ఫిట్‌నెస్ కలగజేస్తుంది.
- రెసిస్టెన్స్ పెంచిన కొద్దీ ఎక్కువ కష్టపడి తొక్కాలి. అందువల్ల ఎక్కువ శక్తి ఖర్చువుతుంది. ఫలితంగా ఎక్కువ కాలరీలు ఖర్చయి శరీర బరువు తగ్గుతుంది.
- డిప్రెషన్ తగ్గి, ఆదుర్దా నెమ్మదిస్తుంది. బ్యాక్ మజిల్స్ పటిష్టపడతాయి.
- నడకలో కంటె ఎక్కువ కండరాలను ఉపయోగించడం వల్ల కాళ్ళకి ఇది ఒక మంచి వ్యాయామం అవుతుంది.

క్రీడలతో ఎముకకు బలం

యుక్తవయసులో శరీరం, ఎముకల ఎదుగుదల చురుకుగా, వేగంగా సాగుతుంది. ఒకవేళ దీనికి ఏదైనా అవాంతరం తలెత్తితే మున్ముందు జీవితాంతం ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఎముక సాంద్రత తగ్గిపోయి.. ఎముకలు క్షీణించటం, తేలికగా విరిగిపోవటం వంటి ముప్పులు పెరుగుతాయి. అందువల్ల యుక్తవయసులో తగినంత శారీరక శ్రమ, వ్యాయామం చేసేలా పిల్లలను ప్రోత్సహించటం ఎంతో మంచిది. ఇవి కుదరకపోతే కనీసం ఆరుబయట ఆటలు ఆడేలా చూసినా మేలే. దీంతో ఎముకల్లోకి క్యాల్షియం బాగా చేరుకుని, ఎముక పుష్టికి తోడ్పడుతుంది. తాజా అధ్యయనం ఒకటి దీన్ని మరోసారి బలపరిచింది. ఫుట్‌బాల్ ఆడటం వల్ల యుక్తవయసు మగపిల్లల్లో ఎముకల వృద్ధి మెరుగ్గా ఉంటున్నట్టు బ్రిటన్‌లోని ఎక్సెటర్ విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొంటోంది. ఈత కొట్టటం, సైకిల్ తొక్కటం వంటి వాటి కంటే కూడా ఫుట్‌బాల్‌తోనే మరింత మెరుగైన ఫలితం కనబడుతుండటం విశేషం.

అధ్యయనంలో భాగంగా 12-14 ఏళ్ల భావి క్రీడాకారులను ఎంచుకొని ఏడాది పాటు పరిశీలించారు. ఈత, సైకిల్ క్రీడాకారులతో పోలిస్తే వీరిలో ఎముకలోని ఖనిజాల మోతాదు (బీఎంసీ) మరింత ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. వారానికి 9 గంటల సేపు ఫుట్‌బాల్ సాధన చేసేవారినే తాము పరిశీలించినప్పటికీ.. వారానికి 3 గంటల సేపు ఫుట్‌బాల్ ఆడినా గణనీయమైన ఫలితం కనబడుతుందని పరిశోధకులు చెబుతున్నారు.



తీవ్రమైన శారీరకశ్రమను కలగజే స్తూ, కండరా లపై బాగా ప్రభావం చూపే టెన్నిస్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్ వంటి క్రీడలు కూడా ఇలాంటి ప్రభావమే చూపగలవని పేర్కొంటు న్నారు. కాబట్టి వీలైనప్పుడల్లా పిల్లలను ఆటలు ఆడేలా ప్రోత్సహించటం మంచిది. ఇవి భవిష్యత్తు ఆరోగ్యానికి సోపానాలుగా పనిచేస్తాయి. పెద్ద య్యాక మరింత బలంగా, దృఢంగా ఉండేందుకు కూడా తోడ్పడతాయి.

ఒత్తిడిలో ఉన్నప్పుడు ఇవి తింటే అనారోగ్యమే..



రాత్రిపూట జంక్ ఫుడ్స్ తీసుకోవడంతో పాటు ఒత్తిడిలో ఉన్నప్పుడు ఏదో ఒకటి తినే అలవా టుంటే అనారోగ్య సమస్యలు తప్పవని ఆరోగ్య నిపుణులు హెచ్చరి స్తున్నారు. ఒత్తిడిగా ఉన్నప్పుడు ఆరోగ్యక రమైన ఆహారాన్ని తీసుకుంటే పర్లేదు కానీ.. ఆకలి వున్నా, లేకున్నా, వేళకానీ వేళల్లో తినేవారిలో.. అలాగే ఒత్తిడికి గురైనప్పుడు బర్గర్, పిజ్జా, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి జంక్ ఫుడ్ తినేవారిలో అనారోగ్య సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో జంక్ ఫుడ్‌ను తీసుకుంటే.. నిద్రలేమి సమస్య తప్పదు. దాని ప్రభావం మరుసటి రోజుపై కూడా పడుతుంది. అదే ఒత్తి డిలో ఉన్నప్పుడు తృణ ధాన్యాలు, మొలకెత్తిన గింజలు, సలాడ్లు వం టివి తీసుకుంటే భావోద్వే గాలను జయించవచ్చు.

కార్యాలయాల్లో పనిభారం, ఒత్తిడి, ఆందోళన కారణంగా తిండిపై దృష్టి మళ్లుతుంది. ఇంకా పనిలో ఒత్తిడిని తగ్గించు కునేందుకు తిండిని ఆశ్రయించడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంకా ఒత్తిడిగా ఉన్నప్పుడు.. నూనె పదార్థాలు, జంక్ ఫుడ్స్ తీసుకుంటే.. వైద్య ఖర్చులు అమాంతం పెరిగిపోతాయని వారు హెచ్చరిస్తున్నారు.

'బంగారు తెలంగాణ' ఆడియో విడుదల





బిపిన్, రమ్య, అక్షర, లయన్ ఏవీ స్వామి, బాబూమోహన్, సాయిత్రిశాంక్, ప్రధాన పాత్రలలో షిరిడి సాయి క్రియేషన్స్ పతాకంపై కూర అంజిరెడ్డి సమర్పణలో బిపిన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం బంగారు తెలంగాణ. ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. అంతకుముందు సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ కార్యాలయంలో బంగారు తెలంగాణ ఆడియో సీడీలను విడుదల చేశారు. బిపిన్ సంగీత సారథ్యంలో రూపొందిన ఈ చిత్రం ఆడియో కలర్స్ మ్యూజిక్ ద్వారా మార్కెట్లోకి విడుదలైంది. ఈ కారక్రమంలో నటుడు, నిర్మాత, దర్శకుడు, బిపిన్, లయన్ ఏవీ స్వామి, రమ్య, అక్షర, అశోక్ కుమార్, కూర అంజిరెడ్డి, సురేందర్ రెడ్డి, సాయి త్రిశాంక్, దైవజ్ఞ శర్మ,"షిరిడీసాయి" నిర్మాత సురేష్ తదితరులు పాల్గొన్నారు. బిగ్ సీడీని కూర అంజిరెడ్డి విడుదల చేసి తొలి సీడీని ఏవీ స్వామికి అందించారు.

నటుడు, నిర్మాత, దర్శకుడు బిపిన్ మాట్లాడుతూ– "తెలంగాణకోసం ఎంతోమంది పోరాటం చేసి ఆత్మ బలిదానాలు చేసుకొన్నారు. ముఖ్యంగా కేసీఆర్ గారు ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణ కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాటం చేసి తెలంగాణను సాధించారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చి దిద్దారు. కేసీఆర్ గారి కృషి వల్లే బంగారు తెలంగాణ సాధ్యం అయింది. అసలు తెలంగాణ ఎలా వచ్చింది..అనే కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ చిత్రంలో ఐదు పాటలు వున్నాయి. బండారు దానయ్య హెల్ప్ తో పాటలన్నీ నేనే రాసుకున్నాను. బిగ్ సింగర్స్ పాటలు పాడారు. సినిమా పూర్తి అవడానికి నా మిత్రులు ఎంతోమంది సహకరించారు. వారందరికీ నా క ృతజ్ఞతలు. తలసాని శ్రీనివాస్ యాదవ్ గారు మా సినిమా రిలీజ్‌కి అన్ని విధాలా సహాయ సహా కారాలు అందిస్తామన్నారు. త్వరలోనే ఈ సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేస్తాం' అన్నారు.

దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ - "అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసారు కేసీఆర్ గారు. తెలంగాణను బంగారు తెలంగాణను చేసే దిశగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారు. అయన కృషి వల్లే తెలంగాణ సాధ్యం అయింది. బిపిన్ చాల కష్టపడి ఈ సినిమా చేశారు. తప్పకుండా ఈ సినిమా మంచి సక్సెస్ అవుతుంది' అన్నారు.

కో ప్రొడ్యూసర్ ఏవీ స్వామి మాట్లాడుతూ "1969 నుండి ఇప్పటి వరకు ఆరు దశాబ్దాలుగా తెలంగాణ సాధించడానికి ఎంతోమంది ఆత్మబలి దానాలు చేసుకొని ప్రాణాలు అర్పించారు. కేసీఆర్ గారు తెలంగాణ వచ్చుడో... నేను సచ్చుడో.. అనే నినాదంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసి తెలంగాణను సాధించారు. ఇవాళ ప్రజలకు బంగారు తెలంగాణని అందించారు. అయన కృషి, అయన పట్టుదల వల్లే తెలంగాణ సాధ్యం అయింది. దర్శకుడు బిపిన్ తెలంగాణ గురించి నేటి ప్రజలకు యువకులకు తెలిసేలా ఈ చిత్రాన్ని అద్భుతంగా రూపొందించారు. ఈ చిత్రంలో నేను లాయర్ క్యారెక్టర్‌లో నటించాను. సినిమా చూశాను. చాల బాగా వచ్చింది. ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు.

సమర్పకుడు కూర అంజిరెడ్డి మాట్లాడుతూ –" డిఫరెంట్ కాన్సెప్ట్‌తో బిపిన్ బంగారు తెలంగాణ చిత్రాన్ని రూపొందించారు. పాటలు చాల బాగున్నాయి. మిత్రులందరం కలిసి సినిమాని పూర్తి చేశాం. అసలు తెలంగాణ ఎలా వచ్చింది అనే అంశాన్ని ఈ చిత్రంలో చూపించటం జరిగింది. త్వరలో ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ని కేటీఆర్, కవిత, హరీష్ రావు గారి సమక్షంలో గ్రాండ్ గా జరపబోతున్నాం" అన్నారు. ప్రముఖ నటుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ "సినిమాని బిపిన్ చాల కష్టపడి అన్నీ తానై ప్యాషన్‌తో చేశాడు. తప్పకుండా ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది" అని అన్నారు. బిపిన్, రమ్య, అక్షర, లయన్ ఏవీ స్వామి, బాబూమోహన్, సాయిత్రిశాంక్, అశోక్ కుమార్, రఘునాథరెడ్డి, వికాస్, గుండుహను మంతరావు, వినోద్, రజిత, క్రాంతి, సౌజన్య, రాగిణి, క ష్ణవేణి, ప్రీతినిగమ్, దివ్య, సురేందర్ రెడ్డి, ఇమ్మానుయేల్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఎడిటర్ : వి.నాగిరెడ్డి, ఫైట్స్ : నందు, కొరియోగ్రఫీ : సాయి రమణ, సినిమాటోగ్రఫీ : మధు ఎ.నా యుడు, జి ఎస్.ఆర్.ఆళ్ల రాంబాబు, సమ్పరణ : కూర అంజి రెడ్డి, కో-ప్రొడ్యూసర్ : డాక్టర్. ఏవి.స్వామి, సహా నిర్మాతలు : కిష్టంపల్లి సురేందర్ రెడ్డి, వినోద యాదవ్, బేబీ అనన్య యాదవ్, మాస్టర్ తాను కుమార్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : మందల విజయభాస్కర్ రెడ్డి. కథ, మాటలు, పాటలు, సంగీతం, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం : బిపిన్.

విశాలాంధ్ర సినిమా

అన్నదమ్ములుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్



ఆన్‌స్క్రీన్‌పై కథానాయకులను అద్భుతంగా ఆవిష్కరించటంలో ముందుగా గుర్తొచ్చే పేరు రాజమౌళి. 'బాహుబలి' సిరీస్‌తో ప్రపంచవ్యాప్తంగా పేరు సంపాదించిన ఈ దర్శక ధీరుడు ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో మల్టీస్టారర్ తెరకెక్కించనున్నారనే వార్త జనాల్లో ఎంతగా పాతుకు పోయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎప్పుడైతే ఎన్టీఆర్, చెర్రీ లతో జక్కన్న ఫొటో సోషల్ మీడియాలో దర్శమిచ్చిందో.. అప్పటి నుంచే ఈ ముగ్గురి కాంబినేషన్‌పై అందరి దృష్టి పడింది. దీనికి మరింత బలాన్నిచ్చేలా వీరిపై రోజుకో వార్త వస్తుండటం ప్రేక్షకుల ఆసక్తిని మరింత రెట్టింపు చేస్తోంది. జక్కన్న చెక్కబోతున్న ఈ మల్టీస్టారర్‌లో ఎన్టీఆర్, చెర్రీ అన్నదమ్ములుగా దర్శమీయనున్నారనే వార్త ప్రస్తుతం షికారు చేస్తోంది. కుటుంబ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుంటూ రాజమౌళి కథ సిద్ధం చేశారని అంటున్నారు. ఇందులో ఎన్టీఆర్ అన్నగా, రామ్‌చరణ్ తమ్ముడిగా అలరించనున్నాడని సమాచారం. మరోవైపు ఈ సినిమా బాక్సింగ్ నేపథ్యంలో ఉండనుందనే వార్త సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో చక్కర్లు కొడుతోంది. దీంతో ఈ సినిమా ఖచ్చితంగా యాక్షన్‌తో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండొచ్చనే అంచనాకు వచ్చారు ప్రేక్షకులు.

గ్లామర్ బ్యూటీ జీవితకథ



శృంగార తారగా ప్రపంచానికి పరిచయమైన సన్నీలియోన్ ఎంతటి క్రేజ్ సంపాదించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పోర్న్ స్టార్‌గా కీర్తిగాంచిన ఈ భామ ఆ తర్వాత వెండితెర ప్రేక్షకులను కూడా తన అందచందాలతో మత్తెక్కించింది. కెనడాలో శృంగార తారగా ప్రారంభమైన ఆమె కెరీర్.. బాలీవుడ్ సినిమాల్లో నటించడం, ఐటెం సాంగ్స్‌లో ఆడిపాడటం స్థాయికి ఎదిగింది. సన్నీ అభిమానుల విషయానికొస్తే.. కోట్ల సంఖ్యలో ఉంటారు. ఇక గూగుల్‌లో అయితే నిత్యం సన్నీ గురించి వెతికేవారు కోకొల్లలు. ఇంతటి క్రేజ్ కొట్టేసిన సన్నీ జీవితం చాలా ఆసక్తికరంగా ఉంటుందట. అందుకే ఈ గ్లామర్ బ్యూటీ జీవితకథను తెరకెక్కించనున్నారట. కాకపోతే సినిమాగా కాదు ఓ వెబ్ సిరీస్ రూపంలో. సన్నీలియోన్ అసలుపేరైన 'కరణ్‌జీత్ కౌర్' లోని 'కరణ్‌జీత్' అనే పేరుతో ఈ వెబ్ సిరీస్ ఉండనుంది. ఈ విషయాన్ని సన్నీనే స్వయంగా తెలిపింది. కెనడా నుండి రావటానికి గల పరిణామాలు, సన్నీగా పేరు మార్చుకోవాల్సిన అవసరం రావటానికి గల కారణాలు ఇందులో తెలుసుకోబోతున్నారంటూ ట్వీట్ చేసింది సన్నీ. కాగా ఇందులో సన్నీనే నటిస్తుందా లేక వేరెవరైనా నటిస్తారా అనే విషయం మాత్రం ప్రస్తావించలేదు.

'నీది నాది ఒకే కథ' 23న విడుదల



కొద్దిరోజుల క్రితమే 'మెంటల్ మదిలో' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న హీరో శ్రీ విష్ణు చేసిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. నూతన దర్శకుడు వేణు ఊడుగుల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఉండనుంది. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్, పాటలకు మంచి స్పందన లభించింది. చిత్ర టీమ్ కూడా సరైన విడుదల తేదీ కోసం ఇన్ని రోజులు ఎదురుచూసి మార్చి 23 అయితే అన్ని విధాల సౌకర్యంగా ఉంటుందని ఆ రోజునే సినిమాను విడుదలచేయాలని నిర్ణయించారు. ప్రశాంతి, కృష్ణ విజయ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీవిష్ణు స్నేహితుడు, హీరో నారా రోహిత్ తన అరన్ మీడియా వర్క్స్ బ్యానర్ పై సమర్పిస్తున్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో 'బిచ్చగాడు' ఫేమ్ సాట్నా టైటన్ హీరోయిన్‌గా నటించింది.

ధరమ్ తేజ్ సినిమా 'దేవుడు వరమందిస్తే'



మెగా హీరో సాయి ధరమ్ తేజ్ ప్రస్తుతం కరుణాకరన్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే రెండు షెడ్యూళ్ల షూటింగ్ పూర్తిచేసుకుంది. ఈ సినిమా కోసం 'దేవుడు వరమందిస్తే' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిలిం చాంబర్లో రిజిస్టర్ చేయించారట. అయితే ఈ విషయంపై ఇంకా అధి కారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అనుపమ పరమేశ్వ రన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని క్రియేటివ్ కమర్షియల్ బ్యానర్ పై కె.ఎస్.రామారావ్ నిర్మిస్తుండగా, గోపి సుందర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం తర్వాత తేజ్.. కిశోర్ తిరుమల, గోపీచంద్ మలినేనిలతో కూడా సినిమాలు చేయనున్నాడు.

నాన్న హంతకులను క్షమించేశాం : రాహుల్



సింగపూర్: తన తండ్రి రాజీవ్ గాంధీ హంతకులను ఎప్పుడో క్షమించేశామని, రాజీవ్ కుమారుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తెలిపారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 1991లో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. అయితే తన తండ్రి చనిపోతారని తమకు ముందే తెలుసని ఆయన అన్నారు. ప్రస్తుతం సింగపూర్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తన తండ్రి మరణం గురించి ప్రస్తావించారు. 'నాన్న చనిపోయిన తర్వాత చాలా ఏళ్ల పాటు బాధపడ్డాం. కానీ ఆయన్ని చంపినవాళ్లని క్షమించేశాం అన్నారు. రాహుల్ తన నానమ్మ ఇందిరా గాంధీ గురించి కూడా మాట్లాడారు. 'రాజకీయాల్లో తప్పుడు వ్యక్తులకు వ్యతిరేకంగా నిలిచినా, దేని గురించైనా గట్టిగా పోరాడినా మనం చనిపోతాం. నా తండ్రి, నానమ్మ చనిపోతారని మేం ముందే ఊహించాం. తాను చనిపోతానని ముందే తెలుసని నానమ్మ నాకు చెప్పింది. 'మీరు చనిపోతారు' అని నేను నాన్నకు చెప్పాను. నా తండ్రిని హత్య చేయించిన ఎల్‌టీటీఈ నేత ప్రభాకరన్ 2009లో చనిపోయినప్పుడు టీవీలో అతను నిర్జీవంగా పడి ఉండటం చూసి నాకు రెండు విషయాలు గుర్తుకు వచ్చాయని, మొదట..ప్రభాకరన్‌ని ఎందుకింత నీచంగా అవమానిస్తున్నారు అనిపించింది. రెండోది.. అతను చనిపోవడంతో భార్య, పిల్లలు అనాథలైపోయారని బాధేసింది. ఆ తర్వాత నా సోదరి ప్రియాంకకు ఫోన్ చేశాను. 'నాన్నను హతమార్చిన ప్రభాకరన్ చనిపోయాడు. ఇందుకు నేను సంతోషించాలి. కానీ నాకు ఈ భావనే కలగడం లేదు' అని చెప్పాను. తనకూ అలాగే ఉందని ప్రియాంక నాతో చెప్పింది' అని అప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు రాహుల్.

రైతుల 'మహా ముట్టడి' నేడే

- ముంబై చేరిన పాదయాత్ర
- పెరుగుతున్న రాజకీయ పార్టీల మద్దతు



థానే : వ్యవసాయరంగ సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ మహారాష్ట్రలో 30వేల మందికిపైగా రైతులు ప్రారంభించిన మహాపాదయాత్ర దేశ ఆర్థిక రాజధాని ముంబై సరిహద్దులకు చేరింది. సోమవారం నాడు రైతులు మహారాష్ట్ర అసెంబ్లీని ముట్టడించనున్నారు. ఆల్‌ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) ఈ మహా పాదయాత్రను మంగళవారం నాసిక్‌లో ప్రారంభించింది. ఈ మార్చ్ ఇప్పుడు సెంట్రల్ ముంబైలోని కేజే సోమయ్య గ్రౌండ్ దిశగా సాగుతోంది. ఈ కార్యక్రమం దృష్ట్యా అసెంబ్లీ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. సోమవారం వీధులు జనసమ్మర్ధంగా ఉంటాయి కనుక పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. రైతుల ఈ ఆందోళనకు రాజకీయ మద్దతుకూడా లభిస్తోంది. శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండే శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ఆందోళనకారులను పరామర్శించారు. వారికి స్వాగతం పలికారు. పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే ఆదేశాల మేరకు తాను ఇక్కడకు వచ్చానని, రాష్ట్ర ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా కాదని ఆయన వివరణ ఇచ్చారు. శివసేన మద్దతును ఏఐకేఎస్ స్వాగతించింది. అయితే, ప్రభుత్వంలో భాగస్వామి అయిన శివసేన పార్టీ ఒక్కటే ఎందుకు మద్దతు ప్రకటిస్తోందని ప్రశ్నించింది. ఏఐకేఎస్ నాయకులు అజిత్ నవాలే మీడియాతో మాట్లాడుతూ, "శివసేన కేవలం మద్దతు ఇస్తున్నామని మాత్రమే చెప్పింది. శివసేన నాయకులు ఇక్కడికి రావడం, మద్దతు ప్రకటించడం హర్షణీయం. కానీ, ఆయన (షిండే) ప్రభుత్వంలో సభ్యులు. కేవలం మద్దతు మాత్రమే ప్రకటించడం తగదు. మిమ్మల్ని మీరు పెద్దపులులని పిలుచుకుంటారు. రైతుల కోసం మీ పంజాలను వినియోగించండి" అని అన్నారు.

రైతుల మహా పాదయాత్రకు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), రాజ్‌థాకరే నాయకత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎమ్మెన్నెస్) కూడా మద్దతు ప్రకటించాయి. రైతుల రుణాలను పూర్తిగా రద్దుచేయాలని, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఏఐకేఎస్ కోరుతోంది. వడగండ్ల వాన, గులాబి రంగు పురుగు కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 40,000 పరిహారంగా చెల్లించాలని, రైతులు వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించాలని, అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వాతావరణ మార్పులపై పోరుకు
వేదాలే శరణ్యం : మోడీ



న్యూఢిల్లీ : వాతావరణ మార్పులపై పోరాడాలంటే మళ్లీ వేదాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయాలని న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సౌర సదస్సులో ప్రధాని మోడీ అన్నారు. విశ్వానికి సూర్యుడు ఆత్మవంటివాడని దానితోనే సమస్త సృష్టి ఆవిర్భావం జరిగిందని, అందువల్ల పురాణాల కాలంలోకి వెళ్లి ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమస్యనుంచి ముందుకెళ్లటానికి 'మనమందరం ఆలోచించాలని, నా మదిలో ఉన్న కొన్ని ఆలోచనలను మీతో పంచుకుంటున్నాను' అంటూ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే సౌర సాంకేతికతను వినియోగించుకోవడానికి మనశక్తిని కూడా జోడించాలని వివరించారు. సౌరశక్తితో కూడా నూతన ఆవిష్కరణలు సృష్టించవచ్చని, సోలార్ వినియోగంతో తక్కువ ఖర్చుతో ప్రాజెక్టులను నెలకొల్పవచ్చన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు బ్యాంకుల సహాయంతో సోలార్ ప్రాజెక్టులను నెలకొల్పుతున్నారన్నారు. ఇందుకోసం సమగ్ర నెట్‌వర్క్ కలిగిన కేంద్రాలను దేశంలో నెలకొల్పుతామన్నారు. సమస్త మానవాళికి సేవ చేయాలని ఉంటే వ్యక్తికి కుటుంబం వంటి భవబంధాలను దాటుకొని ఐకమత్యము, ఏకత్వము కలిగి ఉండాలన్నారు. తమసోమా జ్యోతీర్గమయ (చీకటి నుంచి వెలుగులోకి నడిపించాలని) బృహదారణ్యక ఉపనిషత్తుల్లోని శాంతి మంత్రం ఆలపించి ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

ప్రధాని మోడీతో కలసి నిర్మాణాత్మక ఫలితాలు పొందేందుకు కొత్త దారులు వెతుకుతున్నామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అన్నారు. ప్రధాని మోడీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పప్రథమ ఐఎస్ఏ సదస్సు జరిగింది.

ఈ సదస్సులో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెర్రస్, విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్, వెనుజులా అధ్యక్షుడు నికొలాస్ ముదిరో, బంగ్లాదేశ్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ ఇంకా 50 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీలో బీజేపీని గద్దెదించుతాం..

- కాంగ్రెస్ పునరుద్ధరణకు బలమైన సంకేతాలు
- పీటీఐ ఇంటర్వ్యూలో జ్యోతిరాదిత్య సింధియా



న్యూఢిల్లీ : ఈశాన్యంలో కాంగ్రెస్ చతికిలపడినప్పటికీ 2019 సార్వత్రిక ఎన్నికలకు కీలకమైన హిందీ ముఖ్యరాష్ట్రంలో పార్టీ పునరుద్ధరణ సాధ్యమన్న బలమైన సంకేతాలు వెలువడుతున్నట్టు సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో ముంగావ్లీ, కోలారస్ స్థానాల నుంచి కాంగ్రెస్ గెలుపొందడంపై సింధియా విజయోత్సాహంతో ఉన్నారు. ఈ ఏడాది చివరల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 14ఏళ్ల బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని రాష్ట్రప్రజలు నిర్ణయించుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు సారూప్యతగల పార్టీలన్నీ ఏకం కావాలని సింధియా పిలుపునిచ్చారు. నాగాలాండ్, త్రిపుర ఎన్నికల ఫలితాలు షాక్‌కు గురిచేశాయని ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. మేఘాలయాలో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ ఆవిర్భవించిందని. కేవలం రెండు అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకొన్న బీజేపీ కుయుక్తులు ప్రదర్శిస్తూ ప్రభుత్వం ఏర్పాటునకు శాయాశక్తులా యత్నిస్తోందని అన్నారు. త్రిపుర, నాగాలాండ్ నిరాశపర్చినప్పటికీ గుజరాత్ ఫలితాలు స్ఫూర్తినిచ్చాయని, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయం శుభపరిణామని సింధియా తెలిపారు. కాంగ్రెస్ ముందుకు సాగేందుకు ఈ రాష్ట్రాలు కీలకమన్నారు. ప్రత్యర్థులను ఎప్పుడు కూడా తక్కువగా అంచనా వేయరాదని, ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు మరింతగా శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. 'ఏడాదిన్నరగా అందరూ కలిసికట్టుగా శ్రమిస్తున్నాం. వ్యూహాలు, ప్రణాళికలు రూపొందిస్తూ ఐక్య కార్యాచరణలు సిద్ధం చేసుకొని ప్రతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ రెండు ఉప ఎన్నికల్లో మీరు దీనిని చూసివుండవచ్చు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి ఒక్క నేత ఉప ఎన్నికలలో కనిపించారు. కాబట్టి బీజేపీ ఆందోళనను అర్థం చేసుకోగలను' అని జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. మధ్యప్రదేశ్‌లో సీఎం అభ్యర్థి పేరు చెప్పగలరా అని అడగగా 'ఈ వ్యవహారంలో తాను మాట్లాడడం సబబుగా ఉండదని, దీనిపై ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తుందని ఆయన బదులిచ్చారు. కాగా, కాంగ్రెస్ తరపు సీఎం అభ్యర్థిగా సింధియా రేసులో ముందున్నట్లు సమాచారం.



15న పార్టీ పేరు ప్రకటించనున్న దినకరన్

చెన్నై : రాజకీయ పార్టీ పేరు, పార్టీ పతా కాన్ని ఈ నెల 15వ తేదీన మదురైలో ప్రకటిం చనున్నట్టు ఏఐఏడీఎంకే బహిష్కృత నాయ కుడు, ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ ప్రకటించారు. పార్టీ చిహ్నం కేటాయింపుపై ఆయనకు చట్ట పరమైన అనేక అడ్డంకులు ఎదురైన విషయం తెలిసిందే. "మా విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు ఆమో దించిన నేపథ్యంలో పార్టీ పేరును ప్రకటించి పతాకాన్ని విడుదల చేసేందుకు మార్చి 15వ తేదీ ఉదయం 9 గంటలకు మదురై జిల్లా మెలూరులో కార్యక్రమం నిర్వహిస్తున్నాం" అని ఆదివారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో దినకరన్ తెలిపారు. 'ప్రెషర్ కుక్కర్' ఉమ్మడి గుర్తును కేటాయించాలన్న దినకరన్ విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు మార్చి 9వ తేదీన మన్నించింది. ఆయన నాయకత్వంలోని ఏఐఏడీఎంకే వర్గానికి ఆయన ఇష్టం వచ్చిన పేరు పెట్టుకోవచ్చునని తెలిపింది. ఏఐఏడీఎంకే ఎన్నికల చిహ్నం రెండాకులను ముఖ్యమంత్రి కె.పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి ఒ.పన్నీరుసెల్వం నేతృత్వంలోని గ్రూప్‌కు కేటాయిస్తూ గత ఏడాది నవం బరు 23వ తేదీన ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దినకరన్-వీకే శశికళ వర్గం ప్రధాన పిటిషన్‌కు తాత్కాలిక దరఖాస్తు దాఖలు చేసిన నేపథ్యంలో కోర్టు ఆదేశాలు వచ్చాయి. 15వ తేదీన జరిగే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తన మద్దతుదా రులు, ప్రజలకు దినకరన్ విజ్ఞప్తి చేశారు.


నిరుపయోగంగా 'మైనారిటీ' నిధులు

పార్లమెంటరీ ప్యానల్ అసంతృప్తి

న్యూఢిల్లీ : కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోకపోవడంపై పార్లమెంటరీ ప్యానల్ అసంతృప్తి వ్యక్తంచేసింది. నిధులను మురగబెట్టడాన్ని తీవ్రంగా ఆక్షేపించిన ప్యానల్ ఇకపై ఈ వ్యవహారంలో శాఖకు ఎలాంటి సలహాలు, సూచనలు చేసేది లేదని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 20 నాటికి మొత్తం నిధి రూ.4,195.48 కోట్లలో 66.58శాతాన్ని మాత్రమే ఖర్చు చేసినట్టు సామాజిక న్యాయం, సాధికారత స్టాండింగ్ కమిటీ పేర్కొంది. మైనారిటీ శాఖ గతేడాదిలో వలె అవే కారణాలను ఈ ఏడాది కూడా చూపినట్టు బీజేపీ ఎంపీ రమేష్ బయిన్స్ నేతృత్వంలోని కమిటీ వెల్లడించింది. ఈ ఏడాది కూడా నిధులు మురిగిపోయాయని, ఇది శాశ్వత సమస్యగా మారిపోయిందని, దీన్ని పరిష్కరించలేని నిస్సహాయ స్థితి నెలకొందని, కేటాయించిన మొత్తంలో ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం 30-40శాతం వరకు ఖర్చు అయిందని ప్యానల్ తన 53వ నివేదికలో పేర్కొంది. ఇలా నిధులు నిరుపయోగంగా ఉండిపోతే.. దీని ప్రభావం ఆర్థికశాఖ కేటాయించే నిధిపై పడుతుందని కమిటీ పేర్కొనగా ఆర్థికశాఖ నుంచి మినహాయింపు కోరుతామని మైనారిటీ వ్యవహారాలశాఖ తెలిపింది. ఆర్థిక శాఖ తమతో ఉదారంగా వ్యవహరిస్తుందని మైనారిటీ వ్యవహారాల శాఖ భావించరాదని కమిటీ సూచించింది. నిరుపయోగంగా ఉన్న డబ్బును రీఫండ్ చేయడం నేరమని మైనారిటీ వ్యవహారాల శాఖకు బేషుగ్గా తెలుసునని, దీనిపై ప్రభావం భవిష్యత్ బడ్జెట్ కేటాయింపులపై ఉంటుందని హెచ్చరించింది. ఎన్నిసార్లు సూచించినా నిధులు నిరుపయోగంగా ఉండిపోతుండడంతో తామిక ఈ విషయంలో ఎలాంటి సలహాలు ఇవ్వబోమని పేర్కొంది. ఈ వ్యవహారంలో భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉండాలన్నది శాఖకే వదిలివేస్తున్నట్టు తెలిపింది. అయితే, ఈ శాఖ గతంలో ఎంతమేరకు నిధులను ఖర్చు చేసినది వెల్లడించలేదు. కమిటీ తన నివేదికను గత గురువారం పార్లమెంటుకు సమర్పించింది.

వైద్యుడి నిర్వాకం

తొలగించిన కాలును దిండుగా పెట్టాడు



లక్నో : ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ ప్రాంతంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. తీవ్ర గాయాలతో ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన వ్యక్తికి వైద్యులు కాలు తొలగించగా.. దానిని దిండుగా వాడిన వైనం ఝాన్సి ప్రాంతంలో వెలుగుచూసింది. వివరాల్లోకెళితే.. ఝాన్సి ప్రాంతానికి చెందిన ఓ క్లీనర్ శనివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే దగ్గర్లోని మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. గాయం తీవ్రమైనది కావడంతో వైద్యులు బాధితుడి కాలును తొలగించారు. అనంతరం అతన్ని అత్యవసర వార్డుకు తరలించాల్సి ఉంది. రోగి నిద్రపోవడానికి తలగడ లేకపోవడంతో అతని కాలునే తలగడగా వాడారు. ఈ విషయాన్ని బాధితుడు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సాధనా కౌశిక్ స్పందిస్తూ వైద్యుడిని సస్పెండ్ చేశామని అతనిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టేందుకు నలుగురు సభ్యులు కమిటీని నియమించారు. ఈ ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి దినేశ్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏడాది పొడవునా ఓటర్ల నమోదు..

కేంద్రప్రభుత్వం నిర్ణయం : సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్న ఈసీ



న్యూఢిల్లీ : దేశంలో 18ఏళ్లు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు చేసుకొనే ప్రక్రియను ఏడాది పొడవునా కొనసాగించడం శక్యమైనదా కదా అన్నది పరిశీలించాలని కేంద్ర పభుత్వం.. ఎన్నికల కమిషన్ (ఈసీ)కి సూచించింది. 18ఏళ్లు నిండిన వారు ఆటోమేటిక్‌గా ఓటర్లుగా నమోదయ్యేలా ఏడాది పొడవునా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. దీని అమలులో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్టు ప్రభుత్వ సీనియర్ అధికారి, ఈసీ అధికారి వెల్లడించారు. ఆచరణలో సమస్యలు తలెత్తే అవకాశాలు ఉండడంతో, సాఫ్ట్‌వేర్‌ను రీకాన్ఫిగర్ చేయాలని పోల్ వాచ్‌డాక్‌కు సూచించినట్ట తెలిపారు. 'ఈసీలో నిపుణులున్నారు. వారు ఓటర్లను రిజిస్టర్ చేస్తారు. అయితే ఈ ప్రతిపాదన శక్యమైనదా కాదా న్నది పరిశీలించేందుకు వారే సరైనవారు' అని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు అన్నారు. ఏటా జనవరి 1వ తేదీకల్లా 18 ఏళ్లు నిండిన వారు ఓటర్ల జాబితాలో చేరేందుకు అర్హులు. 2018, జనవరి 1 తర్వాత 18 ఏళ్లు నిండిన వారు ఈ ఏడాది జరిగే ఎన్నికలలో ఓటు వేయలేరు. వారు వచ్చే సంవత్సరంలో ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. ఓటర్ల నమోదుకు కటాఫ్ తేదీలు ఉండాలని 70వ దశకం నుంచి పోల్‌ప్యానల్ ఒత్తిడి చేస్తోంది. దీంతో 'జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1' నాలుగు కటాఫ్ తేదీలను ఎన్నికల కమిషన్ ప్రతిపాదించగా, 'జనవరి 1, జూలై 1' రెండు కటాఫ్ తేదీలు సరిపోతాయలని న్యాయశాఖ 2016లో పేర్కొంది. ఈ క్రమంలో ఎలక్టోరల్ చట్ట సవరణ బిల్లు కూడా సిద్ధమైంది. దేశంలో ఏటా సగటున కోటిమంది కొత్త ఓటర్లు నమోదవుతారు.

నీతిబోధనలు కూడా ఉండాలి



న్యూఢిల్లీ : పాఠశాలల్లో అన్ని మత పుస్తకాలతోపాటు మోరల్‌సైన్స్ (నీతికథల) క్లాసుకూడా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రి మేనకా గాంధీ మానవవనరుల శాఖను కోరారు. దీంతో విద్యార్థుల్లో మత సామరస్యం పెరుగు తుందని సెంట్రల్ ఎడ్వైజరీ బోర్డు ఎడ్యుకేషన్ (సీఏబీఈ) 65వ సమా వేశంలో తెలిపారు. వివిధమతాల మధ్య అంతరాలు తగ్గించడానికి ఎదుటి మతంలోని మంచి పద్ధతులను గౌరవించే మోరల్ క్లాస్ ఉండాలన్నారు.

ప్రిన్సిపాల్ హంతకుడి అరెస్టు


న్యూఢిల్లీ : ఆస్తి తగాదాల్లో పాఠశాల ప్రిన్సిపాల్‌ను, ఆమె సోదరుడిని హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేశామని పోలీసుల తెలిపారు.రంజీత్ తన స్నేహితురాలిని పెళ్లి చేసుకుందామని డబ్బులేకపోవడంతో ఈ దారుణానికి పాల్పడ్డారన్నారు. మార్చి 5న గుమ్మంహరలోని అనిత యాదవ్ అనే పాఠశాల ప్రిన్సిపాల్‌ను హత్యచేశారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు ఇంటిపొరుగువాడైన నవీన్ ముతా ఈ హత్యకు పాల్పడ్డారని, యాదవ్ ఆరుఎకరాల భూమిని కొనడంతో నవీన్ డబ్బులు చెల్లించకుండా భూమిని తన పేరున రాయమని ఒత్తిడిచేస్తున్నాడన్నారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

సీనియర్ ఎడిటర్ రంజన్ రాయ్ మృతి



న్యూఢిల్లీ : సీనియర్ ఎడిటర్ రంజన్‌రాయ్(57) మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయనకు భార్య ఒక కుమారుడు ఉన్నారు. టైమ్స్‌ఆఫ్ న్యూస్‌నెట్‌వర్క్‌లో జాతీయ ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా ఉన్నారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం జరిగాయి. పీటీఐ వార్తా సం స్థలో ఆయన జర్నలిస్టు వృత్తిని ప్రారంభించారు. ఆయన సహ ఉద్యోగి పీటీఐ ఎడి టర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి, టైమ్స్ ఆఫ్ ఇండియా ఆయన మృతికి సంతాపం తెలిపాయి.

ప్రశ్నాపత్రాల్లో మైక్రో చిప్



కోలకతా : పశ్చిమబెంగాల్‌లో నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల్లో ప్రశ్నాపత్రం లీక్ అవ్వకుండా మైక్రోచిప్ వాడామని పాఠశాలల అధికారులు తెలిపారు. ప్రశ్నాపత్రాలు సీలు తీయగానే సర్వర్‌కు అలారం పంపు తుందని బెంగాల్ బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు కల్యాణ్‌మోయ్ గంగూలీ వెల్లడించారు. ప్రత్యేకంగా తయారైన కవర్ల సీలులో జీపీఎస్ ఉంటుందని, ఇది సర్వర్లతో అనుసంధానమై ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలకు 10.30 గంటలకు ప్రశ్నాపత్రాలను అందచేస్తామన్నారు.

బీజేపీ నేతపై ఎఫ్ఐఆర్



అరారియా : బీహార్ బీజేపీ అధ్యక్షుడు నిత్యానంద్ రాయ్‌పై ఎఫ్ఐఆర్ నమో దైంది. అరారియా లోక్ సభ ఉప ఎన్నికల్లో నిబంధనలను ఉల్లంఘిస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ ఒకవేళ ఆర్జేడీ అభ్యర్థి ఎన్నికైతే ఆరారియా ఐఎస్ఐఎస్‌కు స్వర్గంగా మారుతుందన్నారు. ఈ వ్యాఖ్యలపై ఆర్జేడీ ఉపాధ్యక్షుడు శివానంద్ తివారీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు.

ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

కోల్‌కతా: నగరంలోని ఉత్తరప్రాంతంలోని ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. 10 అగ్నిమాపక ట్యాంకర్లతో మంటలను అదుపులోకి తెచ్చామని అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణనష్టం జరిగిన వార్తలు అందలేదు. దగ్గర్లో ని మురికివాడకు మంటలు వ్యాప్తి చెందకుండా అగ్నిమాపక అధికారలు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. కోల్‌కతా మేయర్ స్వపన్ సమద్దర్ పరిస్థితిని దగ్గరుండి సమీక్షించారు.

ఢిల్లీ విధానసభలో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ : ఢిల్లీ విధాన సభలోని జనరేటర్ గదిలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్నట్లు ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ ఆదివారం తెలిపింది. ఉదయం సుమారు 10.50 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారమందిందనీ, దీంతో మూడు అగ్నిమాపక యంత్రాలను ఘటనా స్థలికి పంపించామని అధికారి తెలిపారు. సుమారు 11.30 గంటల ప్రాంతంలో మంటలు అదుపులోకి వచ్చినట్లు వివరించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణహాని జరగలేదని తెలిపారు.

నిందితుడి కాల్చివేత

ముజఫర్‌నగర్ : మూడు హత్యకేసుల్లో ముద్దాయి, పెరోల్‌పై బయటకు వచ్చిన వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపారు. ఈ ఘటన షమ్లీ జిల్లాలోని బిదౌలి గ్రామంలో చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ధర్మేందర్ అనే వ్యక్తిని అర్జున్, అతడి కుమారులు రాజేందర్, షాహేందర్ కాల్చి చంపడంతో వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్పీ అజయ్‌పాల్ శర్మ తెలిపారు. బుల్లెట్ గాయంతో మరణించిన ధర్మేందర్ మృతదేహాన్ని పొలాల్లో కనుగొన్నారు.

'సీలింగ్' వివాదంపై రేపు అఖిలపక్షం


న్యూఢిల్లీ : జాతీయ రాజధానిలో చేపట్టిన 'సీలింగ్ డ్రైవ్'పై చర్చించేందుకు తన నివాసంలో సీఎం కేజ్రీవాల్ రేపు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి ఢిల్లీ బీజేపీ చీఫ్ మనోజ్ తివారీ, కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్‌లకు లేఖ రాశారు. 'సీలింగ్ వివాదంపై చర్చిందుకు వస్తే రాజకీయాలు కూడా మాట్లాడు కుందాం' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రతి పార్టీ నుంచి ముగ్గురు మాత్రమే వస్తే సమావేశం సాఫీగా సాగిపోతుందని, లేకపోతే రసాభాస అవుతుందని పేర్కొన్నారు.

సెల్ఫీ తీసుకున్న ఖైదీలపై కేసు



ముజఫర్‌నగర్ : ముగ్గురు నేరస్థులు, జైలు గోడల మధ్య సెల్ఫీ తీసుకుని, సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసిన ఘటనపై పోలీసులు కేసు నమెదు చేశారు. ఈ ఘటన జిల్లా జైలులో చోటుచేసుకుంది. ఇందుకోసం ఉపయోగించిన స్మార్ట్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా మేజిస్ట్రేట్ తెలిపారు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. శిక్ష అనుభవిస్తున్న ముగ్గురూ ఓ హత్య, హత్య చేసేందుకు పథకం పన్నినట్లు జైల్ సూపరింటెండెంట్ తెలిపారు.

'ఖిల్జీ' పాత్ర చూస్తే.. ఆజమ్‌ఖాన్ గుర్తొచ్చాడు..'



రాయ్‌పూర్ : సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్‌ను చూస్తే తనకు 'పద్మావత్' సినిమాలోని సుల్తాన్ అలుద్దీన్ ఖిల్జీ పాత్ర గుర్తొచ్చిందని ప్రముఖ నటి, రాజకీయ నేత జయప్రద తెలిపారు. 'ఆజమ్ ఖాన్‌ను నా సోదరుడు అనుకుంటా. వివిధ కోణాల్లో అతడు నాపై తీర్చుకున్న పగను చూస్తే.. నాకు ఖిల్జీ పాత్ర గుర్తొచ్చేది' అని ఆమె తెలిపారు. ఓ కార్యక్రమానికి హాజరైన జయప్రద సభ అనంతరం మీడియాతో మాట్లాడుతూ పై విధంగా స్పందించారు.

వ్యవసాయానికి ప్రభుత్వాల చేయూత మరింత అవసరం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్



విశాలాంధ్ర-గుంటూరు సిటీ : వ్యవసాయాన్ని లాభసాటిగా చేయటానికి ప్రభుత్వాలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. మన దేశంలో వ్యవసాయానికి అనుకూల వాతావరణం ఉన్నందున మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. గుంటూరు జిల్లా కోర్నెపాడులో రైతు నేస్తం ఫౌండేషన్ నిర్మించిన గోశాలను ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం చలమేశ్వర్ మాట్లాడుతూ శాకాహారం, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మంత్రి చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలోని ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. కర్నూలులో రూ.675 కోట్లతో నిర్మిస్తున్న విత్తన యూనివర్సిటీ, బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో శాటిలైట్ మ్యాపింగ్ వంటి ఆధునిక విధానాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రైతు నేస్తం వ్యవస్థాపకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆలస్యం కావడంతో రైతులు నష్టపోతున్నారని, రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఒక్క రోజులోనే పరీక్షా ఫలితాలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టరు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పుటూరి సీతామహాలక్ష్మీ పాల్గొన్నారు.



పశువైద్య విద్యార్థుల పోరు ఉధృతం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర - తిరుపతి (ఎస్వీయూ) : రాష్ట్రంలోని పశువైద్య విద్యార్థులు సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా సంఘాలను సంఘటితం చేయడం ద్వారా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో11 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనకు ఆదివారం రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయరంగం రెండు అంకెల వృద్ధి సాధించడంలో కీలకమైన పాడి పరిశ్రమను మరింతగా అభివృద్ధి చేయడంలో పశువైద్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు. పశువైద్య విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశువైద్య కేంద్రాలను పశువైద్యశాలలుగా తీర్చిదిద్దాలన్న విద్యార్థుల డిమాండ్లకు రైతు సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. . త్వరలో ప్రతి జిల్లా కలెక్టర్‌ను కలిసి పశువైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ఈ నెల 13వ తేదీన పశువైద్య విశ్వవిద్యాలయం నుంచి జ్యోతిరావ్ పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించడం ద్వారా ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. రైతు సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రామినేని వెంకయ్య, జిల్లా నాయకులు టి. జనార్దన్ మాట్లాడుతూ నిపుణులైన పశువైద్యులు గ్రామాల్లో పని చేయడం ద్వారానే పాడి పరిశ్రమ అభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాడి పరిశ్రమ రంగానికి మరిన్ని నిధులను బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. ఆందోళనలు, ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని, ఆ దిశగా విద్యార్థులు సంఘటితంగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశికుమార్, శివారెడ్డి, పశువైద్య విద్యార్థులు డా॥ అవినాష్, డా॥ రమేష్, డా॥ మహేంద్ర, డా॥ వివేకానంద రెడ్డి, డా॥ వసుంధర, డా॥ దివ్య పాల్గొన్నారు.



భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఎస్వీయూలో ఏఐఎస్ఎఫ్ క్రీడా పోటీలు

విశాలాంధ్ర - తిరుపతి (ఎస్వీయూ) : స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ 87వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థుల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఏఐఎస్ఎఫ్ నేతల పర్య వేక్షణలో సాగిన క్రీడల్లో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎస్వీయూ అధ్యాపకులు డాక్టర్ కె. వెంకటరమణ ప్రారంభించారు. వామనరావ్ భవన్ వద్ద ఆది వారం ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు భగత్ సింగ్ ముఖచిత్రాన్ని వేసి ఆకట్టుకున్నారు. ఈ పోటీ లను ఎస్వీయూ సంస్కృత విభాగం అధ్యాపకురాలు డాక్టర్ శిరీష ప్రారంభించారు. దేశం కోసం భగత్ సింగ్ అతి చిన్న వయస్సులో ప్రాణత్యాగానికి పూనుకోవడం ఉద్యమస్ఫూర్తికి నిదర్శనమని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జె. విశ్వ నాథ్ పేర్కొన్నారు. భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుం దన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. శశికుమార్, కె.శివారెడ్డి, ఎస్వీయూ కార్యదర్శి బండి చలపతి, నాయకులు ఎస్. దాము, విష్ణు, ఉదయ్, మురళి, వెంకటేష్, విజయన్, మూర్తి, రాఘవ, బుజ్జిబాబు, నాగరాజు పాల్గొన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆకస్మిక తనిఖీ



విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : కృష్ణాజిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో మూడురోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో విద్యుత్ నిలిచిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యార్థులతోపాటు సిబ్బంది క్వార్టర్స్‌లోనూ అంధ కారం నెలకొంది. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సెలవుపై వెళ్ళడంతో యూనివర్సిటీ ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కిస్తుండటంతో విద్యార్థులు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగానికి ఫిర్యాదు చేశారు. దీంతో సీఎం కార్యాలయ అధికారులు యూనివర్సిటీ ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆదివారం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు ఆకస్మికంగా ట్రిపుల్ ఐటీని సందర్శించి విద్యుత్ సమస్యపై ఆరా తీశారు. మంత్రి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఉండగానే తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసిన అధికారులు విద్యుత్ సమస్యను పరిష్కరించడం గమనార్హం. ఈ సందర్భంగా విద్యార్థుల మెస్‌లను తనిఖీ చేసిన గంటా భోజన నాణ్యతాను తెలుసునేందుకు అక్కడే భోజనం చేశారు. కొందరు విద్యార్థులతో ఏకాంతంగా భేటీ అయ్యారు. అకడమిక్ సమస్యలతోపాటు తాగునీరు ఇతర అంశాలను మంత్రికి ఏకరువుపెట్టారు. శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు తాము ఇక్కడ ఉండలేకపోతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సమాధానమిస్తూ జూన్ నాటికి శ్రీకాకుళం క్యాంపస్‌ను అందుబాటులోకి తీసు కొచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఐటీలో నీటి సమస్య పరిష్కారం కోసం యూనివర్సిటీ అధికారులకు పలు సూచనలు చేశారు.

హోం గార్డుల జీతాలు పెంచండి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం 24 గంటలపాటు పోలీసులతో సమానంగా పని చేస్తున్న హోం గార్డులకు ఇప్పటికైనా వేతనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం గార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.గోవింద్, అమరావతి హోం గార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.శేషాచార్యులు ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రెండు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర హోంగార్డుల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం వేతనాలు పెంచుతామని 2017 నవంబరు 21వ తేదీన శాసనసభలో హోంశాఖ మంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రకటించినా ఫలితం లేకపోవడం బాధాకరమన్నారు. వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత, ఐదేళ్ళ సర్వీస్, అర్హత కలిగిన హోం గార్డులకు సీనియార్టీ ప్రకారం కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. వారాంతపు సెలవు, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన, మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో అమరావతి రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు రామకృష్ణ యాదవ్, గుంటూరు రూరల్ అధ్యక్షులు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌలు రైతును కాటేసిన అప్పులు

- ప్రాణం తీసిన సాగు సంక్షోభం
- ఏమీ ఇవ్వలేకపోయానంటూ కొడుకుతో ఆఖరి మాటలు
- కరవుసీమలో అన్నదాత ఇంట విషాదం



విశాలాంధ్ర - ఎమ్మిగనూరు

పంటల్లో బాగా దిగుబడి వచ్చి లాభాలొస్తే కొడుకు పెళ్లి చేద్దామనుకున్నాడు ఆ కౌలు రైతు.. సాగు సంక్షోభంలో ఆశించిన పంట చేతికి రాలేదు.. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టాల్లో చిక్కుకున్నాడు. అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. అప్పులు తీర్చలేక తీవ్ర ఒత్తిడితో పొలంలోనే పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెళ్ళీడుకొచ్చిన బిడ్డ కూడా ఆ క్షణంలో గుర్తు రాలేదా అంటూ కుటుంబసభ్యులు రోదించిన తీరు కరవు కోరల్లో చిక్కుకున్న రాయలసీమ అన్నదాతల దుస్థితికి అద్దం పడుతోంది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఆదివారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికులను కలచివేసింది. ప్రకాశం జిల్లా అద్దంకి తాలూకా కొర్రువానిపాలెం గ్రామానికి చెందిన తూమాటీ నాగేశ్వరరావు(65) 25 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం ఎమ్మిగనూరు వలస వచ్చాడు. కలగట్ల రోడ్డు మహబూబ్‌కాలనీలో నివాసం ఉంటూ ఎమ్మిగనూరు, మంత్రాలయం పరిధిలో పొలాలు కౌలుకు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. బాబాఫరీద్ దర్గా సమీపంలో 11 ఎకరాల పొలం కౌలుచేస్తున్నాడు. పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా పంటల దిగుబడి రాకపోవడం, గిట్టుబాటు ధర లేక అప్పుల్లో కూరుకుపోయాడు. ప్రైవేటు వ్యక్తులతోపాటు ఎరువుల దుకాణంలో మొత్తం కలిపి సుమారు రూ.7 లక్షల వరకు అప్పులు ఉన్నట్టు సమాచారం. ఆదివారం ఉదయం ఇంటినుంచి బయలుదేరిన నాగేశ్వరరావు పొలం వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పాడు. టిఫిన్ చేయదానికి ఇంటికి రాకపోవడంతో తండ్రిని తీసుకొచ్చేందుకు కుమారుడు పొలానికి వెళ్ళాడు. అప్పటికే పురుగుమందు తాగిన తండ్రి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తీరును చూసి బిడ్డ తల్లడిల్లిపోయాడు. ఏమి జరిగింది నాన్నా.. అంటూ కొడుకు అడగడంతో వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేకపోతున్నా.. మీకు ఏమీ ఇవ్వలేక పురుగులమందు తాగి చనిపోతున్నానంటూ ఆ కౌలురైతు చివరిమాటలు రైతాంగంలో చర్చనీయాంశమయ్యాయి. తండ్రి మాటలకు తల్లడిల్లిపోయిన కొడుకు మహేష్ హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యం లోనే ఆ అన్నదాత గుండె ఆగిపోయింది. నాగేశ్వరరావుకు భార్య రమాదేవి, కుమారుడు మహేష్, కూతురు మహేశ్వరి ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

టెన్త్ పరీక్షల్లో అంతా జంబ్లింగే

- ఈ ఏడాది నుంచి నూతన విధానం
- ఇన్విజిలేటర్లకు జంబ్లింగ్ పద్ధతి
- పరీక్షా కేంద్రాల్లో అరగంట ముందు లాటరీ



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో : రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ ఏడాది విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ విధానం అమలు చేయనున్నారు. పరీక కేంద్రాల్లో ఇప్పటివరకు జంబ్లింగ్ విధానం కేవలం విద్యార్థులకు మాత్రమే ఉంది. గతంలో అయితే పదో తరగతి మొదటి పరీక్ష నుంచి చివరి పరీక్ష వరకు విద్యార్థికి ఒకే సీటు ఉండేది. రెండేళ్లుగా జంబ్లింగ్ విధానం అమలు కావడంతో రోజూ విద్యార్థులు సీట్లు మారుతుంటాయి. మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలనే ఉద్దేశంతో ఈ ఏడాది నుంచి ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ పద్ధతిలో నియమించేలా ప్రభుత్వం మార్పులు చేసింది. గత ఏడాది వరకు ఇన్విజిలేటర్లకు ఏ పరీక్షకు ఏ గది కేటాయించేదీ ఆయా పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు నిర్ణయించేవారు. దీంతో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆయా కేంద్రాల సూపరింటెండెంట్లు, ఉపాధ్యాయులను మచ్చిక చేసుకుని నచ్చిన వారిని ఆయా పాఠశాలల విద్యార్థులున్న గదిలో వేయించుకుని కాపీయింగ్ చేయించే వారనే విమర్శ ఉంది. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు ఈ విధానానికి పాఠశాల విద్యాశాఖ స్వస్తి పలికింది. ఇప్పటికే అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు అందాయి. పరీక్ష నిర్వహణకు అరగంట ముందు చీఫ్ సూపరింటెండెంట్ ఆయా పరీక్ష కేంద్రాల్లో లాటరీ ద్వారా ఇన్విజిలేటర్‌కు ఏ గది వచ్చిందో తెలియజేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నూతన విధానంతో పరీక్షలను పారదర్శకంగా నిర్వహించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతున్నం దున ఇన్విజిలేటర్లు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు. ఒక పట్టణంలో లేదా మండల కేంద్రాల్లో ఒకటి కంటే ఎక్కువ పరీక్షా సెంటర్లు ఉంటే మూడురోజులకోసారి ఇన్విజిలేటర్ల కేంద్రాలను మార్చే ఆలోచనలో కూడా విద్యాశాఖ అధికారుల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

విజయవాడ కమిషనరేట్‌లో

భారీగా ఎస్ఐల బదిలీలు

విశాలాంధ్ర - విజయవాడ (కృష్ణలంక) : విజయవాడ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో భారీగా సబ్ ఇనస్పెక్టర్లను(ఎస్ఐ) బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ డి.గౌతం సవాంగ్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని వివిధ స్టేషన్లకు చెందిన 28 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలు అందరూ తక్షణం ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

'ఉపాధి' నిధులు మళ్ళిస్తే సహించం

- కర్నూలుజిల్లాలో 13, 14 తేదీల్లో కరవు జాతా
- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆవుల శేఖర్



విశాలాంధ్ర - కర్నూలు సిటీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతరరంగాలకు మళ్ళిస్తే సహించబోమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల శేఖర్ హెచ్చరించారు. ఉపాధి నిధులను కూలీలకే ఖర్చుచేయాలని, మొండిగా ఇతర రంగాలకు తరలిస్తే ప్రతిఘటన తప్పదన్నారు. కర్నూలులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పనైనా చూపాలి-తిండైనా పెట్టాలి అన్న నినాదంతో వ్యవసాయ కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వామపక్షపార్టీల దశాబ్దాల పోరాట ఫలితమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టంగా రూపుదిద్దుకుందన్నారు. ఈ పథకం నిధులను ఇతర శాఖలకు తరలించి కూలీలకు సకాలంలో కూలి పనులు చూపించకపోవడం వల్లే రాయలసీమ జిల్లాల్లో వలసలు పెరిగిపోయాయన్నారు. ఈ ప్రాంతం నుంచి కర్ణాటక, హైదరాబాద్, కేరళ, ముంబాయి, గుంటూరు తదితర ప్రాంతాలకు ప్రతి సంవత్సరం పది లక్షల మంది వలసలు వెళుతున్న తీరు దీనికి నిదర్శనమన్నారు. వలస వెళ్ళిన కుటుంబాల్లోని వృద్ధులు, పిల్లలు పస్తులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఆదుకోవాల్సిన పాలకులు హామీలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వలసలను నివారించడంతోపాటు ప్రతి ఒక్కరికీ 200 రోజులు పనిదినాలు, రోజుకు రూ.300 కూలి చెల్లించాలని, ఉపాధి నిధులను ఇతర రంగాలకు మళ్లించరాదని, అడిగిన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇచ్చి వ్యక్తిగతంగా పనులు కల్పించాలని, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదలచేసి వారంలోగా కూలీలకు డబ్బులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధిపథకం అమలులో అవినీతిని, యంత్రాలతో పనులను అరికట్టాలని, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిచేసే ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన తదితర సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 13, 14 తేదీలలో కర్నూలు జిల్లావ్యాప్తంగా కరవు జాతా చేపట్టనున్నట్లు తెలిపారు. 13వ తేదీ ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రారంభమయ్యే కరవుజాతా కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం, పెద్దకడుబూరు, కౌతాళం మీదుగా ఆదోని చేరుకొంటుందన్నారు. రాత్రి ఆదోనిలో బస చేస్తామన్నారు. 14న ఆలూరు, ఆస్పరి, పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, ప్యాపిలి మీదుగా డోన్‌లో సాయంత్రం 6 గంటలకు సభతో జాతా ముగుస్తుందన్నారు. వ్యవసాయ కూలీలు, ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి కె. రాధాకృష్ణ, గౌరవాధ్యక్షులు కె. తిమ్మయ్య పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఏకమవుదాం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నేతల పిలుపు



విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ : జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గ మని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు గొలగాని కిశోర్‌కుమార్ ఆరోపించారు. విజయనగరంలోని రెవెన్యూ హోమ్‌లో ఆదివారం బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పొట్నూరు భాస్కరరావు అధ్యక్షతన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కిశోర్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడచినా రెండు కులాల చేతిలోనే సీఎం పదవులు ఉండడం దారుణమన్నారు. బీసీల అభ్యున్నతిని దెబ్బతీసేలా ప్రభుత్వాల కుట్రను ఎదుర్కొనేందుకు బీసీ సంఘ నేత ఆర్.కృష్ణయ్య చేస్తున్న పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. బీసీలకు ఒక రాజకీయ పార్టీ కావాల్సి ఉన్నందున పార్టీ ఏర్పాటుకు కసరత్తు జరుగుతుందన్నారు. ఆస్తులను దగ్ధం చేస్తేనే రిజర్వేషన్లు వస్తాయను కుంటే 80 శాతం జనాభా కలిగిన బీసీలు అదే పనిచేస్తే ఏం చేస్తారని పాలకులను ప్రశ్నించారు. ప్రస్తుత రాజకీయ పార్టీలకు కొమ్ముకాస్తే బీసీలు మునిగిపోవడం ఖాయమని, ఇప్పటికైనా మేల్కొనాలని కిశోర్‌కుమార్ పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశవ శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిరంగాలలో అభివృద్ధి చెందిన కాపులను బీసీల్లో చేరుస్తూ తీర్మానం చేయడం బీసీలకు ద్రోహం చేయడమేనన్నారు. 93 కులాలు బీసీల్లో ఉన్నప్పుడు కొనసాగిన రిజర్వేషన్లే నేడు 143 కులాలు చేరినా అవే ఉండడం దారుణమన్నారు. కులాల మధ్య విభేదాలు సృష్టించేలా ప్రస్తుత రాజకీయ పార్టీలు వ్యవహరిస్తు న్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని బీసీలంతా పార్టీలకతీతంగా ముందుకు వచ్చి భవిష్యత్‌తరాల హక్కులను కాపాడుకుం దామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, విశాఖ సిటీ అధ్యక్షులు బుగత నరసింగరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి రాజ్‌కిరణ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు గదుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిశనగ రైతు గగ్గోలు

- రైతు వద్ద క్వింటా ధర రూ.4 వేలు
- బహిరంగ మార్కెట్‌లో రూ.7000
- నష్టపోక తప్పదంటున్న రైతులు





విశాలాంధ్ర-ఆత్మకూరు : నాలుగేళ్లుగా వరుస కరవు నేపథ్యంలో అరకొర పడుతున్న వర్షాల ఆధారంగా సాగు చేసిన పచ్చిశనగ రైతు గిట్టుబాటు ధర కష్టాల్లో చిక్కుకున్నాడు. నెల్లూరు జిల్లాలో మెట్ట మండలాలకు పరిమితమైన పచ్చిశనగ సాగు ఈ ఏడాది ఆత్మకూరు, గూడూరు, నెల్లూరు డివిజన్ల పరిధిలో సుమారు 40 వేల ఎకరాల్లో వేశారు. ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 15 వేల ఎకరాల్లో ప్రస్తుతం ముమ్మరంగా కోతలు సాగుతున్నాయి. నాణ్యమైన పంట దిగుబడి వచ్చినా వ్యాపారులు క్వింటా రూ.4 వేల ధరకు అడుగుతున్నారు. గత ఏడాది క్వింటా రూ.9,500 ఉండగా ఈ ఏడాది సగానికి సగం పడిపోవడంతో రైతులు కుమిలిపోతున్నారు. కనీసం పెట్టుబడి కూడా తిరిగిరాదంటున్నారు.

పెరిగిన సాగు ఖర్చు

గత ఏడాదితో పోలిస్తే శనగ పైరు సాగు ఖర్చు అధికమయ్యింది. గతంలో ఎకరం సాగుకు రూ.13 వేల వరకు ఖర్చు అయ్యేది. ఈ ఏడాది రూ.17 వేలకు పెరిగింది. ప్రభుత్వం పూర్తిస్థాయి సబ్సిడీతో విత్తనం సరఫరా చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలుకు, దుక్కులు, పురుగు మందులు, కూలీలు, పక్షుల బారిన పడకుండా కాపలా ఖర్చు తడిసి మోపెడయ్యింది. కౌలు రైతుకు ఆయా గ్రామాలను బట్టి ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.10 వేలు అదనం. ముందుగానే కౌలు చెల్లించాల్సిన పరిస్థితి. దీంతో ఎకరాకు పెట్టుబడి రూ.23 వేల నుంచి రూ.30 వేల వరకు అవుతుంది. ఎకరాకు 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, ప్రస్తుత ధరకు అమ్మితే నష్టపోక తప్పదని ఆవేదన చెందుతున్నారు.

దళారుల చేతుల్లోనే ధర

శనగ పంట మంచి దిగుబడి తీసినా అమ్ముకోవాలంటే దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి. గత ఏడాది క్వింటా శనగల ధర రూ.9500 పలికింది. బయట మార్కెట్‌లో పచ్చిశనగకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ దళారులు కుమ్మక్కై ధరను అమాంతంగా తగ్గించేశారు. క్వింటా రూ.3,500 నుంచి రూ.3,800కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఇదే బహిరంగ మార్కెట్‌లో ఓ రైతు క్వింటా కొనుగోలు చేయాలంటే వ్యాపారులు రూ.7 వేలు చెబుతున్నారు.

పచ్చిశనగకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతోపాటు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు లేకపోవడంతో రైతులు వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. తక్కువ ధరకు అమ్ముకోలేక, నిల్వ చేసుకునే అవకాశం లేక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించి తమ వద్దనున్న శనగలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

గిరిజనుణ్ణి చంపేసిన గజరాజుల గుంపు

విశాలాంధ్ర - కొత్తూరు : శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం, రాయల పంచాయతీలోని టింపనిగూడ గిరిజన గ్రామానికి చెందిన యువకుడు టింపని కుమార్ (32) ఏనుగుల దాడిలో మృతిచెందాడు. శనివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన ఆదివారం ఉదయం బాహ్య ప్రపంచానికి తెలిసింది. స్థానికుల సమాచారంతో డీఎఫ్‌వో శాంతి స్వరూప్, కొత్తూరు ఫారెస్ట్‌అధికారి తిరుపతి రావు టింపనిగూడ గ్రామానికి చేరుకున్నారు. మృతుడు కుమార్ కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. దహన సంస్కారాలకు తక్షణం రూ.10వేల నగదును మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. పొన్నుటూరు, రాయల పంచాయతీ గ్రామాల్లో నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు అరటిచేలను ధ్వంసం చేస్తోంది. శనివారం సాయంత్రం టింపనిగూడ పొలాల్లో కొందరు గిరిజనులు పనులు చేస్తున్న సమయంలో ఏనుగులు వారి వైపు రావడంతో అందరూ పరుగులు తీశారు. ఒక్కసారిగా కుమార్‌పై దాడిచేయడంతో శరీర భాగాలు తునాతునకలయ్యాయి. ఈ గ్రామం కొండ కోనల్లో ఉండడం, చీకటిపడడంతో మరుసటి రోజు ఉదయానికి తెలిసింది. మైదాన ప్రాంతాల్లోని కల్లాల్లో ధాన్యం, గిరిజన ఉత్పత్తులను ఏనుగులు నాశనం చేస్తున్నాయి. ఇప్పటికైనా ఏనుగుల నుంచి గిరిజనుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.



విజయవాడలో పార్టీ ముఖ్య నేతలతో పవన్ భేటీ

నేడు కాజ గ్రామంలో సొంత ఇంటి భూమిపూజ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం సాయంత్రం విజయవాడ చేరుకున్నారు. స్థానిక హోటల్‌లో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. గుంటూరు సమీపంలోని నాగార్జున నగర్‌లో ఈనెల 14న నిర్వహించతల పెట్టిన పార్టీ ఆవిర్భావ సభ, ప్లీనరీ సమావేశాలపై ప్రధానంగా చర్చించారు. సభా వేదిక డిజైన్‌ను పరిశీలించి పలు మార్పులు చేర్పులు సూచించినట్లు తెలుస్తోంది. ఈ సభకు 13 జిల్లాలనుంచ పెద్ద ఎత్తున జనం తరలివస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా రాజధాని అమరావతి కేంద్రంగా రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలని పవన్ నిర్ణయించారు. విజయవాడ-గుంటూరు రోడ్డు మార్గంలో ఉన్న కాజ గ్రామంలో సొంత ఇంటికి సంబంధించిన భూమి పూజను కుటుంబంతో కలసి సోమవారం పవన్ నిర్వహిస్తారని పార్టీ నేతలు తెలిపారు. నివాసంతో పాటు పార్టీ కార్యాలయ నిర్మాణానికి 2 ఎకరాల స్థలాన్ని పార్టీ నేతలు ఎంపిక చేసిన విషయం తెలిసిందే.



విభజన హామీలను సాధించే వరకు పోరాడతాం

●13న రాష్ట్ర వ్యాప్తంగా భారీ ర్యాలీ ● ఎన్‌జీవో నేత విద్యాసాగర్

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నీ సాధించేవరకు ప్రజాపోరాటాలకు ప్రభుత్వ ఉద్యోగుల సంపూర్ణ మద్దతు లభిస్తుందని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు పరచడంలో చూపిస్తున్న అలసత్వ ధోరణికి నిరసనగా ఈ నెల 13న నిర్వహించనున్న ర్యాలీ ఏర్పాట్లపై విజయవాడలోని ఏపీఎన్‌జీవో హోమ్‌లో ఆదివారం జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు పరచాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రత్యేక హోదాతో పాటు మిగిలిన అన్ని హామీలను అమలు చేయకుంటే రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంటుందన్నారు. ఈ నెల 13న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అన్ని జిల్లా కేంద్రాలతోపాటు విజయవాడ నగరంలో భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరసర ర్యాలీలలో ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు, న్యాయవాదులు, వైద్యులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 13 సాయంత్రం 5 గంటలకు విజయవాడ బందురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయం నుంచి గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వరకు నిరసర ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ప్రదర్శనలో ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొననున్నారన్నారు. జేఏసీ సమావేశంలో ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ ఇక్బాల్, సహఅధ్యక్షులు డి.సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు రాజుబాబు, జిల్లా అధ్యక్షులు కోనేరు రవి, మహిళా ప్రతినిధులు ఎం.సుజాత, ఎన్ హేమకళ్యాణి, న్యాయవాదుల సంఘాల ప్రతినిధి నరహరిశెట్టి శ్రీహరి, పీఆర్‌టీయూ అధ్యక్షులు డి.శ్రీను, యూటీఎఫ్ అధ్యక్షులు మనోహర్, పాలిటెక్నికల్ ఉద్యోగుల సంఘ నాయకులు గోపీచంద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘ నాయకులు భాస్కరరావు, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధి సాయిరామ్, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జనం సొమ్ము విగ్రహాల పాలు

విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఇటువంటి నిర్మాణాలకు అక్షరాల రూ. 6,939 కోట్లు ఖర్చుపెడుతున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ సర్కార్లు ఖజానా నుంచి డబ్బును వీటి కోసం నీటి ప్రవాహంలా వెచ్చిస్తున్నారు. మహారాష్ట్రలో 3,600కోట్లతో శివాజీ స్మారక స్థాపాన్ని కడుతున్నారు. సముద్రంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దేలా డిజైన్ చేశారు. ఇక్కడ తలపెట్టే ఇలాంటి విగ్రహ స్థాపనలకు కాసులపరంగా ఎలాంటి ఆటంకం ఏర్పడటంలేదు. ఎందుకంటే దేశానికి ఆర్థిక రాజధాని ముంబయి కావటంతో.. అక్కడి బీజేపీ పాలకులు నిధుల పరంగా ఎలాంటి ఇబ్బందీ ఉండదనే వాదన వినిపిస్తున్నది. ప్రభుత్వాలతో పోటీగా ట్రస్టులు, ఇతర సంస్థలు కూడా కోట్లు వెచ్చించటానికి ఏమాత్రం వెనకాడటంలేదు. రాజస్థాన్‌లో ఓ ప్రయివేట్ సంస్థ నాథ్‌ద్వారాలో శివుని ప్రతిమను రూపొందిస్తున్నది. ఈ విగ్రహం ఎత్తు 351 అడుగులు. ఈ విధంగా మొత్తం ఆరు అతిపెద్ద విగ్రహాలు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తెరముందు సంస్థలు, ట్రస్టులు ఉన్నా వీటి వెనుక అక్కడి ప్రభుత్వాలు పూర్తిగా సహకరిస్తున్నాయనటంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు.

గుజరాత్ : స్టాట్యూ ఆఫ్ యూనిటీ - రూ. 2989 కోట్లతో విగ్రహం

గుజరాత్‌లోని నిర్మించనున్న స్టాట్యూ ఆఫ్ యూనిటీ విగ్రహానికి రూ. 2989 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. సర్దార్ వల్లభ భాయ్ పటేల్ విగ్రహం 182 మీటర్ల ఎత్తులో ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకు రూ. 1,100 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఏడాది జూన్‌లో ప్రారంభోత్సవం చేసేలా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.





నీళ్లకోసం అవసరమైన నిధులు 4,800 కోట్లు

గుజరాత్ ప్రభుత్వం అభివృద్ధిపనుల నిమిత్తం ఇంటర్నే షనల్ ఏజెన్సీలవద్ద నుంచి రూ. 17,620 కోట్ల మేర అప్పులు తీసుకునేందుకు అనుమతించాలని కేంద్రానికి ఇటీవల విన్నవించింది. సౌరాష్ట్రలోని నర్మదానదిలో నీటి చుక్కలేదు. ఎన్నికల్లో పూర్తిగా నీటివదిలేశారు. ఇప్పటికీ ఇక్కడి నీటి సమస్యను తీర్చటానికి రూ. 4,600కోట్లు అవసరమున్నది. జపాన్ జైకా లాంటి రుణసంస్థలకు ఫండింగ్ కోసం మెట్రో రైలుతో సహా పలు ప్రాజెక్టులు ఎదురుచూస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్ : అయోధ్యలో 108 మీటర్ల ఎత్తులో విగ్రహం

అయోధ్యలో రామమందిరానికి 108 మీటర్ల ఎత్తులో నిర్మించాలని యోగి సర్కారు ఆరాటపడుతున్నది. దీనికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్లు వెచ్చించైనా ఆ విగ్రహాన్ని నిర్మించాలనుకుంటున్నది. అవసరమైన నిధుల కోసం విరాళాలు సేకరించాలనుకుంటున్నది. కాని యూపీలో వైద్యానికి నిధులు రూ. 473 కోట్లు అవసరం కాగా ఆ విషయాన్ని మాత్రం యోగీ సర్కారు గాలి కొదిలేసింది- ఆస్పత్రుల్లో ఎమర్జన్సీ వార్డుల్లేక రోగులు అవ స్థలు పడుతున్న పట్టించుకోవడం లేదు. లక్నో పీజీఐలో 250 పడకల ఆస్పత్రి, లివర్, కిడ్నీ ట్రాన్స్ ప్లాం టేషన్ సెంటర్ నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు. దీనికోసం రూ. 473 కోట్లు నిధులు కావాలి. ట్రోమా సెం టర్ కట్టడానికి నిధులలేమితో అవస్థలు పడుతున్నది. యూపీలో కోన్నోజ్ ప్రాంతంలో సైన్స్ లాబోరేటరీ బిల్డింగ్‌కు నిధులు లేక గత ఎనిమిది నెలలనుంచి పనులు ఆగిపోయాయి.

మధ్యప్రదేశ్ : 108 అడుగుల ఎత్తు విగ్రహం

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆది శంకరాచార్య విగ్రహాన్ని 108 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నది. దీనికి సుమారు రూ. 200 కోట్లు వెచ్చించనున్నట్టు సమాచారం. దీనికోసం ఏకాత్మ యాత్రల పేరిట ప్రచారంతోపాటు ఎన్నికల్లో లబ్ధికి రథాలను సిద్ధం చేసింది.

రాజస్థాన్ : 351 అడుగుల ఎత్తులో శివుని విగ్రహం

రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారాలో 351 అడుగుల ఎత్తు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు.

ఇందులో సుమారు 600 మంది కార్మికులు, మరో 200 శిల్పకళాకారులు పనిచేస్తున్నారు.

తెలంగాణలో వెయ్యికోట్లతో స్టాట్యూ ఆఫ్ ఈక్వలిటీ

హైదరాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని శంషాబాద్‌లో సంత్ రామానుజాచార్య విగ్రహాన్ని 216 అడుగుల ఎత్తుల నిర్మించటానికి సన్నద్ధమవుతున్నది. దీన్ని మందిర్ ట్రస్ట్ తయారుచేస్తున్నది.

వేమిరెడ్డి ఏకగ్రీవమే...



విశాలాంధ్ర- నెల్లూరు బ్యూరో : రాజ్యసభ సభ్యత్వానికి వైసీసీ తరపున నామినేషన్ దాఖలు చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం అయినట్టే. సోమవారం సాయంత్రం ఆయనకు ధృవపత్రాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రం నుంచి మొత్తం మూడు స్థానాలు ఖాళీకాగ, టీడీపీకి 2 వైసీపీకి 1 దక్కే బలముంది. మూడో అభ్యర్థిని సైతం రంగంలోకి దింపాలని టీడీపీ ప్రయత్నించినా పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో విరమించుకుంది.

సకల రోగాలపై సర్కార్ సమరం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : సకల రోగాలపై సర్కార్ సమరం ప్రకటించింది. ఇంటింటికీ కంటి, ఇతర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. వేసవిలో నెల రోజుల పాటు ఈ పరీక్షలు జరిపి, అవసరమైన మందులు అందజేయనుంది. గుట్టుగా విస్తరిస్తున్న గ్లాకోమా నివారణకు దీనిపై ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంచనుంది. ఈనెల 17న ప్రపంచ గ్లాకోమా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తోన్న వారోత్సవాలను పురస్కరించుకుని, హైదరాబాద్ ఆప్తమాలజిస్టుల అసోసియేషన్ ఆధర్వంలో సెంటర్ ఫర్ సైట్ ఎడ్యుకేషన్ సహకారంతో స్టాప్ తెఫ్ట్-సేవ్ సైట్ లెఫ్ట్ అనే కాన్సెప్ట్‌తో గ్లాకోమాపై ప్రజల్లో అవగాహన చైతన్యాన్ని వ్యాప్తి చేయడానికి ఆదివారం ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. వైద్య, ఆరోగ్య శాఖమంత్రి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఇప్పటికే అనేక సదుపాయాలు పెంచి, ప్రభుత్వ వైద్యశాలలను ఆధునీకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అత్యాధునిక పరికరాలు కూడా ఇస్తున్నామని, అలాగే త్వరలోనే 10వేల మంది ఉద్యోగుల నియామకాలు కూడా పూర్తవుతాయన్నారు. 40ఏళ్లు పైబడిన వారిలో వారసత్వంగా సంక్రమించే గ్లాకోమాని గుర్తించగలిగితే వైద్య చికిత్స అందించవచ్చున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 3శాతం మంది గ్లాకోమా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారని, భారత్‌లో 1.2 కోట్ల మంది ఈ వ్యాధిగ్రస్తులు ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయన్నారు. స్టాప్ తెఫ్ట్-సేవ్ సైట్ లెఫ్ట్ అనే కాన్సెప్ట్‌తో గ్లాకోమాపై రూపొందించిన వీడియోని లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ వరుణ్ మల్హోత్రా, మాథుర్, వెంకటరత్నం, కళ్యాణీ ప్రసాద్, వాణీ పాల్గొన్నారు.

అంధత్వ నివారణ అందరి బాధ్యత : అంధత్వ నివారణ అందరి బాధ్యత అని లక్ష్మారెడ్డి తెలిపారు. అంధత్వ నివారణ సంస్థ, సరోజనీ కంటి దవాఖానా సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవేర్‌నెస్ వాక్‌ని ఆదివారం సరోజనీ ఆసుపత్రి ప్రాంగణంలో మంత్రి ప్రారంభించారు. హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి పాల్గొన్నారు. నీటి కాసులుగా పిలిచే ఈ వ్యాధి చూపుపై నిశ్శబ్దంగా, వేగంగా ప్రభావం చూపుతుందని లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రతి ఏడాది ఒక్క సరోజనీ దేవి ఆసుపత్రి 10వేల మందికి వైద్య సేవలు అందిస్తుందని, అందులో ప్రతి ఏడాది సగటున 600 మందికి శస్త్ర చికిత్సలు చేస్తున్నారన్నారు. నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ, ప్రజల్లో అవగాహన, చైతన్యం కలిగించడం, వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించడం, క్రమం తప్పకుండా చికిత్స చేయించుకుంటే గ్లాకోమా వ్యాధి నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారని, ప్రజలు వీటిని ద ృష్టిలో పెట్టుకుని చైతన్యం కావాలన్నారు. ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల సందర్భంగా సరోజనీ దవాఖానా ఆధ్వర్యంలో వారం రోజుల పాటు గ్లాకోమా స్క్రీనింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రవిందర్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, డీఎంఈ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాలకు

అంకిత భావంతో విద్యనందించాలి

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదల వర్గాలకు అధ్యాపకులు అంకిత భావంతో విద్యనందించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు కోరారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఏపీ గవర్నమెంటు కాలేజీ టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు.దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రముఖ విద్యావేత్త చుక్కా రామచంద్రయ్య మాట్లాడుతూ, అధ్యాపకులు సామాజిక మార్పు సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ,కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యనందించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులపై ఒత్తిడిలేని చదువును బోధించాలని కోరారు.ఆవిష్కరణలు, వినూత్న అంశాలకు ప్రధాన్యాత పెరగాలని సూచించారు. జీసీటీఏ రాష్ట్ర అధ్యక్షులు జి.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, గద్దె శ్రీనివాసులు నాయుడు, ఆర్జేడీ ఎం.ప్రసాద్, ప్రిన్సిపల్ సంఘం నుంచి డాక్టర్ వెలగా జోషి, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కమలమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ, అజీజ్ పాషా, తమ్మినేని, పల్లా, పద్మ తదితరులు

సాయుధపోరాట యోధురాలు

కమలమ్మ కన్నుమూత

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చెన్నబోయిన కమలమ్మ(92) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కమలమ్మ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటలకు మృతి చెందారు. వరంగల్ జిల్లాకు చెందిన కమలమ్మ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని తన కన్నబిడ్డను సైతం పోగొట్టుకొన్నారు. ఆమె పోరాటానికి, ఉద్యమస్ఫూర్తికి రాష్ట్ర ప్రభుత్వం 2016లో కమలమ్మను మహిళా అవార్డుతో సత్కరించింది. ఆమె చరిత్ర అంతర్జాతీయంగా వివిధ దేశాల గ్రంథాలయాలలో భద్రపరిచారు. నోబెల్ బహుమతికి అర్హురాలిగా కమలమ్మ పేరును జాతీయ మహిళా సమాఖ్య ప్రతిపాదించిన సందర్భం కూడా ఉంది. ఆమె గానం ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. ఆమె పాటిన పాటలు, జానపదాలు, పోరాటపాటలు ముఖ్యంగా 'సై...సై...గోపాలారెడ్డి-నీవు నిలిచావూ ప్రాణాలోడ్డి' తిరునగిరి రామాంజనేయులు (ఆనాటి అజ్ఞాత కవి) విరోచిత స్మారక గేయం దేశవ్యాప్తంగా పీడిత ప్రజల గుండెల్లో మారుమోగింది. ఆమె మరణవార్త అందగానే వామపక్ష నేతలు, ప్రజాసంఘాల కార్యరకర్తలు తరలివచ్చి కమ్మలమ్మకు అంజలిఘటించారు. ఆమె భౌతికకాయాన్ని వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తల సందర్శనార్థం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో అరగంటకు పైగా ఉంచారు. సీపీఐ కేంద్ర కార్యవర్గసభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా, ఏపీ కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్, డీజీ నర్సింహారావుతో పాటు సీనియర్ నాయకులు పావని, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు పోటు కళావతి, రజని, నలిని, విజయలక్ష్మి, బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి, నందూరి కరుణకుమారి, ఐప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి డా.డి.సుధాకర్ కమలమ్మకు నివాళులర్పించారు. మహిళా సమాఖ్య పతాకాన్ని కమలమ్మ పార్థివదేహంపై కప్పారు. ఆమె మరణం తెలంగాణ ప్రజలకు, కష్టజీవులకు తీరని లోటని, ఆమె ఉద్యమ స్ఫూర్తి ఆదర్శవంతమన్నారు. వరంగల్‌లోని పోచమ్మ మైదానంలో కమలమ్మ అంత్యక్రియలు జరిగాయి.

నేటి నుంచి తెలంగాణ అసెంబ్లీ

బడ్జెట్ సమావేశాలు

ఎదురుదాడికి ప్రతిపక్షాలు సంసిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై ఇప్పటికే ఆ పార్టీ సుదీర్ఘంగా చర్చించింది. రాష్ట్రంలో శీతాకాల అసెంబ్లీ సమావేశాల తరువాత చోటుచేసుకున్న పరిణామాలపై అధికారపార్టీని నిలదీసేందుకు కాంగ్రెస్ పార్టీ అస్త్రాలను సిద్దం చేసుకుంది. గత సమావేశాల్లో మాదిరిగా కాకుండా ఈ అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ పూర్తి స్థాయిలో దూకుడుగా వ్యవహరించాలని సీఎల్పీ సమావేశంలో నిర్ణయించారు. మైనార్టీ, గిరిజన రిజర్వేషన్ బిల్లు,ఎస్సీ వర్గీకరణబిల్లుపై కూడా రాష్ట్ర ప్రభుత్వంపై ఎదురుదాడికి కాంగ్రెస్ సిద్దం అవుతోంది. గత అసెంబ్లీ సమావేశాల్లో రైతుల రుణ మాఫీకి సంబంధించిన ఆధారాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కాంగ్రెస్‌ను కోరగా వారు దీనికి సంబంధించిన కొన్ని వివరాలను స్పీకర్‌కు అందచేశారు. అయితే నేటి వరకు వడ్డీ మాఫీ కాలేదని కాంగ్రెస్ ధ్వజమెత్తుతోంది.

గత బడ్జెట్ సమావేశాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధుల ఖర్చు విషయాన్ని నిలదీయనున్నారు. తాజాగా ఎస్సీ జాతీయ కమిషన్ చైర్మన్ సైతం రాష్ట్ర పర్యటనలో ప్రభుత్వం కేటాయించిన నిధులు ఖర్చు చేసిన విధానాన్ని తప్పుపట్టారు. మొత్తానికి రాష్ట్రంలో నెలకున్న వివిధ అంశాలపై కాంగ్రెస్ - బిజెపిలు రెండు కూడా అధికార పార్టీ పై ఎదురుదాడికి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అసెంబ్లీ చివరి బడ్జెట్ సమావేశం కావడంతో ప్రభుత్వంను అన్ని రకాలుగా ఢీకొట్టాలనే దిశగా వారు పావులు కదుపుతున్నారు.

ఒక్కొక్క పంచాయతీకి రూ.5 కోట్లు

గిరిజన సమాఖ్య డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తండాలను పంచాయతీలుగా యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని గిరిజన సమాఖ్య సీనియర్ నాయకులు ఆర్.శంకర్‌నాయక్ డిమాండు చేశారు. ఎన్నికల్లో ప్రకటించినట్లు తండాలను పంచాయతీలుగా చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న పంచాయతీలకు రూ.5 కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని డిమాండు చేశారు. ఆదివారం సమాఖ్య కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శంకర్‌నాయక్ మాట్లాడారు. తండాలను పంచాయతీలుగా గుర్తించి, ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేశారు. తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి ఎస్టీ అభ్యర్థులే పోటీ చేసేలా చట్టం తేవాలన్నారు. తండాల్లో మౌలిక సదుపాయాలు, విద్యా, వైద్యం, రోడ్లు, విద్యుత్, పంచాయతీల భవనాల ఏర్పాటు కోసం నిధులు కేటాయించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. తండాల అభివృద్ధికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. తండాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆడ పిల్లల అమ్మకాలు సాగుతున్న తండాల్లో ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు ఆడపిల్ల జన్మించిన కుటుంబంలో రూ.5 లక్షల ఫిక్సిడ్ డిపాజిట్ చేయాలని డిమాండు చేశారు.

రాజ్యసభ బరిలో కాంగ్రెస్ !

- ఫిరాయింపుదారులను ఇరకాటంలో పెట్టే వ్యూహం
- ముగ్గురు పేర్ల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మెజారిటీ లేకపోయినా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ మూడో అభ్యర్థిని నిలబెట్టేందుకు సిద్ధం అవుతోంది. కాంగ్రెస్ ఏ ధైర్యంతో ఈ బరిలో నిలుస్తోందనే విషయం చాలా మందికి అర్థం కాని ప్రశ్న. పార్టీ వర్గాలు మాత్రం వ్యూహాత్మకంగా నడిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్‌లో 19 మంది శాసనసభ్యులున్నట్టు అసెంబ్లీ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జారీ చేసే విప్‌కు ఈ 19 మంది కట్టుబడి రేపు జరిగే రాజ్యసభ ఎన్నికల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఎవ్వరైనా విప్‌ను ధిక్కరిస్తే వారిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసి, అనర్హత వేటు వేసే అవకాశాలున్నాయి. పార్టీ విప్ అలంపూర్ ఎమ్మెల్యే సంపత్ ద్వారా విప్ జారీ చేయించి ప్రస్తుతం టీఆర్‌ఎస్‌లో ఉన్న ఎమ్మెల్యేలను ఇరకాటంలో పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. పార్టీ ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించినా.. స్పీకర్ మాత్రం ఈ విషయంలో ఇప్పటివరకు స్పందించ లేదు. ఏదిఏమైనా .. కాంగ్రెస్ ఓ వ్యూహం ప్రకారం రాజ్యసభ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. రాజ్యసభ అభ్యర్థిని ఖరారు చేయడంలో నిమగ్నమై ఉంది. త్వరలోనే తమ అభ్యర్థిని ప్రకటిస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో మైనార్టీ వర్గానికి చెందిన మాజీ క్రికెటర్ అజారుద్దీన్, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పేర్లను పార్టీ పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. మాజీ ఎంపీ రవీంద్రనాయక్ పేరు కూడా పరిశీలనలో ఉందని కూడా తెలుస్తోంది. గూడూరు నారాయణరెడ్డి, బలరాంనాయక్ పేర్లను టీపీసీసీ పరిగణనలోకి తీసుకుంటోందని పార్టీ వర్గాలు అంటున్నాయి. తెలంగాణ అసెంబ్లీ బలాబలాల విషయానికొస్తే రెండు స్థానాలను టీఆర్‌ఎస్ గెలుచుకోవడం లాంఛనమే. 2014 ఎన్నికల ఫలితాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ 21 స్థానాల్లో గెలిచింది. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్ గూటికి చేరారు. ఇద్దరు సభ్యులు మరణించడంతో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఇప్పటికే టీఆర్‌ఎస్ కూడా ముగ్గురు పేర్లను ప్రకటిం చింది. అదే సమయంలో టీఆర్ ఎస్‌కు మద్దతు ఇవ్వనున్నట్లు ఎంఐ ఎం అధినేత అసదుద్దీన్ ప్రకటిం చారు. ప్రస్తుతం ఎంఐఎంకు అసెంబ్లీలో ఏడుగురు ఎమ్మెల్యేల బలముంది. తాజా పరిణామాల దృష్ట్యా కాంగ్రెస్ వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయనేది ప్రశ్నార్థకమే అయినప్పటికీ తమవంతు ప్రయ త్నంగా పార్టీ ముందుకు సాగుతుంది.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్‌లో భారీగా పేలుడు పదర్థాలు లభించడం కలకలం రేపింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని జవహర్‌నగర్‌లో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో భాగంగా జిలిటిన్ స్టిక్స్, డిటో నేటర్లరు బయటపడ్డాయి. ముడి పదార్థాలను తీసుకొచ్చి వీటిని తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పరిసరాల్లోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. పేలుడు పదా ర్థాలు లభించిన ఇంటి యాజమానిని అదుపులోకి తీసుకు న్నారు. ముడిపదార్థాలను ఎక్కడ నుంచి తీసుకొ చ్చారనేదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కార్డన్ సర్చ్‌లో భాగంగా ఎలాంటి పత్రాలు లేని 20 ద్విచక్రవాహనాలు, 8 ఆటోలు, రీఫిల్లింగ్ చేస్తున్న 10 సిలిండర్లను స్వాధీనం చేసు కున్నారు. 20 మంది అనుమానితులను అదుపులోకి తీసు కొని విచారిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని నగరం నుండి తరిమికొట్టేందుకే కార్డన్ సర్చ్ నిర్వహించామని మల్కాజ్‌గిరి డీసీపీ ఉమామహేశ్వర శర్మ తెలిపారు.

ఢిల్లీకి అఖిలపక్షం : బాలమల్లేష్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వర్గీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మాదిగలను, మాదిగ ఉపకులాలను మోసం చేశాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేష్ విమర్శించారు. ఆదివారం చేవెళ్ల మండలం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సహాయ కార్యదర్శి పాలమాకుల జంగయ్య, కార్యవర్గసభ్యులు ప్రభులింగం పాల్గొన్నారు. దళితులను ప్రభుత్వం ఓటు బ్యాంకుగా ఉపయోగిస్తుంది తప్ప వారి సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు.

గ్లాకోమాపై అవగాహన నడక



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కన్నుగుడ్డు చుట్టూ రంగుల వలయాలు ఏర్పడటం, నొప్పి ఉండటం, చూపు మందగించడం, కాంతి లేకపోవడం వంటి లక్షణాలతో గ్లాకోమా వ్యాధిని గుర్తించవచ్చునని ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ డాక్టర్ శిరీషా సెంటిల్ తెలిపారు. దీనిని త్వరగా గుర్తించకపోతే అంధత్వానికి దారితీసే అవకాశాలు ఉన్నాయన్నారు. అధిక హ్రస్వదృష్టి, మధుమేహులు ఉన్న కుటుంబ కుటుంబ సభ్యులకు కంటిపరీక్షలు చేయడం తప్పనిసన్నారు. ఎల్వీప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్లాకోమా అవగాహన నడకను టాలీవుడ్ హీరో సుమంత్ ప్రారంభించారు. ఇన్స్టిట్యూట్ నుంచి జూబ్లీహిల్స్ వరకు వాక్ సాగింది. డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శిరీషా మాట్లాడుతూ, ఈ సమస్యను తగ్గించడానికి అవగాహన ఒకట్టే మార్గమన్నారు. గ్లాకోమాకు చికిత్స ఉందని, అయితే త్వరగా గుర్తిస్తేనే అంధత్వాన్ని నివారించవచ్చునని తెలిపారు. ఈ వ్యాధిగ్రస్తుల్లో చాలామందికి తొలి లక్షణాలు తెలియవన్నారు. తరచూ తలనొప్పి రావడం, అదే విధంగా పదేపదే కంటద్దాలను మార్చాల్సి రావడం వంటివి సంభవిస్తే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి, కంటి వైద్యులను క్రమం తప్పకుండా సంప్రదించాలని, ఇది చాలా ముఖ్యమని సూచించారు. ఎల్వీప్రసాద్ ఐ హాస్పిటల్స్ ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా భువనేశ్వర్, విశాఖపట్నం, విజయవాడలలో ఉన్నట్టు డాక్టర్ శిరీషా తెలిపారు.

అఖిల్ 'గురి' అదిరింది..!



న్యూఢిల్లీ: మెక్సికోలో నిర్వహిస్తున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్‌లో భారత యువ షూటర్లు అదరగొడుతున్నారు. తాజాగా కుర్రాడు అఖిల్ షెరాన్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ పోటీలో స్వర్ణం సాధించి సంచలనం సృష్టించాడు. ప్రపంచకప్‌లో అరంగేట్రంలోనే పతకం సాధించిన భారత నాలుగో ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. షహజర్ రిజ్వీ, మను భకర్, మెహులి గోష్, అంజుమ్ ముద్గిల్ తమ విభాగాల్లో ఇంతకు ముందే పతకాలు సాధించడంలో ప్రపంచకప్‌లో భారత్ తొలిసారి పతకాల పట్టీలో అగ్రస్థానంలో నిలిచే అవకాశాలున్నాయి. 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ తుదిపోరులో షెరాన్ 455.6 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. ఆస్ట్రియా ఆటగాడు బెర్నార్డ్ పికిల్ 452 పాయింట్లతో రెండో స్థానం కైవసం చేసుకున్నాడు. షెరాన్ సాధించిన విజయం మామూలుదేమీ కాదు. అతడు మహామహులతో పోటీపడ్డాడు. ఎంతో ఒత్తిడిని చిత్తుచేశాడు. ఐఎస్ఎస్ఎఫ్‌లో 38 సార్లు పతకాలు గెలిచిన హంగేరియన్ రైఫిల్ లెజెండ్ పీటర్ సిడి, రియో కాంస్య పతక విజేత అలెక్సిక్, ఎయిర్ రైఫిల్ విజేత, ఫ్రాన్స్‌కు చెందిన రేనాల్డ్, సహచరుడు సంజీవ్ రాజ్‌పుత్ వంటి వారిని షెరాన్ ఓడించాడు. అంతకు ముందు జరిగిన అర్హత పోటీల్లో షెరాన్ ప్రతి పొజిషన్‌లో 40 షాట్లకు 1200 స్కోరుకు 1176 సాధించాడు. పీటర్ సిడి 1178తో అగ్రస్థానంలో నిలిచాడు.

నవశకానికి నాంది : బింద్రా



న్యూఢిల్లీ: మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో అదరగొడుతున్న భారత ఆటగాళ్లపై ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచకప్‌లో తొలిసారి భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచేందుకు అవకాశాలు సృష్టించుకుంది. యువ ఆటగాడు అఖిల్ షెరాన్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ పోటీలో ఆదివారం స్వర్ణ పతకం గెలిచిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు భారత్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలను సాధించింది. షహజర్ రిజ్వీ, మను భకర్, మెహుల్, అంజుమ్ ముద్గిల్ భారత్‌ను అగ్రస్థానంలో నిలిపారు. ఈ సందర్భంగా బింద్రా మాట్లాడారు. 'మెక్సికో ప్రపంచకప్‌లో భారత ప్రదర్శన దేశ షూటింగ్‌లో నవశకానికి నాంది. భవిష్యత్తు సురక్షితమైన చేతుల్లో ఉంది. ఒలింపిక్ పోడియంపై అగ్రస్థానంలో నిలిచే సత్తా మన యువ క్రీడాకారులకు ఉందని నాకు విశ్వాసం ఉంది. ప్రపంచకప్ విజేతలకు అభినందనలు. పతకాలు సాధించేందుకు యువ ప్రతిభను గుర్తించి సానబెట్టిన జూనియర్ జట్టు కోచ్‌లకు, సహాయక సిబ్బందికి ప్రత్యేక అభినందనలు. వారి కృషి ఫలితమే నేటి పతకాలు' అని బింద్రా అన్నారు.

నాకు మరో ఆప్షన్ లేదు : షమి

న్యూఢిల్లీ: భార్య హసీన్ జహాన్ చేస్తున్న సంచలన ఆరోపణలతో టీమిండియా పేసర్ మహ్మద్ షమీ ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. అతడి భవిష్యత్ ఏమౌతుందోనని క్రికెటర్ అభిమానులతో పాటు అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న జట్లు ఆలోచిస్తున్నాయి. కాగా, భార్య చేస్తున్న ఆరోపణలు, వివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని షమీ భావిస్తున్నాడు. విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపిన షమీ ఈ నేపథ్యంలో ఆదివారం మరోసారి మీడియాతో పలు విషయాలు ప్రస్తావించాడు. 'రోజురోజుకు నా భార్య చేస్తున్న ఆరోపణలతో వివాదం ముదురుతోంది. చర్చించుకోవడం ద్వారానే ఈ సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నా. ఇంతకుమించి నాకు మరో ఆప్షన్ ఉన్నట్లు కనిపించడం లేదు. కూతురు కోసం మేమిద్దరం కలిసి ఉండటమే సరైన నిర్ణయం. నా కుటుంబంతో హ్యాపీగా జీవించాలని నేనెప్పుడూ కోరుకుంటాను. నేను కోల్‌కతాకు వెళ్తేనే సమస్య పరిష్కారం అవుతుందంటే కచ్చితంగా వెళ్లి తీరుతా. తను ఎప్పుడు కోరుకుంటే అప్పుడు ఈ గొడవపై ఆమెను కలుసుకుని మాట్లాడి, పరిష్కార మార్గం వెతికేందుకు తాను సిద్ధంగా ఉన్నా' అని షమీ వివరించారు. మరోవైపు ఈ కేసుల కారణంగా ఐపీఎల్ లో షమీ ఆడకపోతే అతడి స్థానంలో ఢిల్లీ డేర్ డెవిల్స్ ఎవరికీ చోటు కల్పిస్తుందన్న దానిపై చర్చ మొదలైంది. షమీ విషయంలో బీసీసీఐని కలిసి మద్దతు కోరుతానని జహాన్ అంటున్నారు.

ఇంగ్లండ్‌లో గెలుస్తాం



ముంబై: దక్షిణాఫ్రికాలో భారత అద్భుత బౌలింగ్ దాడి ఇంగ్లండ్‌లో ఐదు టెస్టుల సిరీస్ గెలిచేందుకు ప్రేరణనిస్తుందని టీమిండియా బ్యాట్స్‌మన్ అజింక్య రహానె అన్నాడు. 'దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో రాణించే బౌలింగ్ వనరులు జట్టులో ఉన్నాయని మేమంతా విశ్వసిస్తున్నాం. అయితే శుభారంభాలు చాలా కీలకం. ఊపు కొనసాగించాలంటే సరైన సన్నద్ధత ఎంతైనా అవసరం' అని రహానె పేర్కొన్నాడు. 'దక్షిణాఫ్రికాలో 60 వికెట్లు పడగొట్టడం అంటే నమ్మశక్యం కాని విషయం. మా పేసర్లు, స్పిన్నర్లు అద్భుతంగా రాణించారు. విదేశాల్లో పర్యటించేటప్పుడు వ్యక్తిగతంగానూ జట్టు పరంగానూ సవాళ్లు ఉంటాయి. మేమంతా చర్చించి వాటిని అధిగమిస్తాం. దక్షిణాఫ్రికాలో చివరి టెస్టు జరిగిన జొహానెస్ పిచ్ చాలా ప్రమాదకరంగా ఉంది. అయితే ఒక వ్యక్తి హీరోగా మారేందుకు అదే అవకాశం ఇస్తుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో అవకాశాలు రాకపోవడంతో చివరి మ్యాచ్‌లో కసితో ఆడా' అని రహానె తెలిపాడు.

షమీ స్థానానికి ఎవరు..?



- కేసులతో ఉక్కిరిబిక్కిరి
- బీసీసీఐ కాంట్రాక్ట్‌లో నో చాన్స్
- ఐపీఎల్ కూడా...?

న్యూఢిల్లీ: యువతులతో వివాహేతర సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా తనపై గృహహింసకు పాల్పడినట్లు భార్య హసిన్ జహాన్ చేసిన ఆరోపణలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న టీమిండియా పేసర్ షమీ.. ఇటీవల బీసీసీఐ ప్రకటించిన వార్షిక వేతనాల కాంట్రాక్ట్ జాబితాలో కూడా చోటు కోల్పోయాడు. మరొకవైపు అతను ఐపీఎల్‌లో ఆడటంపై కూడా అనుమానాలు నెలకొన్నాయి. షమీపై ఐదు రకాల సెక్షన్ల కింద కేసులు నమోదు కావడంతో అతని క్రీడా జీవితం ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలోనే వచ్చే నెలలో ఆరంభయ్యే ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ డేర్ డెవిల్స్ తరపున షమీ ఆడటం కష్టమనే చెప్పాలి. వివాదంలో చిక్కుకున్న అతడిని ఐపీఎల్ క్యాంప్‌లకు అనుమతించాలా? వద్దా అనే సందిగ్ధంలో ఢిల్లీ డేర్ డెవిల్స్ యాజమాన్యం ఉంది. ఈ విషయంలో బీసీసీఐ న్యాయసలహా తీసుకోవాలని యాజమాన్యం భావిస్తోంది. సున్నితమైన అంశం కాబట్టి ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడానికి కూడా ఢిల్లీ డేర్ డెవిల్స్ యాజమాన్యం సిద్ధంగా లేదు. ఒకవేళ ఐపీఎల్‌కు షమీ దూరమైతే అతని స్థానంలో ఎవరు అనేది చర్చనీయాంశమైంది. దీన్లో భాగంగా నలుగురి బౌలర్ల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. విదర్భ పేసర్ రజ్నీస్ గుర్బానీతో పాటు ఇషాంత్ శర్మ, శ్రీనాథ్ అరవింద్, అశోక్ దిండాల పేర్లు తెరపైకి వచ్చాయి.

రజ్నీస్ గుర్బానీ..



2017-18 సీజన్‌లో విదర్భ జట్టు రంజీ ట్రోఫీ గెలవడంలో గుర్బానీది ప్రధాన పాత్ర. ఆ సీజన్‌లో 39 వికెట్లు సాధించి అత్యధిక వికెట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఢిల్లీతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లను సాధించడంతో పాటు మొత్తంగా ఆరు వికెట్లను తన ఖాతాలో వేసుకుని విదర్భ తొలిసారి రంజీ టైటిల్ గెలవడంలో ముఖ్య భూమిక పోషించాడు. ఇక హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్లు, కేరళతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో 5 వికెట్లను, కర్ణాటకతో జరిగిన సెమీ ఫైనల్లో 7 వికెట్లను గుర్బానీ సాధించాడు. అయితే ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఐపీఎల్ వేలంలో గుర్బానీని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. ఐపీఎల్ వేలంలో గుర్బానీ కనీస ధర రూ. 20 లక్షలుండగా అతన్ని కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. మరి ఇప్పుడు షమీకి ప్రత్యామ్నాయంగా గుర్బానీ తొలి స్థానంలో ఉన్నాడు.

ఇషాంత్ శర్మ..



కొంతకాలంగా వికెట్లు సాధించడంలో విఫలమవుతున్న ఇషాంత్ శర్మను ఐపీఎల్-11సీజన్‌లో కొనుగోలు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. అతని కనీస ధర రూ. 75 లక్షలుండగా ఫ్రాంచైజీల నమ్మకాన్ని మాత్రం గెలవలేకపోయాడు. గతేదాది కూడా ఇషాంత్‌ను తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. అయితే చివరి నిమిషంలో మురళీ విజయ్ గాయపడటంతో అతని స్థానంలో ఇషాంత్‌ను కింగ్స్ పంజాబ్ తీసుకుంది. కింగ్స్ పంజాబ్ మెంటార్ సెహ్వాగ్ సలహా మేరకు ఇషాంత్‌ను జట్టులోకి తీసుకున్నారు. అయితే ఆ సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడిన ఇషాంత్ శర్మ ఒక వికెట్‌ను కూడా తీయలేకపోయాడు. అయితే ఇషాంత్‌కు ఐదు వేర్వేరు ఐపీఎల్ జట్లకు ఆడిన అనుభవం ఉంది. దాంతో పాటు ఢిల్లీ లోకల్ బాయ్ కావడం అతనికి కలిసొచ్చే అంశం.

అశోక్ దిండా..



2016 ఐపీఎల్ సీజన్ వేలంలో చివరి నిమిషంలో పుణె జట్టు అశోక్ దిండాని కొనుగోలు చేసింది. ఫైనల్ రౌండ్‌లో దిండా పుణె జట్టులోకి వచ్చాడు. ఆ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు సాధించి పుణె గెలుపులో దిండా కీలక పాత్ర పోషించాడు. ఆ సీజన్‌లో మొత్తం 9 గేమ్‌లు ఆడిన దిండా.. 11 వికెట్లను మాత్రమే సాధించాడు. ఆ తర్వాత 2017 సీజన్‌లో మూడు గేమ్‌లు మాత్రమే ఆడిన ఈ బెంగాల్ పేసర్ దాదాపు రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఐపీఎల్లో 10 ఏళ్ల అనుభవం ఉన్నప్పటికీ దిండాను నిలకడలేమి బాధిస్తోంది. దాంతో ఈ సీజన్ ఐపీఎల్ వేలంలో ఏ ఫ్రాంచైజీ కూడా దిండాను కొనుగోలు చేసేందుకు అస్సలు ఆసక్తికనబరచలేదు. అతని కనీస ధర రూ. 50 లక్షలు కాగా, దిండాకు నిరాశే ఎదురైంది.

శ్రీనాథ్ అరవింద్..



కర్ణాటకకు చెందిన ఈ ఫాస్ట్ బౌలర్.. 2011 ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ తరపున విశేషంగా రాణించాడు. ఆ సీజన్‌లో 21వికెట్లతో అత్యధిక వికెట్లు సాధించిన మూడో బౌలర్‌గా నిలిచాడు. ఆపై 2016-17 సీజన్‌లో మరొకసారి మెరిసినప్పటికీ, ఈ సీజన్‌లో మాత్రం అతన్ని కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపలేదు. ఇటీవల దేశవాళీ క్రికెట్‌కు 33 ఏళ్ల అరవింద్ గుడ్ బై చెప్పాడు. ఈ సీజన్ ఐపీఎల్ వేలంలో అతని కనీస ధర రూ. 50 లక్షలు కాగా, అతను అమ్ముడుపోలేదు. పవర్ ప్లేలో కుదురుగా బౌలింగ్ వేసే అరవింద్ పేరు ఢిల్లీ డేర్ డెవిల్స్ పరిశీలనలో ఉంది.

విజయంపై గురి

- ప్రతీకారంపై భారత్ చూపు
- నేటి మ్యాచ్ గెలిస్తే టాప్‌ప్లేస్‌కు..!
- కేఎల్ రాహుల్‌కు చాన్స్..?



కొలంబో: శ్రీలంక-భారత్- బంగ్లాదేశ్‌ల మధ్య జరుగుతున్న ముక్కోణపు టీ20 సిరీస్ రసకందాయనంలో పడింది. మూడు టీంలు చెరో మ్యాచ్ గెలుచుకోవడంతో మూడింట మధ్య పోటీ తీవ్రంగా ఉంది. అయితే నెట్ రన్‌రేట్ రీత్యా శ్రీలంక అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే సిరీస్ ప్రారంభంలో శ్రీలంక చేతిలో ఐదు వికెట్ల తేడాతో భారత్ ఘోర పరాజయంపాలైంది. అనంతరం తేరుకుని బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. ప్రస్తుతం అదే ఊపులో శ్రీలంకపై కూడా విజయం సాధించి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీలంక్-భారత్‌ల మధ్య నాలుగో మ్యాచ్ జరగనున్నది. అయితే మొదటి మ్యాచ్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. సౌతాఫ్రికాలో జరిగిన వైఫల్యమే ఇక్కడా కొనసాగింది. అయితే బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో పుంచుకున్నాడు. ఇది భారత్‌కు ఒకరకంగా కలిసొచ్చే అంశం. ఇక శిఖర్‌ధావన్ రెండు మ్యాచ్‌ల్లోనూ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడి జట్టుకు అండగా నిలిచాడు. ఇక ఎంఎస్ ధోనీ గైర్హాజరుతో జట్టులోకి వచ్చిన రిషబ్ పంత్ అనుకున్నంతగా విజయం సాధించలేకపోయాడు. అయితే ఆ స్థానం కోసం ఎదురుచూస్తున్న కేఎల్ రాహుల్‌కు ఒకింత నిరాశ తప్పడం లేదు. రాహుల్‌కు ఒక అవకాశం ఇచ్చి, తాను నాలుగో స్థానంలో వచ్చేందుకు మొగ్గుచూపితే పంత్ స్థానం వదులుకోక తప్పదు. అయితే మొదటి మ్యాచ్‌లో జరిగిన తప్పిదాలతో గుణపాఠం నేర్చుకున్న టీమిండియా, రెండో మ్యాచ్‌లో మాత్రం ఫీల్డింగ్‌లో లోపాలను సరిచేసుకోలేదు. అయితే రెండు మ్యాచ్‌ల్లోనూ జరిగిన తప్పిదాలను కనుక గుర్తించి, సరిచేసుకుంటే సోమవారం జరిగే మ్యాచ్‌లో విజయం సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం టోర్నమెంటులో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో మూడు దేశాలు చెరొకటి గెలుచుకున్నాయి. సోమవారం జరిగే మ్యాచ్‌లో కనుక భారత్ విజయం సాధిస్తే పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకే అవకాశం ఉంది. ఒకరకంగా శిఖర్ ధావన్ ఫాంతో భారత్‌కు ఆందోళన లేకపోయినా, రోహిత్ శర్మ వల్లే కొంత ఆందోళకరకంగా తయారైంది. మనీష్ పాండే ఒకమాదిరిగా రాణిస్తున్నాడు. సురేష్‌రైనా, దినేశ్ కార్తీక్‌లు మిడిల్డార్‌లోనూ తమ సత్తా చూపుతున్నారు. ఇక బౌలింగ్‌లో ఉనాద్కట్ స్థిరంగా తన ప్రతిభ చూపుతుండగా, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, యజేవేంద్ర చాహల్ తమ పనిని సులభం చేస్తున్నారు. మరోవైపు శనివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకకు అనుకోకుండా బంగ్లాదేశ్ రూపంలో భారీ షాక్ తగిలింది. ప్రస్తుతం టీం ఆ షాక్‌లోనే ఉన్నారు. బ్యాటింగ్ పరంగా కుశాల్ మెండీస్, కుశాల్ పెరీరాలు ఫాంలోనే ఉన్నారు. దీంతో భారత్ బౌలర్లకు వీరితో ఆందోళన తప్పదు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.